సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 328

శనివారం 10-8-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



ప్రపంచ రికార్డు.. పసిడి పతకం

400 మీటర్ల హర్డిల్స్‌లో అమెరికా మహిళా అథ్లెట్ సిడ్నీ మెక్లాఫ్లిన్ ఘనత - 12లో



సెన్సెక్స్ 820 పాయింట్ల అప్

251 పాయింట్లు పెరిగిన నిఫ్టీ. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలత - 13లో



సిసోడియాకు బెయిల్

ఎక్సైజ్ కేసులో విచారణ ఖైదీగా గడుపుతున్న ఆప్ నేత మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టులో బెయిల్ దొరికింది.

వివరాలు 6లో ▸



నీట్-పీజీ పరీక్ష వాయిదా వేయలేం

నీట్-పీజీ పరీక్ష వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఐదుగురి కోసం 2 లక్షల మందిని ఇబ్బంది పెట్టలేమని తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸



సాధికారత సాధిస్తారా?

విద్యార్థినులు హిజాబ్, బుర్ఖా, టోపీ, నఖాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ ఎన్‌జీ ఆచార్య కాలేజీ సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది.

వివరాలు 6లో ▸

చంద్రబాబు, లోకేశ్‌లే ముద్దాయిలు

వారి తీరు వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలు చేయి దాటిపోయే ప్రమాదం

రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు టీడీపీ నేతలంతా రెడ్‌బుక్ అమలు చేస్తున్నారు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ఆగ్రహం

- సీతారామాపురంలో పోలీసుల సమక్షంలోనే సుబ్బరాయుడి హత్య
- హత్య చేయడానికి వచ్చారని ముందుగానే సమాచారం ఇచ్చినా పోలీసుల నిర్లక్ష్యం
- పోలీసులు, రాజకీయ నేతలు కలిసి భయానక వాతావరణం సృష్టిస్తున్నారు
- మండలానికి ఇద్దరిని చంపండన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిపై ఎందుకు కేసు పెట్టలేదు?
- హత్య చేసిన శ్రీనివాసరెడ్డి కాల్ డేటాను పరిశీలించి.. అందుకు మద్దతు ఇచ్చిన వారిని అరెస్ట్ చేయాలి
- హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్ల బాధితులకు న్యాయం దక్కేలా అండగా నిలుస్తాం
- ఎన్నికల హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకూడదనే భయానక వాతావరణం సృష్టిస్తున్నారు
- ఏ ఒక్కరూ ప్రశ్నించకూడదు.. రోడ్డుపైకి రాకూడదు.. నిలదీయకూడదనే ఇదంతా..

2లో



సుబ్బరాయుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

2లో

- పోలీసు రక్షణ ఏర్పాటు చేసేలా హైకోర్టులో పిటిషన్ వేద్దాం
- సుబ్బరాయుడు కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ పరామర్శ
- ఘటన జరిగిన తీరును వివరించిన బాధిత కుటుంబం
- సీతారామాపురంలో శ్రీనివాసరెడ్డి ఆగడాలు ఏకరువు పెట్టిన బాధితులు
- గ్రామంలో ఎదురుండకూడదనే హత్య : మృతుడి కుమారుడు ప్రసాద్
- రామాలయ నిర్మాణం పేరుతో రూ.కోటిన్నర వసూలు
- ఎన్నో కబ్జాలు.. ఊళ్లో ఇంటికొకరు అతని బాధితులే

అబ్బా.. సర్కారు డబ్బా!

- ఆర్టీసీ కొత్త బస్సుల కొనుగోళ్ల ప్రక్రియ అంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే..
- ఎన్నికల ముందు అవి రాక.. కోడ్‌తో ప్రారంభోత్సవానికి బ్రేక్
- టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు వాటికి జెండా ఊపుతోంది అంతే..
- కానీ, ఇదంతా తామే చేసినట్లుగా బిల్డప్.. నాటి ప్రభుత్వంపై విమర్శలు

3లో

2019-23 మధ్య జగన్ సర్కార్ కొనుగోలు చేసిన కొత్త బస్సులు
1,406

2023లో మళ్లీ కొనుగోలు చేయాలని నిర్ణయించిన బస్సులు
2,736

ఇందులో మొదటి దశ కింద టెండర్లు జరిగిన బస్సులు
1,500

(వీటికే ఇప్పుడు టీడీపీ జెండా ఊపుతోంది)



హామీలిచ్చా.. అప్పులు ఉన్నాయిగా..

- రూ.10 లక్షల కోట్ల అప్పులకు వడ్డీ కట్టాలి.. ప్రధానితో అరకు కాఫీ తాగించి అయన్నే బ్రాండ్ అంబాసిడర్ చేశా..
- రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని, కులాన్ని అధ్యయనం చేస్తున్నా..
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో చంద్రబాబు

12లో

అంబేడ్కర్ విగ్రహంపై దాడి.. సర్కారు పనే

ఇవాళో రేపో విగ్రహాన్నీ ప్రభుత్వం కూల్చేస్తుంది.. కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

- విగ్రహానికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి
- తొలగించిన మాజీ సీఎం పేరును తిరిగి ఏర్పాటుచేయాలి.. రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేయాలి
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కరిస్టులు, ప్రజాస్వామిక వాదులు, వైఎస్సార్‌సీపీ నేతల ఆందోళన
- రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన ఆగ్రహం.. పచ్చమూక దాడిపై నిరసనల వెల్లువ

10లో



విశాఖలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దళిత నాయకులు



ముస్లింలపై మీ వైఖరేంటి?

- సీఎం చంద్రబాబును నిలదీస్తున్న ముస్లిం పెద్దలు
- వక్ఫ్ చట్ట సవరణకు మద్దతిచ్చిన టీడీపీకి మైనార్టీ నేతలు రాజీనామా చేయాలని పిలుపు



సాక్షి, అమరావతి: వక్ఫ్ చట్టాన్ని పటిష్టం చేసి ఆక్రమణదారుల చెర నుంచి భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా సవరణ బిల్లు తేవటాన్ని ముస్లిం సమాజం, మత పెద్దలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ బిల్లు ముస్లిం సమాజానికి గొడ్డలిపెట్టు లాంటిదని స్పష్టం చేస్తు న్నారు. సవరణ బిల్లుకు టీడీపీ మద్దతిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీలోని ముస్లిం మైనార్టీ నేతలు పదవులకు రాజీనామా చేయాలని సూచిస్తు న్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు తెలపడం ద్వారా సీఎం చంద్ర బాబు మరోసారి ముస్లింలపై తన వ్యతిరేకతను

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

నీరజ్ చోప్రాకు వైఎస్ జగన్ అభినందన

సాక్షి, అమరావతి: పారిస్‌లో జరుగుతోన్న ఒలింపిక్స్‌లో పురుషుల జావెలిన్ త్రో విభాగంలో రజత పతకం సాధించిన భారత్ క్రీడాకారుడు నీరజ్ చోప్రాకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. అరుదైన విజయాన్ని సాధించిన నీరజ్ చోప్రాకు అభినందనలు తెలిపారు. నీరజ్ చోప్రా సాధించిన ఈ విజయంతో దేశం మొత్తం గర్విస్తుందని శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పూర్తిగా క్షీణించిన లా అండ్ ఆర్డర్

- రాష్ట్రంలో రెండు నెలలుగా అరాచక పాలన
- దాడులకు, హత్యలకు మద్దతు ఇస్తున్న వారినీ శిక్షించాలి
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో రెండు నెలలుగా అరాచక పాలన సాగుతోంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులే టార్గెట్‌గా టీడీపీ గూండాలు హత్యలకు పాల్పడుతున్నారు. పోలీసుల సమక్షంలోనే ఇవన్నీ జరుగుతున్నాయి. లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది. హత్యలు చేసిన వారే కాదు, చేయించిన వారినీ కఠినంగా శిక్షించాలి' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దాడులకు, హత్యలకు మద్దతు ఇస్తున్న వారిని కూడా ముద్దాయిలుగా చేరిస్తే తప్ప రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బతకదన్నారు. 'నంద్యాల జిల్లా సీతారామాపురంలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల కళ్లెదుటే సుబ్బరాయుడి హత్య జరగడం బాధాకరం. ఈ విషయంపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తాం. అవసరం అయితే సుప్రీం కోర్టుకు కూడా వెళ్తాం. మా కార్యకర్తలందరినీ రక్షించుకుంటాం. పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాను. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చాను' అని శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు.

29న స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడా దినోత్సవమైన ఆగస్టు 29వ తేదీన స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు (క్రీడా ప్రతిభా అవార్డు)లను రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేయనున్నది. ఈ మేరకు శుక్రవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ జిల్లాలో కనీసం ఐదు స్కూల్స్‌ను ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం ఈనెల 16వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిని 17న పరిశీలించి, 18న అభ్యంతరాలు పరిష్కరించి, 20న ఎంపిక చేస్తారని తెలిపారు. 21న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆమోదం కోసం పంపిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



నేతలకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం నాయకులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ గిరిజన విభాగం అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్, ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి వైఎస్సార్ బాటలు వేస్తే.. జగన్ సీఎం అయ్యాక గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి మేలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

పేద రైతులపై టీడీపీ నేతల కుట్ర

- 38 ఏళ్ల కిందట ఇచ్చిన డీ–ఫారం పట్టా భూములు స్వాధీనం

బుచ్చెయ్యపేట (అనకాపల్లి జిల్లా): ఇద్దరు పేద రైతులకు ప్రభుత్వం 38 ఏళ్ల కిందట ఇచ్చిన డీ–ఫారం పట్టా భూములను టీడీపీ నేతల ఒత్తిడి వల్ల శుక్రవారం అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా ఐయ్యరకలపాలేనికి చెందిన కడియాల రామారావుకు 1986లో సర్వే నంబర్ 5–1లో 4.50 ఎకరాలకు, 1990లో సాంబశివరావుకు సర్వే నంబర్ 5–2లో 2.35 ఎకరాలకు ప్రభుత్వం డీ–ఫారం పటాలిచ్చింది. రామారావు, సాంబశివరావు కొద్దికాలం కిందట అనారోగ్యం వల్ల ఇతర ప్రాంతంలో ఉన్న తమ కుటుంబసభ్యుల వద్దకు వెళ్లారు. ఆ భూములను కౌలుకు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పొలాలపై టీడీపీ నేతలు కన్నేశారు. వారు స్థానికంగా లేరని వాటిని స్వాధీనం చేసుకోవాలని బుచ్చెయ్యపేట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు శుక్రవారం జేసీబీ తీసుకొచ్చి పోలీసుల సహాయంతో బలవంతంగా సాగు భూమిలోని పశువుల షెడ్డును తొలగించారు. అది ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటుచేశారు.



నంద్యాలలో వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు, కార్యకర్తలు



సీతారామాపురంలో జగన్‌ను చూసేందుకు తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు



పాణ్యంలో జగన్‌ను చూసేందుకు పరుగులుదీస్తున్న యువకులు

చంద్రబాబు, లోకేశ్‌లే ముద్దాయిలు

వారి తీరు వల్లే రాష్ట్రంలో శాంతిభద్రతలు చేయి దాటిపోయే ప్రమాదం

రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు టీడీపీ నేతలంతా రెడ్‌బుక్ అమలు చేస్తున్నారు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు : రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికార పార్టీ నేతలు ఎవరంతకు వారు రెడ్ బుక్ అమలు చేస్తూ స్వైర విహారం చేస్తున్నారని.. హత్యలు, దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజలు చైతన్యవంతులై వీటిని అరికట్టకపోతే ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదమని, శాంతి భద్రతలు మరింతగా అదుపు తప్పక ముందే అందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో టీడీపీ ప్రభుత్వం చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులతో అరగంటకుపైగా మాట్లాడి ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో మండల నాయకులు, గ్రామ స్థాయిలో గ్రామ నాయకులు వారి వారి రెడ్‌బుక్‌లు తెరిచి ఊళ్లలో ఆధిపత్యం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను నిస్తేజులుగా చేసి, వారి సమక్షంలోనే లా అండ్ ఆర్డర్‌ను నాశనం చేసిన పరిస్థితి సీతారామాపురంలో సుబ్బరాయుడి హత్య, ఆ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని చూస్తే స్పష్టమవుతోందన్నారు. 'సుబ్బరాయుడు కుటుంబం ఎన్నికల సమయంలో బూత్‌లో ఏజెంట్లుగా కూర్చున్నారు. వీరితో పాటు మరో మూడు కుటుంబాల వారు ఏజెంట్లుగా కూర్చున్నారు. దీంతో పెద్దిరెడ్డి, పల్లం శేఖర్, నారపురెడ్డి వీరందరిని చంపాలనే దారుణ రాజకీయాలు చూస్తే ఆశ్చర్యమనిపిస్తోంది. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏమైంది? సుబ్బరాయుడిని హత్య చేసేందుకు బయట నుంచి వచ్చిన వారితో పాటు 35–40 మంది రాడ్లు, రాళ్లు, కత్తులు, కర్రలు పట్టుకుని స్వైర విహారం చేసేందుకు ఏకమయ్యారు. ఇది చూసి నారపురెడ్డి 9.30 గంటలకు ఎస్‌ఐకి ఫోన్ చేశాడు. 'గ్రామంలో వాతావరణం సరిగా లేదు. బయట నుంచి వ్యక్తులు వచ్చారు. రాడ్లు, తుపాకులు, కత్తులు కన్పిస్తున్నాయి. ఏదో జరగబోతోంది. పోలీసులు త్వరగా రావాలి' అని చెప్పాడు. కొద్దిసేపటికి ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. ఎస్‌ఐ గ్రామంలోని పరిస్థితులన్నీ చూశారు. సీఐ, డీఎస్పీలకు ఫోన్ చేశారు. అయినా బందోబస్తు పంపలేదు. ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల ముందు టీడీపీ నేతల స్వైర విహారం కన్పిస్తున్నా ఆపే ప్రయత్నం చేయలేదు. కత్తులు, కట్టెలు కన్పిస్తున్నా ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు ప్రేక్షక పాత్ర పోషించారు. అదనపు బలగాలు రాలేదు' అని నిప్పులు చెరిగారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

> సీతారామాపురంలో సుబ్బరాయుడు హత్యను చూస్తే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని స్పష్టంగా అర్థమవుతోంది. లా అండ్ ఆర్డర్ ఎలా ఉండకూడదో అన్నదానికి చరిత్రలో ఈ ఘటన ఓ ఉదాహరణగా నిలిచిపోతుంది. పోలీసుల సమక్షంలోనే హత్య జరిగింది. హత్య జరుగుతుందనే విషయం ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీలకు చెప్పినా అదనపు బలగాలు పంపలేదు. హత్యను ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు నివారించలేకపోయారు. పథకం ప్రకారం పోలీసులు, రాజకీయ నేతలు కలిసి ఇలాంటి ఘటనలతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. మండలానికి ఇద్దరిని చంపండని స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చెప్పాడు. అయినా అతనిపై కేసులు లేవు. చంపిన వారితో పాటు వారి వెనుక ఉన్న వారిని కూడా కేసుల్లో చేర్చాలి. చంపిన వారికి మద్దతు ఇచ్చిన నారా లోకేశ్, చంద్రబాబు నాయుడులను కూడా ముద్దాయిలుగా చేస్తేనే లా అండ్ ఆర్డర్ బతుకుతుంది.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

పోలీసుల సమక్షంలోనే హత్య

నంద్యాలకు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే సీతారామాపురం ఉంది. ఎస్పీ, డీఎస్పీ వచ్చేందుకు 10 నిమిషాలే పడుతుంది. సరైన సమయంలో పోలీసులను పంపి ఉంటే ఘటన జరిగేది కాదు. అదనపు బలగాలు రాకపోవడంతో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు చూస్తుండగానే అర్ధరాత్రి 12.20 గంటలకు సుబ్బరాయుడిని హతమార్చారు. మరో రెండు కుటుంబాలపై దాడి చేశారు. సుబ్బరాయుడు భార్యను నరికి గాయపరిచారు. ఇవన్నీ జరుగుతున్నా ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు ఆపలేదు. లోకేశ్, చంద్రబాబునాయుడు అండదండలతోనే పోలీసులు ఎవ్వరూ గ్రామంలోకి రాకుండా పథకం వేసినట్లు అన్పిస్తోంది. నారపురెడ్డిని పోలీసు స్టేషన్‌కు వెళ్లిపో అని ఎస్‌ఐ చెప్పాడు. నారపురెడ్డి స్టేషన్‌కు వెళ్లిన తర్వాత హత్య జరిగింది. హత్య ఘటన తెలిసి 12.59కి పోలీసుస్టేషన్ నుంచి ఎస్పీకి నారపురెడ్డి ఫోన్ చేశాడు. 'మా ఊళ్లో మనుషులను చంపారు. ఇప్పుడే తెలిసింది. మా ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి. ఆ దృశ్యాలు మీకు పంపిస్తున్నా. చూడండి' అని చెప్పినా అదనపు బలగాలు రాలేదు. చంపిన వారు దర్జాగా ఊరు వదిలే పరిస్థితి. వాళ్లను పట్టుకున్న నాథుడే లేడు. పట్టుకునేందుకు పోలీసులు రాలేదు. 1.08 గంటలకు మళ్లీ నారపురెడ్డి ఫోన్ చేశాడు. ఎస్పీ ఆఫీసుకు వస్తున్నామని చెప్పారు. ఆపై 3.18 గంటలకు మళ్లీ ఫోన్ చేశాడు. 'హంతకుల ముఠాలో రమణ అనే వ్యక్తిని అతి కష్టం మీద పట్టుకున్నాం. అతన్ని అదుపులోకి తీసుకుని మిగిలిన వారిని అరెస్టు చేయండి' అని చెప్పారు. చివరకు 3.28 గంటలకు ఎస్పీ నారపురెడ్డికి ఫోన్ చేసి మీరు పట్టుకున్న రమణను నంద్యాల త్రీటౌన్‌లో అప్పగించాలని చెప్పారు. చివరకు పోలీసులు రమణను ఎస్పీ ఆఫీసులోపలికి తీసుకెళ్లారు.

ఈ ప్రశ్నలకు సమాధానాలేవీ?

- గ్రామంలో ఘటన జరుగుతుందని పోలీసులకు ఫోన్ వచ్చింది. పోలీసుల సమక్షంలో హత్య జరుగుతున్నా ఎందుకు అదనపు బలగాలు రాలేదు?
- హత్య చేసి పలువురిని గాయపరిచిన వారంతా గ్రామం వదిలిపోయేదాకా వారిని పట్టుకునే ప్రయత్నం పోలీసులు ఎందుకు చేయలేదు?
- ఈ హత్య వెనుక ఎవరి ప్రోద్బలం ఉంది? ఎవరు ఆడిస్తున్నారు?
- సీఐ, డీఎస్పీ, ఎస్పీ ఏ ఒక్కరూ అదనపు బలగాలు పంపించకుండా ఆపగలిగారంటే నాయకులు, పోలీసులు కలిసి ఏ స్థాయిలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారనేది స్పష్టమవుతోంది. అసలు ఇక్కడ లా అండ్ ఆర్డర్ ఉందా?
- రాష్ట్రంలో ప్రతీ ఘటన ఇలాగే ఉంది. వినుకొండలో రషీద్ అనే వ్యక్తిని నడిరోడ్డుపై నరికారు. ఇదే శ్రీశైలం నియోజకవర్గంలోని దాసు (హత్య ఫొటోలు చూపిస్తూ)ను చంపారు. దాసు కుమారుడు నా వద్దకు వచ్చి మా నాన్నను జూన్ 26న పట్టపగలే చంపారు అని చెప్పాడు. నాయకులు, పోలీసులు కలిసే ఘటనలు జరిగేలా చేస్తారు.. భయానక వాతావరణం సృష్టిస్తారు.. తప్పనిసరి కేసు పెట్టాల్సి వచ్చినపుడు చిన్న చిన్న ముద్దాయిలను చేర్చి కేసును ఆపేస్తున్నారు. చేయించిన వారు ఎవరు? ఎమ్మెల్యే పేరు ఎందుకు కేసుల్లో చేర్చడం లేదు?
- సుబ్బరాయుడిని చంపిన శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి ఉండడా? హత్యకు ముందు.. ఆ తర్వాత అతను ఎవరితో మాట్లాడారో కాల్ డేటాను ఎందుకు పరిశీలించలేకపోతున్నారు? కేసును ఎందుకు వారి వద్దకు పోకుండా ఆపుతున్నారు?

ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నించకూడదనే..

ఎన్నికల వేళ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రజలకు మంచి చేసి.. వారి మనసులో స్థానం సంపాదించుకోవాలనే ఆలోచనే ప్రభుత్వంలో కన్పించడం లేదు. రెండు నెలలుగా రాష్ట్రంలో అరాచకం, మారణహోమం సృష్టించే పాలన నడుస్తోంది. ఎన్నికలప్పుడు చంద్రబాబు నాయుడు ఏం మాటలు చెప్పారో, ప్రజలను ఎలా మోసం చేస్తూ ఓట్లు వేయించుకున్నారో అందరికీ తెలుసు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో, ప్రశ్నించకూడదనే ఆలోచనతో భయానక వాతావరణాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సృష్టిస్తున్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు, ఆయన పార్టీ అభ్యర్థులు క్యాంపెయిన్ చేస్తూ చిన్న పిల్లలు కన్పిస్తే చాలు 'నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు నీకు రూ.15 వేలు' అని చెప్పి ప్రలోభ పెట్టారు. అక్క చెల్లెమ్మలు కన్పిస్తే 'ప్రతి అక్కచెల్లెమ్మకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు సంతోషమేనా?' అని అడిగారు. నిరుద్యోగి కన్పిస్తే 'రూ.3 వేల నిరుద్యోగ భృతి సంతోషమా?' అని.. రైతులు కన్పిస్తే 'మీకు రూ.20 వేలు సంతోషమా?' అని అడిగారు. ఇలాంటి ఆలోచనలు, మాటలతో ఇంటింటికీ టీడీపీ శ్రేణులను పంపించి చంద్రబాబు ప్రచారం చేయించారు. ఎన్నికల తర్వాత చిన్న పిల్లలను మోసం చేశారు. అదే జగనన్న ఉండి ఉంటే ఇప్పటికే రూ.15 వేలు అమ్మ ఒడి అంది ఉండేది. తల్లికి వందనం అని చెప్పి పిల్లలందరినీ మోసం చేయడమే కాకుండా తల్లికి పంగనామం పెట్టారు. వ్యవసాయ సీజన్ మొదలైంది. రైతులు ముమ్మరంగా వ్యవసాయం చేస్తున్నారు. జగన్ ఉండి ఉంటే ఈ పాటికే రైతు భరోసా సొమ్ము అందేది. ఆ సొమ్మూ పోయింది. చంద్రబాబు ఇస్తామన్న రూ.20 వేలు పోయింది. 18 ఏళ్లు నిండిన ప్రతి అక్కచెల్లెమ్మకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తానని చెప్పి అడ్డగోలుగా మోసం చేశాడు. జగనే ఉండి ఉంటే ఈ పథకాలు రావడంతో పాటు చదువుకుంటున్న పిల్లలకు విద్యా దీవెన, వసతి దీవెన కింద ఫీజులు కూడా కట్టేవాడు. ఇవి కూడా ఇవ్వకుండా, పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ కింద డబ్బులు జమ చేయకుండా చంద్రబాబు మోసం చేశాడు. ఇలా రైతులు, చిన్న పిల్లలు, అక్క చెల్లెమ్మలు అందరినీ మోసం చేశారు. ఏ ఒక్కరూ ప్రశ్నించకూడదు.. రోడ్డుపైకి రాకూడదు.. నిలదీయకూడదు.. అని రాష్ట్ర వ్యాప్తంగా రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారు.

ఎమ్మెల్యే బుడ్డాపై ఎందుకు కేసు పెట్టలేదు?

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పింది. ఈ ఘటనలపై హైకోర్టుతో పాటు అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం. కోర్టుల ద్వారా పికెటింగ్ ఏర్పాటు చేసి బాధితులకు రక్షణ కలిగేలా చేస్తాం. అప్పుడే కొద్దోగొప్పో ప్రజాస్వామ్యం బతుకుతుంది. హత్య చేసిన వారితో పాటు చేయించిన వారిని కూడా ముద్దాయిలుగా చేరుస్తూ జైల్లో పెట్టాలి. అప్పుడే రాష్ట్రంలో అరాచకాలు ఆగుతాయి. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విజయోత్సవ సభ అని కౌంటింగ్ తర్వాత మీటింగ్ పెట్టారు. ఆయన ఎలా మాట్లాడారో చూడండి. (ఫోన్‌లో బుడ్డా మాట్లాడిన వీడియోను చూపుతూ) 'మంచి పట్టుడు కట్టెలు పెట్టుకోండి. మండలానికి ఇద్దరిని పీకండి. చేతకాకపోతే చెప్పండి. నేను మనుషులను పంపిస్తా. కండువా వేసుకుని మన పార్టీలో చేరితే మనకు అభ్యంతరం లేదు. లేదంటే తోలు తీయడమే' అని ఆ పార్టీ వాళ్లను రెచ్చగొట్టారు. మండలానికి ఇద్దరిని చంపండి.. దాడులు చేయండి.. కేసులు, పోలీసులు నేను చూసుకుంటా.. అంటున్నాడు. స్థానిక ఎమ్మెల్యే మీటింగ్‌లు పెట్టి ఇంత దారుణంగా చంపమని చెబుతుంటే పోలీసులు ఎందుకు కేసులు పెట్టలేదు? చంపిన వారిపై మాత్రమే కాదు.. వారికి రక్షణ ఇచ్చే వారిపై కూడా కేసులు పెడితేనే లా అండ్ ఆర్డర్ నిలబడుతుంది.



సీతారామాపురంలో వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన జనవాహిని

దారి పొడవునా ఘన స్వాగతం

ఉదయం 10.15 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి ఓర్వకల్లు మీదుగా హుస్సేనాపురం, తమ్మరాజుపల్లె, పాణ్యం డొంక, బలపనూరు, వెంకటేశ్వరపురం, టోల్‌గేట్, నంద్యాల బైపాస్, అయ్యలూరి మెట్ట, నందిపల్లె మీదుగా సీతారామాపురం చేరుకున్నారు. ఓర్వకల్లు నుంచి సీతారామాపురం చేరుకోవడానికి మామూలుగా గంట పడుతుంది. అలాంటిది అడుగడుగునా ప్రజాభిమానం వెల్లువెత్తడంతో 5 గంటలకు పైగా పట్టింది. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, అభివాదం చేస్తూ 3.20 గంటలకు సీతారామాపురం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, ఇసాక్, ఎమ్మెల్యే విరూపాక్షి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీలు పోచా బ్రహ్మానందరెడ్డి, బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, హఫీజ్ ఖాన్, గంగుల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- పోలీసు రక్షణ ఏర్పాటు చేసేలా హైకోర్టులో పిటిషన్ వేద్దాం
- హత్యకు గురైన సుబ్బరాయుడు కుటుంబ సభ్యులకు జగన్ పరామర్శ
- వైఎస్సార్‌సీపీ తరపున ప్రచారం చేశామని కక్ష : జయనారపురెడ్డి
- నన్నూ చంపుతామని బెదిరించారు : శేఖర్

సాక్షి, నంద్యాల : ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, మీకు ఏ కష్టమొచ్చినా అన్ని విధాలా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఇటీవల హత్యకు గురైన సుబ్బరాయుడు కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. పోలీసు రక్షణ ఏర్పాటు చేసేలా హైకోర్టులో పిటిషన్ వేస్తామని చెప్పారు. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని మహానంది మండలం సీతారామాపురంలో టీడీపీ గూండాల దాడిలో పాశవికంగా హత్యకు గురైన పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. నేరుగా సుబ్బరాయుడి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి హత్య ఎలా జరిగిందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు కోడలు పసుపులేటి కుమారి మాట్లాడుతూ.. 'ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి 30–40 మంది వచ్చారు సార్.. ఇష్టమొచ్చినట్లు బూతులు తిట్టారు. బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి అంటే తెలియదేంటే మీకు.. మీరెలా సంసారం చేస్తారో చూస్తా.. మీ ఆటోలు తగలబెడతా.. మీరు ఎలా ఊర్లో బతుకుతారో నేనూ చూస్తా..' అంటూ నోటికొచ్చినట్లు తిట్టాడు సార్. ఇంటి సోఫాలో పడుకున్న మా అత్తను బయటికి లాక్కొచ్చారు. ఆమె ఎంత బతిమలాడినా వినలేదు. ఇంటి తలుపులు గట్టిగా కొట్టడంతో లోపల పడుకున్న మా మామ వాకిలి (తలుపులు) తీయగానే ఒక్కసారిగా కట్టెలు, రాడ్లతో దాడి చేశారు. ఇంట్లో నుంచి బయటికి లాక్కెళ్లి రాళ్లతో తల మీద కొట్టారు. నెత్తురు కారి విలవిలలాడుతున్నా వదలలేదు. 25 నిమిషాల పాటు నరకం చూపించారు. చివరికి కొన ఊపిరితో ఉన్నాడని తెలిసి వెనక్కి వచ్చి మళ్లీ నెత్తి మీద బండరాయితో కొట్టి చంపేశారు' అని చెబుతూ ఆమె కన్నీటి పర్యంతమైంది. సుబ్బరాయుడు భార్య పసుపులేటి సుబ్బమ్మ మాట్లాడుతూ.. తన భర్తను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని రోదించారు. ఆయన్ను చంపుతుంటే కనీసం అరవలేదని.. తన అరుపులు విని కుటుంబ సభ్యులు బయటికి వస్తే వాళ్లను కూడా చంపుతారనే భయంతో నొప్పిని భరిస్తూ ప్రాణాలు వదిలాడని చెప్పింది. అడ్డుకునేందుకు తాను వెళితే వీపు మీద కట్టెలతో కొట్టారని, ఇనుప రాడ్‌తో కొట్టడంతో చేతికి తొమ్మిది కుట్లు పడ్డాయని వైఎస్ జగన్‌కు వివరించారు.



బలపనూరు వద్ద ఓ చిన్నారి కోరిక మేరకు కారు దిగి మరీ ఆమెతో ఫొటో దిగుతున్న వైఎస్ జగన్



కన్ను పడితే కబ్జానే..

శ్రీనివాసరెడ్డి కన్ను పడిందంటే ఆ స్థలాన్ని కబ్జా చేసే వరకు వదలడని సుబ్బరాయుడు కుమారుడు ప్రసాద్.. వైఎస్ జగన్‌కు వివరించారు. గ్రామంలో కోదండరామాలయం నిర్మిస్తామని చెప్పి రూ.కోటియాభై లక్షల వరకు వసూలు చేశాడని, అలాగే తమ స్థలాన్ని కబ్జా చేసి వేర్‌హౌజ్, లైట్ వెయిట్ ఇటుకల ఫ్యాక్టరీ నిర్మించాడని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరూ అతనికి ఎదురు నిలవకూడదనే కక్షతోనే తన తండ్రిని హత్య చేసినట్లు తెలిపాడు. గ్రామంలో ప్రతి ఇంట్లో శ్రీనివాసరెడ్డి బాధితులు ఉన్నారని, నాన్నను చంపుతుంటే ఊర్లో ఏ ఒక్కరూ బయటికి రాలేదని.. అందరూ తలుపులు మూసుకుని ఉదయం వరకు తీయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆధిపత్యం పోకూడదనే..

గ్రామంలో 35 ఏళ్ల కిందట ఇదే శ్రీనివాసరెడ్డి ఇద్దరిని హత్య చేశాడని, అప్పటి నుంచి గ్రామంలో అతను ఏది చెబితే అదే నడుస్తోందని వైఎస్సార్‌సీపీ కార్యకర్త జయనారపురెడ్డి.. జగన్ దృష్టికి తెచ్చారు. 30 ఏళ్లుగా గ్రామంలో ఎన్నికలు జరగలేదని.. ఈ ఎన్నికల్లో అతని మాట కాదని తాము వైఎస్సార్‌సీపీ తరపున ప్రచారం చేశామన్నారు. వైఎస్సార్‌సీపీకి భారీగా ఓట్లు రావడంతో ఎక్కడ తన ఆధిపత్యానికి గండి పడుతుందోనన్న భయంతోనే ఈ హత్యకు పాల్పడినట్లు చెప్పారు. శనివారం రాత్రి గ్రామంలో ఉండి ఉంటే తనను కూడా చంపేసేవారన్నారు.

మా ఎకరం స్థలాన్ని కబ్జా చేశారు

'గ్రామంలో మాకున్న ఎకరం పొలాన్ని శ్రీనివాసరెడ్డి కబ్జా చేశాడు. ఇది పద్ధతి కాదని ఎదురు తిరిగితే 2021 నుంచి మమ్మల్ని వేధిస్తున్నాడు' అని వైఎస్సార్‌సీపీ కార్యకర్త శేఖర్.. వైఎస్ జగన్‌కు వివరించారు. 'మా స్థలం మాకు ఇవ్వండని అడిగినందుకు మా అన్న పల్లం నాగరాజుపైన రేప్ కేసు పెట్టించాడు. హత్య జరిగిన రోజు మా ఇంటికి కూడా టీడీపీ గూండాలతో కలిసి వచ్చాడు. పెరాలసిస్‌తో బాధ పడుతున్న మా నాన్నను బండ బూతులు తిడుతూ మీ కొడుకును చంపేస్తామని బెదిరించారు' అని వివరించాడు.

న్యాయం జరిగేలా చూస్తాం

సుబ్బరాయుడు కుటుంబ సభ్యులందరూ మాట్లాడిన అనంతరం జగన్ మాట్లాడుతూ ఎవరికీ భయపడొద్దని ధైర్యం చెప్పారు. పార్టీ మీకు అండగా ఉంటుందని, పార్టీ పరంగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అన్ని విధాలా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. 30–40 మంది టీడీపీ గూండాలు కత్తులు, రాడ్లు, రాళ్లు పట్టుకుని స్వైర విహారం చేస్తుంటే పోలీసులు కనీసం గన్ కూడా తెచ్చుకోకుండా ఎలా వచ్చారని ప్రశ్నించారు. మీకు ప్రాణహాని ఉందని, రక్షణగా పోలీసు బందోబస్తు పెట్టాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేయిస్తామని.. అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు.

ముస్లింలపై మీ వైఖరేంటి?

▶ మొదటి పేజీ తరువాయి
బయట పెట్టారని పేర్కొంటున్నారు. ముస్లిం మైనార్టీల హక్కుల పరిరక్షణకు చంద్రబాబు అనుకూలమో కాదో సూటిగా చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎన్డీఏ ప్రకటనలు చేసినప్పుడు కూడా చంద్రబాబు కనీసం నోరు విప్పలేదని ప్రస్తావిస్తున్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో టీడీపీ, జనసేన మద్దతు పలకగా వైఎస్సార్ సీపీ గట్టిగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. దీంతో దీన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వక్ఫ్ చట్టంలో పలు సవరణలు..
దేశవ్యాప్తంగా ముస్లిం ధార్మిక సంస్థల ఆస్తుల పరిరక్షణకు ఆంగ్లేయుల హయాంలోనే 1937లో వక్ఫ్ చట్టం తెచ్చారు. స్వాతంత్ర్యం అనంతరం 1955, 1995లో సవరణలు చేశారు. వక్ఫ్ భూములను ముస్లింలకు మాత్రమే లీజుకు ఇవ్వాలనే నిబంధనను సవరించి ఎవరికైనా ఇవ్వొచ్చని చేర్చారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సవరణ బిల్లులో ముస్లిం అనే పదం లేకుండా బోర్డులో సభ్యులను తీసుకోవచ్చని పేర్కొన్నారు. సాధారణంగా ఒక మతానికి చెందిన బోర్డు, సంస్థల్లో అన్య మతస్తులను అనుమతించరు. అందుకు విరుద్ధంగా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ముస్లిమేతరులను నియమించుకునేలా సవరణ బిల్లు అవకాశం కల్పిస్తోంది. వక్ఫ్ ఆస్తుల ఆజమాయిషీ అధికారాలను పూర్తిగా కలెక్టర్లకు అప్పగించేలా సవరణ ప్రతిపాదించారు.

తక్షణమే ఉపసంహరించుకోవాలి



వక్ఫ్ చట్టంలో ఇష్టారాజ్యంగా సవరణలు చేయడాన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజ్యాంగాన్ని కల్పించిన ప్రాథమిక హక్కులు, మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తూ సవరణలు తేవడం దారుణం. మైనార్టీల హక్కులు, మతస్వేచ్ఛను కాలరాసే యత్నాన్ని అడ్డుకుంటాం. ఒక్కసారి వక్ఫ్‌కు దానం చేస్తే అది ఎప్పటికీ వక్ఫ్‌దే. ఎన్డీఏ ప్రభుత్వం మైనార్టీలను శత్రువులుగా చూస్తోంది. దేశంలో 9 లక్షల ఎకరాల ఆస్తులు వక్ఫ్ కింద ఉన్నాయి. ఈ సవరణల ద్వారా కాజేసే యత్నాలు జరుగుతున్నాయి. వక్ఫ్ నిర్వచనాన్ని మార్చే చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. వక్ఫ్ ట్రిబ్యునల్‌ను కూడా కాలరాసే యత్నం చేస్తున్నారు. తక్షణమే కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– ఎస్.బి.అంజాద్ బాషా, మాజీ డిప్యూటీ సీఎం

వక్ఫ్ భూములు కట్టబెట్టే కుట్ర



అత్యధిక వక్ఫ్ భూములున్న యూపీ, మధ్యప్రదేశ్‌లో ఆక్రమణకు గురైన విలువైన వక్ఫ్ భూములను చట్టబద్ధం చేసేందుకే సవరణ బిల్లు తెచ్చారు. దీనికి మద్దతు ప్రకటించిన టీడీపీ, జనసేనకు ముస్లిం సమాజం స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయం. రెండు రోజుల్లో ఏపీతోపాటు అన్ని రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించి ముస్లిం సమాజానికి ముంచుకొచ్చిన ప్రమాదాన్ని వివరిస్తాం.

–షేక్ మునీర్ అహ్మద్, ఏపీ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్

దగా చేయడమే



ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తోంది. వక్ఫ్ చట్ట సవరణకు టీడీపీ మద్దతు తెలిపి ముస్లింలను దగా చేసింది. దీనిపై పోరాటానికి ముస్లిం సమాజం సిద్ధం కావాలి.

– అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు, మాజీ డైరెక్టర్, కాకినాడ

రాజ్యాంగ విరుద్ధం



వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్ సీపీ వ్యతిరేకిస్తోంది. వక్ఫ్ ఆస్తి అంటే అది అల్లాకు సంబంధించినది. ఓ ముస్లిం సమాజ సంక్షేమం, మేలు చేయడానికి ఇచ్చిన ఆస్తి. అది ఒక్కసారి ఇచ్చిన తరువాత ఎవరు కొనుగోలు, అమ్మకాలు చేయరాదు. దీని నుంచి వచ్చే ఆదాయాన్ని సమాజం మేలు కోసం ఉపయోగించాలి. సవరణ బిల్లు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. కలెక్టర్‌కు పూర్తి అధికారాలు ఇవ్వడంతోపాటు వక్ఫ్ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేసేలా బిల్లులో అంశాలున్నాయి. ఇతర మతస్తులను నామినేట్ చేసేలా బిల్లులో ప్రతిపాదించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దీన్ని పార్లమెంటులో మా పార్టీ ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డి గట్టిగా వ్యతిరేకించారు. ముస్లిం సోదరులకు సంబంధించిన సున్నితమైన విషయాలపై పునరాలోచన చేయాలి. ఎన్నికల ముందు ముస్లిం సమాజానికి ఇచ్చిన వాగ్దానాలకు టీడీపీ కట్టుబడి ఉండాలి. ఈ బిల్లును వ్యతిరేకించాల్సింది పోయి టీడీపీ మద్దతు ఇవ్వడం దారుణం. బిల్లును వ్యతిరేకించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కి ముస్లిం సోదరుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– హఫీజ్ ఖాన్, వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ నిర్ణయం అభినందనీయం



వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన వైఎస్సార్ సీపీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ముస్లింలందరూ స్వాగతిస్తున్నారు. ముస్లిం హక్కుల పరిరక్షణ విషయంలో వైఎస్సార్ సీపీ ముందుండి నడిపిస్తోంది.

– డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

టీడీపీ మైనార్టీల ద్రోహి



టీడీపీ తొలి నుంచి ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకమే. వక్ఫ్ ఆస్తుల విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయానికి టీడీపీ మద్దతు తెలపడం సిగ్గుచేటు. దీనిపై ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మైనార్టీలకు అండగా నిలబడ్డారు. మొదటి నుంచి వైఎస్సార్ కుటుంబం మైనార్టీలకు అండగా నిలుస్తోంది.

– షేక్ నూరిఫాతిమా, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, తూర్పు నియోజకవర్గం, గుంటూరు

టీడీపీ తీరు మారకుంటే తీవ్ర పరిణామాలు

ముస్లిం ప్రయోజనాలను దెబ్బతీసే యత్నాలకు టీడీపీ, జనసేన వంత పాడటం దుర్మార్గం. ముస్లింల పట్ల టీడీపీ తీరు మారకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు. రాష్ట్రంలో వక్ఫ్ భూములకు సంబంధించిన వివాదాలు రెవెన్యూ, వక్ఫ్‌బోర్డు మధ్య ఉన్నాయి. కలెక్టర్లకు వక్ఫ్ భూములపై పూర్తి అధికారాలు అప్పగించడమంటే ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం చేయడమే. ముస్లిం మత విశ్వాసాల్లో అన్య మతస్తుల జోక్యంతో మత సామరస్యానికి విఘాతం కలుగుతుంది.

–షేక్ నాగుల్ మీరా, ఏపీ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించండి

సీఎం చంద్రబాబుకు ముస్లిం మైనారిటీ సంఘాల వినతి

సాక్షి, అమరావతి: వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించి సెలెక్ట్ కమిటీకి పంపాలని విజ్ఞప్తి చేస్తూ సీఎం చంద్రబాబుకి ముస్లిం మైనారిటీ సంఘాలు శుక్రవారం వినతిపత్రం ఇచ్చాయి. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ముస్లింలకు అపోహలున్నందున చర్చ జరిగేలా సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరారు.


రాజ్యాంగ ఉల్లంఘనే...

వక్ఫ్ బోర్డు నిబంధనల్లో సవరణ చేయటం ముస్లిం మైనారిటీల మనోభావాలను దెబ్బతీయడమే. వైఎస్సార్‌సీపీ ఎంపీలు వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించటం హర్షణీయం.

– ఎంఏ బేగ్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు

తుంగభద్రలో అంచనాలకు మించి నీరు

- ఈ ఏడాది 173 టీఎంసీల లభ్యత ఉంటుందని తుంగభద్ర బోర్డు అంచనా



సాక్షి, అమరావతి: ప్రస్తుత నీటి సంవత్సరం ప్రారంభంలో తుంగభద్ర బోర్డు అంచనా వేసిన 173 టీఎంసీల కంటే తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత అధికంగా ఉండే అవకాశం ఉందని సాగునీటిరంగ నిపుణులు చెబుతుండటంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2019, 2020, 2021, 2022 తరహాలోనే రాష్ట్రానికి దక్కాల్సిన వాటా నీటిని విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. గతేడాది డ్యామ్‌లోకి కేవలం 114.58 టీఎంసీల ప్రవాహమే వచ్చినా.. రాష్ట్రానికి గరిష్ఠ స్థాయిలో నీటిని రాబట్టి ఆయకట్టు రైతుల ప్రయోజనాలను ప్రభుత్వం పరిరక్షించిందని గుర్తుచేస్తున్నారు. జూన్ 1 నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు తుంగభద్ర డ్యామ్‌లోకి 249.02 టీఎంసీల ప్రవాహం వచ్చింది. ఇందులో 104.70 టీఎంసీలను డ్యామ్‌లో నిల్వచేసి.. కాలువలకు 25 టీఎంసీలు విడుదల చేసి.. మిగిలిన 120 టీఎంసీలను గేట్లు ఎత్తి దిగువకు వదిలేశారు. తుంగభద్ర డ్యామ్‌లోకి నవంబర్ చివరి వరకు వరద ప్రవాహం కొనసాగుతుంది. ఈలెక్కన డ్యామ్‌లో నీటి లభ్యత బోర్డు అంచనా వేసిన 173 టీఎంసీల కంటే అధికంగా ఉంటుందని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు.

కోటా నీటిని రాబడితేనే రైతులకు ప్రయోజనం
తుంగభద్ర డ్యామ్‌లో 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49, ఏపీకి 72 (హెచ్చెల్సీ 32.50, ఎల్లెల్సీ 29.50, కేసీ 10.00), తెలంగాణకు 6.51 (రాజోలిబండ డైవర్షన్ స్కీం) టీఎంసీల చొప్పున కేటాయించింది. ఏటా పూడిక పేరుకుపోతుండటంతో డ్యామ్ నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. 2016లో నిర్వహించిన సర్వేలో డ్యామ్ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. తగ్గిన నిల్వ సామర్థ్యం, నీటిలభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు పంపిణీ చేస్తూ వస్తోంది. 2019–20, 2020–21, 2021–22, 2022–23, 2023–24ల్లో తుంగభద్ర బోర్డు చరిత్రలో అత్యధిక స్థాయిలో రాష్ట్ర కోటా కింద హెచ్చెల్సీ, ఎల్లెల్సీ, కేసీ కెనాల్ వాటాను రాబట్టిన ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పరిరక్షించింది. నాలుగేళ్లు ఏటా సగటున 69 టీఎంసీలను బోర్డు నుంచి ప్రభుత్వం విడుదల చేయించింది. గతేడాది తుంగభద్ర డ్యామ్‌లోకి కేవలం 114.58 టీఎంసీల ప్రవాహమే వచ్చినా.. 40 టీఎంసీలు రాష్ట్రానికి దక్కేలా చేసి రైతుల ప్రయోజనాలను పరిరక్షించింది. ఈ ఏడాది నీటి లభ్యత పెరిగిన నేపథ్యంలో 2019–23 మధ్య తరహాలోనే ఇప్పుడూ గరిష్ఠంగా నీటి వాటాను రాబట్టి ప్రయోజనాలను పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు.

స్థిరంగా కృష్ణ.. పెరిగిన గోదా'వడి'

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్/పోలవరం రూరల్: వరద ప్రవాహం కృష్ణాలో స్థిరంగా కొనసాగుతుంటే.. గోదావరిలో ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. శుక్రవారం ప్రకాశం బ్యారేజీలోకి 2,75,468 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 13,768 క్యూసెక్కులను ఇస్తూ.. మిగులుగా ఉన్న 2,61,700 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. బేసిన్ పరిధిలో గురువారం కురిసిన వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి ఎగువన భద్రాచలం వద్ద నీటిమట్టం 33.60 అడుగులకు చేరుకుంది.

రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్‌లు బదిలీ

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
గిరీషా పి.ఎస్	యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్	వీసీ, ఎండీ, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ
బి.నవ్య	గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్	కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్
ఎస్.భార్గవి	గురుకులం సెక్రటరీ	గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, గురుకులం సెక్రటరీగా పూర్తి అదనపు బాధ్యతలు
కొత్తమాసు దినేష్‌కుమార్	ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ డిపార్ట్‌మెంట్	ఎండీ, ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఏపీ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు
ప్రవీణ్ ఆదిత్య సి.వి.	ఏపీ మారీటైమ్ బోర్డ్ సీఈవో	ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు
డి.హరిత	వెయిటింగ్ ఫర్ పోస్టింగ్	అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్
ఎస్.చిన్నరాముడు	వీసీ, ఎండీ ఏపీఎస్‌సీఎస్‌సీ	తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్
పి.శ్రీనివాసులు	చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్	కమిషనర్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్
తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డి	సీతంపేట ఐటీడీఏ పీవో	పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్
సేధు మాధవన్	పార్వతీపురం ఐటీడీఏ పీవో	విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్
కొల్లాబత్తుల కార్తీక్	విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్	నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్

- సాక్షి, అమరావతి

గిరిజన వర్సిటీలో యూజీ ప్రవేశాలకు నోటిఫికేషన్

విజయనగరం అర్బన్: విజయనగరం కేంద్రీయ గిరిజన వర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి వివిధ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ కోర్సుల్లో ప్రవేశాలకు వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నాలుగేళ్ల నిడివికల ఆనర్స్ అండ్ ఆనర్స్ విత్ రీసెర్చ్‌తో కూడిన బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జియోలజీ, బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో ప్రవేశాలుంటాయని తెలిపారు. ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన సీయూఈటీ (యూజీ) పరీక్ష రాసిన వారు ceuap.ac.in, ctuapcuet.-samarth.edu.in వెబ్‌సైట్లలో ఈ నెల 16వ తేదీ రాత్రి 11.55 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 089922 96033లో సంప్రదించాలని కోరారు.

ఆర్జీయూకేటీ రెండోవిడత కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

వేంపల్లె/నూజివీడు: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలలో రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు అడ్మిషన్ కన్వీనర్ ప్రొ.అమరేంద్రకుమార్ సండ్ర పేర్కొన్నారు. శుక్రవారం నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల క్యాంపస్‌లకు 2024–25కు సంబంధించి 238 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలువగా 134 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి 310 మంది విద్యార్థులు హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణంపై త్వరలో నిర్ణయం

రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. విజయవాడలో ఆయన ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు అంశంపై సీఎం చంద్రబాబు ఈనెల 12న సమీక్షిస్తారని తెలిపారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 7 వేల పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. ఇసుక, బియ్యం అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.


ఎంబీబీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్

నేటి నుంచి ఈ నెల 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

రాష్ట్రంలో 34 వైద్య కళాశాలలు
మొత్తం 6,210 ఎంబీబీఎస్ సీట్లు
వీటిలో కన్వీనర్ కోటా సీట్లు 3,857

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య, దంత కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 16 సాయంత్రం ఆరు గంటల వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. https://apuhs-ugadmissions.aptonline.inలో దరఖాస్తులు సమర్పించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.2,950, ఎస్సీ, ఎస్టీలు రూ.2,360 దరఖాస్తు రుసుం చెల్లించాలి. నియమ, నిబంధనలకు సంబంధించి సందేహాల నివృత్తికి 8978780501, 7997710168 నంబర్లను, రుసుం చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలకు 9000780707 నంబర్‌ను సంప్రదించాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. విద్యార్థుల దరఖాస్తుల పరిశీలన అనంతరం మెరిట్ జాబితాను విశ్వవిద్యాలయం రూపొందిస్తుంది. తుది మెరిట్ జాబితా ప్రకటించాక కన్వీనర్ కోటాలో అన్ని దశలకు కలిపి ఒకేసారి వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పిస్తారు. అనంతరం వివిధ దశలుగా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. కాగా, ఈ ఏడాది రాష్ట్రం నుంచి 43,788 మంది నీట్ యూజీ–2024లో అర్హత సాధించారు.

ఉస్మానియా కోటా రద్దు
జీవో 513 ప్రకారం.. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కోటాను రద్దు చేసినట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం వరకు ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ), ఓయూ, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) విద్యార్థులకు 42:36:22 నిష్పత్తిలో ఎంబీబీఎస్ సీట్లను కేటాయిస్తూ వచ్చారు. ఈ ఏడాది నుంచి 36 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కాకుండా ఏపీ విద్యార్థులకే కేటాయించనున్నారు. మెరిట్ ఆధారంగా ఏయూ, ఎస్వీయూ విద్యార్థులతో సీట్లను భర్తీ చేయనున్నారు.



అప్‌లోడ్ చేయాల్సిన ధ్రువపత్రాలు
✔ నీట్ యూజీ- 2024 ర్యాంక్ కార్డ్ ✔ పుట్టిన తేదీ ధ్రువీకరణ (పదో తరగతి మార్కుల మెమో) ✔ 6 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు ✔ ఇంటర్మీడియెట్ స్టడీ, ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ✔ విద్యార్థి తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సంతకం ✔ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (ఇంటర్/10+2) ✔ కుల ధ్రువీకరణ ✔ ఆధార్ కార్డు ✔ దివ్యాంగ ధ్రువీకరణ పత్రం

ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పనకు దాతలు సహకరించాలి: సత్యకుమార్



నెల్లూరు (అర్బన్): రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయి తీవ్ర అప్పుల్లో ఉందని, అందువల్ల ఆస్పత్రుల్లో పేదలకు అవసరమైన సదుపాయాల కల్పనకు దాతలు ముందుకు రావాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. ఆయన శుక్రవారం నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా కిడ్నీ, లివర్ వ్యాధి బాధితులు పెరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో కొత్తగా సుమారు 11వేలు కిడ్నీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీరికోసం డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న 3వేల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చామని, దానిని ఎత్తేయడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు, రోగుల సహాయం కోసం సెంట్రలైజ్డ్ హెల్ప్‌డెస్క్, డాష్‌బోర్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఎయిడెడ్ టీచర్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వానికి టీచర్స్ గిల్డ్ వినతి

సాక్షి, అమరావతి: జీవో–50 ప్రకారం ప్రభుత్వంలో విలీనం చేసిన ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయుల సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, చిన్నప్ప, ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోట్ల విలువైన ఆస్తులతో సహా ఈ పాఠశాలల్లో పనిచేస్తోన్న కొంతమంది ఉపాధ్యాయులను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేసిందని, ప్రస్తుతం జరుగుతోన్న వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్వీస్‌ను కూడా పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

అబ్బా.. సర్కారు డబ్బా!

- ఆర్టీసీ కొత్త బస్సుల కొనుగోళ్ల ప్రక్రియ అంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే..
- కానీ, ఇదంతా తామే చేసినట్లుగా కూటమి ప్రభుత్వం బిల్డప్


సాక్షి, అమరావతి : 2023లో నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 1,500 కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ చేపట్టింది. టెండర్లు పూర్తిచేసి ఆర్డర్లు కూడా జారీచేసేసింది. బస్సులు కూడా వచ్చేశాయి. వాటిని ప్రారంభించడమే తరువాయి.. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చి బ్రేక్ పడింది. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. ఇప్పుడా బస్సులను ప్రస్తుత ప్రభుత్వం కేవలం జెండా ఊపి ప్రారంభిస్తోందంతే. కానీ, అంతా తామే చేశామన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం యమా బిల్డప్ ఇస్తోంది. ఈ బస్సుల కొనుగోళ్లలో వీరి పాత్ర పిసరంత కూడా లేకపోయినా తెగ డబ్బా కొట్టుకుంటున్నారు. సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లుగా ఉంది టీడీపీ కూటమి ప్రభుత్వ తీరు. విషయం ఏమిటంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రస్తుత సర్కారు ప్రారంభిస్తూ అంతా తామే చేశామని గప్పాలు కొట్టుకుంటున్న జాబితాలో ఆర్టీసీ కొత్త బస్సుల ప్రారంభం కూడా చేరింది. టీడీపీ ప్రభుత్వం 1,400 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించిందని ఆయన గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ, వాస్తవం ఏమిటంటే.. ఆ బస్సుల కొనుగోళ్లకు సంబంధించి కర్త, కర్మ, క్రియ అంతా వైఎస్సార్‌సీపీ సర్కారే. ఇప్పుడు వాటిని ప్రస్తుత ప్రభుత్వం కేవలం ప్రారంభిస్తోందంతే. కానీ, ఆ వాస్తవాన్ని మరుగునపెట్టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉంది.

మూడు దశల్లో 2,906 బస్సుల కొనుగోలు
నిజానికి.. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీకి కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ చేపట్టింది. ముందుగా 2019–20లో కొత్త బస్సులు కొనుగోలు చేసింది. పాత బస్సుల స్థానంలో 900 సరికొత్త డీజిల్ బస్సులను ప్రవేశపెట్టింది. తిరుమల–తిరుపతి ఘాట్‌రోడ్డుతో పాటు తిరుపతి సమీప పట్టణాల్లో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. రెండేళ్లపాటు కోవిడ్ ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ 2019 నుంచి 2023 మధ్య ఆర్టీసీ మొత్తం 1,406 కొత్త బస్సులను కొనుగోలు చేసింది. ఇక 2023 చివరిలో మరో 1,500 కొత్త డీజిల్ బస్సుల కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఆర్డర్లు కూడా జారీచేసింది. కాంట్రాక్టు దక్కించుకున్న కంపెనీలు ఎన్నికల ముందు సరఫరా చేశాయి. ఎన్నికల నియమావళి ఉండటంతో గత ప్రభుత్వం ప్రారంభించలేదు. వాటినే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ప్రారంభిస్తోంది.. అంతే!

చంద్రబాబు ప్రభుత్వం ఒక్క టెండరైనా పిలిచిందా?
టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీకి కొత్త బస్సుల కొనుగోలు కోసం ఇప్పటివరకు టెండర్లు పిలవనే లేదు. మరి టెండర్లు పిలవకుండానే కొత్త బస్సులను రెండు నెలల్లో ఎలా కొనుగోలు చేస్తారో ప్రభుత్వం చెప్పాలి. వాస్తవానికి ఈ బస్సులన్నింటికీ టెండర్లు పిలిచి డబ్బులు చెల్లించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ఇప్పుడు ఈ బస్సులకు మహా అయితే ఈ రెండు నెలల కాలంలో తుది మెరుగులుదిద్ది ఉంటారు. ఇప్పుడు వీటికి జెండా ఊపుతూ అదేదో మొత్తం తమ ప్రభుత్వ ఘనతగా చెప్పుకుంటూ టీడీపీ లేబుల్ వేసుకుంటున్న తీరుని చూసి జనం నవ్వుకుంటున్నారు.

పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు ప్రజాప్రతినిధులు

- 'సాల్ట్'పై సమీక్షలో మంత్రి లోకేశ్



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు ప్రజాప్రతినిధులమంతా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు హాజరవుతామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. తల్లిదండ్రుల మనోగతాన్ని తెలుసుకుంటామన్నారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో రాష్ట్రంలో అమలవుతున్న సపోర్టింగ్ ది ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్(సాల్ట్) ప్రాజెక్టు అమలుపై శుక్రవారం లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'నాణ్యమైన విద్యా బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాల సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. రాబోయే ఐదేళ్లలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ తప్పనిసరి. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఎసెస్‌మెంట్ మరింత శాస్త్రీయంగా ఉండేలా మార్పులు చేయాలి. డిజిటలైజ్డ్ ఎసెస్‌మెంట్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించి ఆన్‌లైన్‌కు అనుసంధానించడంపై దృష్టి సారించాలి. టీచింగ్ టూల్స్ అబ్జర్వేషన్, ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ బోధనా పద్ధతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీలు నిర్వహిస్తున్న ఎసెస్‌మెంట్, శిక్షణా కార్యక్రమాలు అర్థవంతంగా, ఫలితాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలి. ప్రభుత్వ స్కూళ్ల మెరుగైన పనితీరు కోసం తల్లులను భాగస్వాములను చేయాలి' అని అధికారులను ఆదేశించారు.

విశాఖ పోర్టును సందర్శించిన నేపాల్ బృందం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)ని నేపాల్ ప్రభుత్వ వాణిజ్య బృందం శుక్రవారం సందర్శించింది. 10 మంది సభ్యులతో కూడిన బృందానికి పోర్టు అధికారులు స్వాగతం పలికారు. విశాఖ పోర్టులో ఉన్న మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోర్టు ట్రాఫిక్ మేనేజర్ రామశేఖర్ వివరించారు. రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య ప్రయోజనాలను పెంపొందించేందుకు సాంకేతిక, వాణిజ్యపరమైన అంశాలపై చర్చించారు. సరళతర వ్యాపార అవకాశాలు, టర్న్ అరౌండ్ టైం, కస్టమ్స్ క్లియరెన్స్, డ్రెడ్జింగ్ పనులు వంటి కీలక అంశాలపై కృషి చేయాలని నిర్ణయించారు.

సాధన సక్రమంగా జరిగి ఆత్మజ్ఞానం కలగాలంటే
సాధన క్షేత్రమైన ఈ శరీరం ఆరోగ్యంగా ఉండాలి.
- ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 10 ఆగస్టు 2024

దారికొచ్చిన ఎన్డీయే సర్కారు!

అలవాటైన పద్ధతిలో వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎన్డీయే ప్రభుత్వానికి కాసేపటికే తత్వం బోధపడినట్టుంది. విపక్షాల నుంచి ప్రతిఘటన ఎదురుకావటంతో దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపటానికి అంగీకరించింది. కారణమేదైనా అభ్యంతరాలు వ్యక్తమైనప్పుడు జేపీసీకి లేదా సెలెక్ట్ కమిటీకి పంపటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒక సంప్రదాయం. కానీ ఎన్డీయే అధికారంలోకి వచ్చాక కేవలం రెండు సందర్భాల్లో మాత్రమే పాటించింది. పదేళ్లనాడు గద్దెనెక్కగానే అంతకు కొన్ని నెలలముందు అమల్లోకొచ్చిన భూసేకరణ చట్టం పీకనొక్కుతూ ఆదరా బాదరాగా ఆర్డినెన్స్ తీసుకురావటం ఎవరూ మరిచిపోరు. విపక్షాలు అభ్యంతరం చెబుతున్నా ఆనాడు చెవికెక్కలేదు. ఆర్డినెన్స్ మురిగిపోయిన రెండుసార్లూ దానికి ప్రాణప్రతిష్ఠ చేస్తూ తిరిగి ఆర్డినెన్సులు తీసుకొచ్చారు. రాజ్యసభలో గండం గడిచేలా లేదని గ్రహించాక ఇక దాని జోలికి పోరాదని నిర్ణయించుకున్నారు. అటుపై సాగు చట్టాల విషయంలోనూ రైతులనుంచి ఇలాంటి పరాభవమే ఎదురయ్యాక వాటినీ ఉపసంహరించుకున్నారు. ఐపీసీ, సాక్ష్యాధారాల చట్టం, సీఆర్‌పీసీ స్థానంలో వచ్చిన కొత్త చట్టాల తాలూకు బిల్లులపై కూడా సంబంధిత వర్గాలను సరిగా సంప్రదించలేదు. ఎన్డీయే ఏలుబడి మొదలయ్యాక చోటుచేసుకున్న వేర్వేరు ఉదంతాల పర్యవసానంగా ముస్లిం సమాజంలో ఒక రకమైన అభద్రతాభావం ఏర్పడిన నేపథ్యంలో ఈ వివాదాస్పద చర్యకు కేంద్రం ఎందుకు సిద్ధపడిందో తెలియదు. బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని ఎన్డీయే భాగస్వామ్య పక్షం జేడీ(యూ) నేత, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అంటున్నారు. ఇది పారదర్శకత తీసుకొస్తుందని కూడా ఆయన సెలవిచ్చారు. మంచిదే. మరి ఆ వర్గంతో సంప్రదింపులు జరిగిందెక్కడ? ముస్లిం సమాజానికున్న అభ్యంతరాల సంగతలా వుంచి రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు సైతం ఇది ఎసరు పెడుతోంది. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం భూమి రాష్ట్రాల జాబితాలోనిది. వక్ఫ్ ఆస్తిపై కేంద్ర పెత్తనాన్ని అనుమతించటంద్వారా దాన్ని కాస్తా తాజా బిల్లు నీరుగారుస్తోంది. కనుక ముస్లిం సమాజంతో మాత్రమేకాదు...రాష్ట్రాలతో కూడా సంప్రదించాల్సిన అవసరం లేదా? హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీలకు జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లు తెచ్చారని లోక్‌సభలో విపక్షాలు చేసిన విమర్శలు కాదని చెప్పటానికి ప్రభుత్వం దగ్గర జవాబు లేదు. తన చర్య వెనక సదుద్దేశం ఉందనుకున్నప్పుడూ, బిల్లుపై ఉన్నవన్నీ అపోహలే అని భావించినప్పుడూ తగిన సమయం తీసుకుని సంబంధిత వర్గాలతో చర్చించటానికేమైంది? ఒకవేళ వచ్చే అసెంబ్లీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకునే హడావిడిగా బిల్లు తీసుకొచ్చి వుంటే అంతకన్నా తెలివితక్కువతనం ఉండదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఆ మాదిరి ఎత్తుగడలను జనం ఏవగించుకున్నారని బీజేపీకి అర్థమయ్యే వుండాలి.

సవరణ బిల్లు ద్వారా తీసుకొచ్చిన 44 సవరణల పర్యవసానంగా వక్ఫ్ బోర్డుల అధికారాలకు కత్తెరపడుతుందని, ప్రభుత్వ నియంత్రణ పెరుగుతుందని కనబడుతూనేవుంది. అరుదైన సందర్భాల్లో తప్ప కలెక్టర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటారని ఎవరూ అనుకోరు. ఫలానా ప్రార్థనాస్థలం శతాబ్దాలక్రితం తమదేనంటూ ఆందోళనలు చేయటం, దానికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతుండటం అక్కడక్కడ కనబడుతూనేవుంది. ఇంతకాలం వక్ఫ్ ట్రిబ్యునళ్లకు ఉండే అధికారం కాస్తా కలెక్టర్లకు ఇవ్వాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. బోర్డుల్లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించటం, ఆస్తిని విరాళంగా ఇవ్వటంపై ఆంక్షలు సంశయం కలిగించేవే. మతపరమైన, ధార్మికపరమైన కార్యకలాపాల నిర్వహణ కోసం వచ్చిన ఆస్తుల్ని పర్యవేక్షించటానికి ఏర్పడిన బోర్డుల్లో వేరే మత విశ్వాసాలున్నవారిని నియమించటం ఏరకంగా చూసినా సరికాదన్న ఇంగితజ్ఞానం ఉండొద్దా? అసలు ఒకసారి బోర్డు దేన్నయినా వక్ఫ్ ఆస్తిగా ప్రకటిస్తే దాన్ని మార్చటం అసాధ్యమన్న ప్రచారం కూడా తప్పు. ఫలానా ఆస్తి బోర్డుదనుకుంటే సంబంధిత వర్గాలకు నోటీసులిచ్చి వారి వాదనలు పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలని ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 40 చెబుతోంది. అటు తర్వాత వక్ఫ్ ట్రిబ్యునల్‌దే తుది నిర్ణయం. పైగా విరాళమిచ్చిన దాత కచ్చితంగా ఇస్లాంను పాటించే వ్యక్తే అయివుండాలని, దానంగా వచ్చే ఆస్తి కుటుంబవారసత్వ ఆస్తి కాకూడదని చట్టం నిర్దేశిస్తోంది. ఇప్పటికే ఇన్ని కట్టుదిట్టమైన నిబంధనలుండగా అందుకు భిన్నంగా ప్రచారం చేయటం సబబేనా? ఈ పరిస్థితుల్లో బిల్లు చట్టమైతే వక్ఫ్ ఆస్తుల చుట్టూ వివాదాలు ముసురుకుంటాయనుకునే అవకాశం లేదా?

సంకీర్ణంలోని జేడీ(యూ), ఎల్జేపీలు బిల్లుకు మద్దతు పలకగా సభలో టీడీపీ సంకటస్థితిలో పడిన వైనం స్పష్టంగా కనబడింది. ఆ బిల్లుకు మద్దతిస్తుందట...కానీ జేపీసీకి 'పంపితే' వ్యతిరేకించబోదట! ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పుట్టుకొచ్చిన బాబు రెండు కళ్ల సిద్ధాంతం ఇంకా సజీవంగా ఉందన్నమాట! టీడీపీది చిత్రమైన వాదన. అలా పంపనట్టయితే వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించబోమని చెప్పడానికి నోరెందుకు రాలేదు? ఒకపక్క బిల్లు చట్టమైతే పారదర్శకత ఏర్పడుతుందన్న ప్రభుత్వ వాదనను సమర్థిస్తూనే తమ సెక్యులర్ వేషానికి భంగం కలగకుండా ఆడిన ఈ డ్రామా రక్తి కట్టలేదు. జాతీయ మీడియా దీన్ని గమనించింది. మొత్తానికి సవరణ బిల్లు జేపీసీకి వెళ్లటం శుభ పరిణామం. ఎన్డీయే సర్కారు ఈ సంప్రదాయాన్ని మున్ముందు కూడా పాటించటం ఉత్తమం.

చేలకు డబ్బులు కాయాలి!

విశ్లేషణ



దేవిందర్ శర్మ

ప్రపంచంలోని 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయ ఉత్పత్తిదారుకు సబ్సిడీ మద్దతును రూపొందించినట్లు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) తాజా ప్రపంచ విశ్లేషణ చూపిస్తోంది. భారతదేశం విషయానికి వస్తే మాత్రం, రైతులు తమ నష్టాలను పూడ్చుకోవడానికి తగిన బడ్జెట్ మద్దతు లేకుండా ఉన్నారు. 2000 సంవత్సరం నుండి భారతీయ రైతులు ఏటా నష్టాలను చవిచూస్తూనే ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. కాబట్టి, మన వ్యవసాయ రంగ విధానాలపై పునరాలోచన అవసరం. సమాజంలోని ఇతర వర్గాలతో ఆదాయ సమానత్వాన్ని తీసుకురావాలంటే వ్యవసాయ రంగంలో జీవనోపాధి సమస్యను పరిష్కరించి, రైతులు ఆదాయాన్ని పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న ముఖ్యమైన పాత్రను నొక్కి చెప్పడం ద్వారానే గత 25 సంవత్సరాలుగా, దాదాపు ప్రతి ఆర్థిక మంత్రీ తన బడ్జెట్ సమర్పణను ప్రారంభిస్తూ వస్తున్నారు. 'కిసాన్ కీ ఆజాదీ' నుండి దేశ ఆర్థిక వ్యవస్థ జీవనాధారం వరకు, బడ్జెట్ ప్రతిపాదనల దృష్టిని ఎత్తిపట్టడానికి అనేక విశేషణాలను ఉపయోగిస్తూ వచ్చారు. వ్యవసాయ ఆదాయాన్ని పెంచడం గురించి అరుణ్ జైట్లీ మాట్లాడారు. ప్రభుత్వ ఐదు ప్రాధాన్యాలలో దాన్ని అగ్రస్థానంలో ఉంచారు. నిర్మలా సీతారామన్ కూడా వ్యవసాయానికి తగిన గుర్తింపును కల్పించారు. ఆమె పేర్కొన్న తొమ్మిది ప్రాధాన్యాలలో వ్యవసాయ ఆదాయ పెంపుదల అగ్రస్థానంలో ఉంది.

దాదాపు ప్రతి బడ్జెట్‌లోనూ ఇలా వ్యవసాయానికి ఊతమివ్వడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికే మార్పు వచ్చి ఉండాలి. అయితే దీనిపై నిశితంగా దృష్టి సారించినప్పటికీ ఒక్కసారి కూడా వ్యవసాయం పునరుద్ధరణ మార్గం పట్టినట్లు కనిపించలేదు. ఎందుకంటే అధిక ధరలు లభిస్తాయనీ, రైతుల ఆదాయం పెరుగుతుందనే ఆశాభావంతో పంటల ఉత్పాదకత పెంపుదల గురించి అంతర్లీనంగా ఉద్ఘాటిస్తున్నప్పటికీ దేశంలో వ్యవసాయ కష్టాలు మరింత పెరిగాయి. విజయవంతమైన హరిత విప్లవం తర్వాత కూడా వ్యవసాయ కుటుంబానికి నెలవారీ సగటు ఆదాయం దాదాపు రూ. 10,218 గానే ఉంటున్నప్పుడు, బడ్జెట్‌లో ఇంత మద్దతు ఉన్నప్పటికీ వ్యవసాయంలో తీవ్రమైన సంక్షోభాన్ని కొట్టిపారేయలేము.

వాస్తవాలు ఎలా ఉన్నాయో చూద్దాం. కర్ణాటకలో, అధికారిక అంచనా ప్రకారం గత 15 నెలల్లో 1,182 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మహారాష్ట్రలో ఈ సంవత్సరం జనవరి–జూన్ మధ్య 1,267 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు, విదర్భలోని ఒక్క అమరావతి డివిజన్‌లోనే 557 కేసులు నమోదయ్యాయి.

రైతుల ఆత్మహత్యలు కొత్త విషయం కాదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా సంకలనం గత 27 ఏళ్లలో రైతుల ఆత్మహత్యల సంఖ్యను చూపిస్తోంది. ఈ కాలం వ్యవసాయానికి సంబంధించి 25 సంవత్సరాల బడ్జెట్ హామీలకు సమానంగా ఉంది. 1995–2014 మధ్య కాలంలో 2,96,438 మంది సాగుదారులు తీవ్రాతితీవ్రమైన ఆత్మహత్యా సదృశ చర్యలకు పాల్పడ్డారు. 2014 నుండి 2022 వరకు 1,00,474 మంది రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. సరళంగా చెప్పాలంటే, వ్యవసాయాన్ని మలుపు తిప్పుతామని వార్షిక బడ్జెట్‌లు వాగ్దానం చేస్తూ ఉన్న సమయంలోనే 1995–2022 మధ్య దాదాపు నాలుగు లక్షల మంది రైతులు తమ జీవితాలను ముగించారు. అంటే బడ్జెట్ కేటాయింపులకు, కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభానికి మధ్య అసమతుల్యత అత్యంత స్పష్టంగా ఉంది.

తెలంగాణ ఇప్పుడు వ్యవసాయ రుణమాఫీ రెండో దశను పూర్తి చేసుకుంది. ఇది 6.4 లక్షల మంది రైతులకు రూ. 6,198 కోట్ల బకాయి రుణాలను మాఫీ చేసింది. అప్పుల్లో ఉన్న సాగుదారుల్లో ప్రతి ఒక్కరికి రూ. 1.5 లక్షల మాఫీ లభిస్తుంది. మొదటి దశలో 11.34 లక్షల మంది రైతులకు రూ. 6,190 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ నెల 15న ప్రారంభం కానున్న మూడో దశలో 17.75 లక్షల మంది రైతులకు రూ. 12,224 కోట్ల రుణమాఫీ అందనుంది. రాష్ట్రంలో మొత్తం 35.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తున్నారన్నమాట. అయితే దీనర్థం పెరుగుతున్న వ్యవసాయ రుణాలు ఇతర రాష్ట్రాల్లో సమస్యాత్మకం కావని కాదు.



చండీగఢ్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌లో తన వరి పంటపై విశ్రాంతి తీసుకుంటున్న ఒక రైతు (ఫైల్ ఫొటో)

ప్రపంచంలోని 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయ ఉత్పత్తిదారుకు సబ్సిడీ మద్దతును రూపొందించినట్లు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) తాజా ప్రపంచ విశ్లేషణ చూపిస్తోంది. భారతదేశం విషయానికి వస్తే, రైతులు తమ నష్టాలను పూడ్చుకోవడానికి తగిన బడ్జెట్ మద్దతు లేకుండా ఉన్నారు. 2000 సంవత్సరం నుండి భారతీయ రైతులు ఏటా నష్టాలను చవిచూస్తూనే ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. సుదీర్ఘంగా కొనసాగుతున్న ఇన్ని నష్టాల నుండి మరే ఇతర రంగం అయినా బయటపడుతుందా?

మనం ఈ విశ్లేషణా పద్ధతిని తప్పుబట్టినప్పటికీ, ఉత్పాదకతకు, ఉత్పత్తిని పెంచడం కోసం సాంకేతికతకు మద్దతు ఇవ్వడం లేదా ఇతర పథకాలకు డబ్బును నింపడం వల్ల రైతుల ఆదాయం పెరగదు అనేది వాస్తవం. ఇది ఎక్కడా జరగలేదు. ఓఈసీడీ అధ్యయనమే ఇందుకు నిదర్శనం.

దీనినే నేను 'వయా బటిండా' విధానం అని పిలుస్తాను. ఇన్‌పుట్ సప్లయర్‌లు లేదా టెక్నాలజీ ప్రదాతల ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి బదులుగా, ప్రత్యక్ష ప్రయత్నం ఎందుకు చేయలేరు? ఇలాంటి పరోక్ష ప్రయత్నం గతంలో పని చేయలేదు. భవిష్యత్తులో కూడా పని చేయదు. రైతులు అట్టడుగు స్థానంలో ఉన్న సమయంలోనే ఇన్‌పుట్ సప్లయర్‌లు లాభాల్లో ఎలా దూసుకు పోతున్నారో అనేక అధ్యయనాలు చూపించాయి. సప్లయ్ చెయిన్ల విషయంలో కూడా అంతిమ లాభాలలో పెంపకందారుల వాటా దాదాపు 5–10 శాతం లేదా అంతకంటే తక్కువగానే ఉంటోంది. 2021లో స్ట్రాబెర్రీలను, రాస్‌బెర్రీలను మార్కెటింగ్ చేయడం ద్వారా రిటైల్ లాభాలు 27 పెన్నీల వరకు పెరిగాయని, కానీ రైతుల వాటా 3.5 పెన్నీలు మాత్రమే అని బ్రిటన్‌లో ఒక అధ్యయనం తెలిపింది. వినియోగదారులు ఆధారపడిన ఆరు రోజువారీ అవసరాలకు గానూ, రిటైల్ లాభంలో కేవలం 1 శాతం మాత్రమే రైతులకు లభిస్తుందని ఇంతకు ముందు అధ్యయనాలు చూపించాయి. అందువల్ల, తాజా బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా, ప్రాథమిక ఉత్పత్తిదారు అయిన రైతు వాటాకు హామీ ఇచ్చినప్పుడు మాత్రమే సరఫరా గొలుసులను బలోపేతం చేయడం అనేది దోహదకారిగా ఉంటుంది.

దేశంలోని దాదాపు సగం జనాభా వ్యవసాయ రంగంలో నిమగ్నమై ఉంటున్నప్పుడు, వ్యవసాయానికి మొత్తం బడ్జెట్‌లో కేవలం 3.15 శాతం మాత్రమే కేటాయిస్తే, అసాధారణంగా ఏమీ ఆశించలేం. ఈ సంవత్సరం వ్యవసాయ బడ్జెట్ రూ. 1.52 లక్షల కోట్లు, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇప్పుడు దాదాపు రూ. 26,000 కోట్లు పెరిగి, ముందుగా సూచించినట్లుగా ప్రణాళికేతర వ్యయాన్ని కవర్ చేస్తుంది. వ్యవసాయం కోసం బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ పథకానికి రూ. 60,000 కోట్లు కేటాయించారు. ఇది భూమిని కలిగి ఉన్న ప్రతి రైతుకు నెలవారీ రూ. 500లను అందిస్తుంది. ఇక మిగిలింది వ్యవసాయానికి రూ. 92,000 కోట్లు. గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం కేవలం రూ. 3,268గా ఉందని 2022–23 గృహ వినియోగ వ్యయం మనకు చెప్పడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. వ్యవసాయం లాభసాటిగా లేకపోతే, గ్రామీణ వ్యయం ఇప్పటికీ తక్కువగానే ఉంటుంది.

కాబట్టి, వ్యవసాయంపై పునరాలోచన అవసరం. సమాజంలోని ఇతర వర్గాలతో ఆదాయ సమానత్వాన్ని తీసుకురావడానికి మొదట జీవనోపాధి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతుల ఆదాయం, సంక్షేమం కోసం జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలనేది నా సూచన. ఈ కమిషన్ నిర్దిష్ట కాల వ్యవధిలో వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి నిర్దిష్ట మార్గాలతో ముందుకు రావాలి. కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన విధానాన్ని నిర్ధారించడం ద్వారా దీన్ని ప్రారంభించాలి.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రభుత్వమే దోచేస్తే!



ప్రీమియంపై ఎన్డీయే ప్రభుత్వం వసూలు చేస్తున్న 18 శాతం జీఎస్టీ వల్ల జీవిత, ఆరోగ్య బీమాలన్నవి శ్రీమంతులు మాత్రమే అనుభవించగల సౌకర్యాలు అయ్యాయి. సాధారణ పౌరులను దోపిడీ చేయటానికి, అణచివేయటానికి వెనుకాడని ఈ ప్రభుత్వంపై పార్లమెంటులోనే కాదు, పార్లమెంటు బయటా పోరాటం జరగవలసి ఉంది.

– చంద్రిమా భట్టాచార్య, తృణమూల్ ఎమ్మెల్యే

మనుషులంతా ఒక్కటే!



నాకు చాలామంది అద్భుతమైన ఇరానీ స్నేహితులు ఉన్నారు. మా పొరుగున ఉన్న ఇరానీయులు కూడా మాతో చాలా ఉదారంగా ఉంటారు. నాకు చిన్నప్పటి నుంచి తెలిసిన ఇరాకీ స్నేహితులు కూడా ఉన్నారు. ఎక్కడైనా మనుషులు మనుషులే! రాజకీయాలను బట్టి మనం వారిని చూస్తే, వారూ మనల్ని అలానే చూస్తారు.

– తారా దేశ్‌పాండే, కంటెంట్ క్రియేటర్

నింద తగునా?!



జాత్యహంకార వ్యక్తులను 'వలస వ్యతిరేకులు' అని పిలవటం మానేయండి. వారు వైట్ అమెరికన్, కెనడియన్, ఆస్ట్రేలియన్, న్యూజిల్యాండ్, ఫ్రెంచ్, ఇటాలియన్ వలసలపై ఎప్పుడైనా దాడి చేశారా? లేదు కదా!

– అహ్మద్ సెవెహ్లీ, వ్యంగ్య వ్యాఖ్యాత

అంతవరకు రానివ్వకండి!



చరిత్రలో ఒక్కసారి కూడా ప్రజలపై సాయుధ బలగాలు, పోలీసులు ప్రయోగించిన హింస సవ్యమైన ఫలితాలను ఇవ్వలేదు. అయినప్పటికీ దేశాలు తమ ప్రజలను గొర్రెలుగానే భావిస్తున్నాయి. తాము కోల్పోయేది ఏమీ లేదనే స్థితికి చేరుకున్నప్పుడు రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తారు. ఇదొక హెచ్చరిక.

– ఋతుపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

భాషకు ప్రత్యామ్నాయం



టోక్యో 1964 ఒలింపిక్ హోస్ట్‌గా ఎంపికైనప్పుడు చిన్న అడ్డంకి వచ్చింది. భాష! బయటి వారికి జపనీస్ భాష అర్థం కాలేదు. అంతర్జాతీయ సందర్శకులతో మాట కలపటానికి జపాన్ ఆనాడు చేసిన యత్నం... ఒలింపిక్స్‌లో పదాలు లేని చిహ్నాల సృష్టికి దారితీసింది. అవే... పిక్టోగ్రామ్స్, ఈవెంట్‌ల బొమ్మలు.

– సుశాన్ నైనన్, క్రీడా వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

ఆధునిక ఘనాపాఠి

మనమందరం గర్వించదగిన గొప్ప పాత్రికేయులు తుర్లపాటి కుటుంబరావు. 1946లో 14వ ఏట జర్నలిజంలోకి ప్రవేశించిన అరుదైన వ్యక్తి. ప్రముఖ పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు శిష్యుడిగా దినపత్రికలో సహాయ సంపాదకుడిగా జర్నలిస్ట్ జీవితం ప్రారంభించి నిజాయితీగా, నిక్కచ్చిగా పలు వ్యాసాలు, వార్తలు రాశారు. ముఖ్యంగా 'వార్తల్లోని వ్యక్తి' అనే శీర్షికను వివిధ పత్రికలలో 50 ఏళ్ళపాటు రాసి రికార్డు సృష్టించారు. 1951లో ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 'ప్రజా పత్రిక'లో చేరి తదుపరి ఆయనకు కార్యదర్శిగా పనిచేశారు. ప్రముఖులైన గాంధీజీ, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, బీఆర్ అంబేడ్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ; అనేకమంది రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి దేశ దశాదిశ నిర్దేశాలను పేర్కొన్న అనుభవజ్ఞులు.



తుర్లపాటి కుటుంబరావు

ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మొరార్జీ దేశాయ్, బాబూ జగ్జీవన్ రాం వంటివారి ఆంగ్ల ఉపన్యాసాలను తనదైన శైలిలో అనువదించి ప్రజలకు అర్థమయ్యేరీతిలో చెప్పారు. 18 వేలకు పైగా ఉపన్యాసాలను ఇచ్చి మెప్పించిన ఏకైక వ్యక్తి. గిన్నిస్‌బుక్ వారి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. 'ఉపన్యాస కేసరి', 'దశసహస్ర సభాకేసరి' అనే బిరుదులతో పాటు ఆంధ్ర యూనివర్సిటీ నుండి 'కళాప్రపూర్ణ'నూ అందుకొన్నారు. 'ముట్నూరి కృష్ణారావు ఉత్తమ జర్నలిస్ట్' అవార్డు, తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్' అవార్డు పొందిన ప్రతిభాశాలి. దేశం 'పద్మశ్రీ'తో ఆయన్ని అలంకరించింది.

ఆయనకు సినీరంగం అంటే ఎంతో ఇష్టం. ఎక్కడ ఏ సినిమా ఫంక్షన్ జరిగినా సభాధ్యక్షులుగా ఆయనే ఉండేవారు. సభను ఆద్యంతం తన చతురోక్తులతో జనరంజకం చేసేవారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ స్థాపించి రాష్ట్రంలో ప్రతి ఏటా సినీరంగ ప్రతిభావంతులకు అవార్డులిచ్చి సత్కరించేవారు. నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబరుగా, నంది అవార్డుల కమిటీ సభ్యులుగా, కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌గా వివిధ పదవులు అలంకరించి అభివృద్ధి బాటలు వేసిన దార్శనికుడు. 'మహానాయకులు', 'జాతి నిర్మాతలు', '1857 విప్లవ వీరులు', 'నా కలం–నా గళం' వంటి మంచి పుస్తకాలను మనకు అందించిన గొప్ప రచయిత. అటువంటి ప్రతిభాశాలి కాంస్య విగ్రహాన్ని కనీసం ఆయన సొంత ఊరు విజయవాడలోనైనా ఏర్పాటు చేస్తే ముందు తరాలకు స్ఫూర్తిమంతంగా ఉంటుంది.

– అంబటి మధుమోహనకృష్ణ
ప్రెసిడెంట్, ఎ.పి. ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, విజయవాడ

(నేడు 'పద్మశ్రీ' తుర్లపాటి కుటుంబరావు జయంతి)

నిజమైన విజేతవు నీవే బంగారం!

అభిప్రాయం



కృష్ణారావు చొప్పరపు


క్రీడలే జీవితంగా భావించేవారు తమ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని కోరుకొంటారు. పతకం కోసం అహరహం శ్రమిస్తూ సంవత్సరాల తరబడి సాధన చేస్తూ ఉంటారు. అయితే... గెలుపు, ఓటమితో సంబంధం లేని ఓ సాంకేతిక కారణంతో స్వర్ణపతకం చేజారితే... కనీసం రజత పతకమైనా దక్కకుంటే అంతకుమించిన విషాదం మరొకటి ఉండదు. ప్రస్తుత ప్యారిస్ ఒలింపిక్స్ మహిళల కుస్తీ 50 కిలోల విభాగంలో భారత మల్లయోధురాలు వినేశ్ పోగట్‌కు అదే పరిస్థితి ఎదురయ్యింది. వంద గ్రాముల అదనపు బరువు కొండంత దురదృష్టాన్ని, గుండెబరువును మిగిల్చింది.

ఒలింపిక్స్‌లో పతకం మినహా ప్రపంచ కుస్తీలోని అన్ని రకాల పోటీలలో పతకాలు సాధించిన ఘనత వినేశ్‌కు ఉంది. 49 కిలోలు, 50 కిలోలు, 53 కిలోల విభాగాలలో పాల్గొంటూ చెప్పుకోదగ్గ విజయాలు, ఎన్నో పతకాలు సాధించిన ఘనత ఉంది. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ప్రపంచ పోటీలలో సైతం స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన వినేశ్‌కు ఒలింపిక్స్ పతకం మాత్రం గత పుష్కరకాలంగా అందని ద్రాక్షలా ఉంటూ వచ్చింది.

2016 రియో ఒలింపిక్స్‌లో పాల్గొంటూ గాయంతో వైదొలిగిన వినేశ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మాత్రం స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయింది. ఇక 2024 ప్యారిస్ ఒలింపిక్స్ ప్రారంభానికి కొద్దిమాసాల ముందు వినేశ్ న్యాయం కోసం ముందుగా రోడ్లు, ఆ తరువాత న్యాయస్థానాల మెట్లు ఎక్కి పోరాడాల్సి వచ్చింది.

అంతర్జాతీయ కుస్తీ పోటీలలో పాల్గొంటూ, దేశానికి పతకాలతో ఖ్యాతి తెస్తున్న ఏడుగురు మహిళా వస్తాదులపై బీజేపీ మాజీ ఎంపీ, జాతీయ కుస్తీ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్, ఆయన పరివారం లైంగిక వేధింపులకు పాల్పడటానికి నిరసనగా భజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ లాంటి దిగ్గజ వస్తాదులతో కలసి వినేశ్ గొప్ప పోరాటమే చేసింది. చివరకు ఢిల్లీ పోలీసుల కాఠిన్యాన్ని రుచి చూడాల్సి వచ్చింది. న్యాయస్థానాల జోక్యంతో బ్రిజ్ భూషణ్ అధ్యక్షపదవిని వీడక తప్పలేదు.

మొక్కవోని దీక్షతో, మోకాలి శస్త్ర చికిత్సను సైతం భరించి, పోరాడి ప్యారిస్ ఒలింపిక్స్ 50 కిలోల విభాగంలో పాల్గొనటానికి అర్హత సంపాదించింది. 53 కిలోల విభాగంలో తనకు అవకాశం లేకపోడంతో యాభై కిలోల విభాగంలో పాల్గొనటం కోసం బరువు తగ్గించుకొని మరీ ప్యారిస్‌లో అడుగుపెట్టింది. మహిళా కుస్తీ 50 కిలోల విభాగం పోటీల తొలిరోజున 50 కిలోల బరువుతోనే జపాన్, ఉక్రెయిన్, క్యూబా



బరిలో వినేశ్ పోగట్

బాక్సర్లను చిత్తు చేయడం ద్వారా ఫైనల్లో అడుగుపెట్టింది. వినేశ్ ఫైనల్స్ చేరడంతో బంగారు పతకం ఖాయమనే శతకోటి భారత క్రీడాభిమానులు ఆశపడ్డారు. కానీ జరిగింది వేరు. అంతర్జాతీయ కుస్తీ సమాఖ్య నిబంధనల ప్రకారం పోటీలు జరిగే ప్రతి రోజూ వివిధ విభాగాలలో పోటీకి దిగే వస్తాదుల బరువును చూసిన తరువాతే పోటీకి అనుమతిస్తారు. అయితే...పోటీల తొలిరోజున 50 కిలోల బరువున్న వినేశ్... స్వర్ణపతకం కోసం పోటీపడే రోజున మాత్రం 100 గ్రాముల బరువు అదనంగా ఉండడంతో అనర్హత వేటు వేశారు. బరువును నియంత్రించుకోడం కోసం ఫైనల్‌కు ముందురోజు రాత్రి వినేశ్, ఆమె శిక్షకులు చేయని ప్రయత్నం అంటూ ఏమీలేదు. తెల్లవార్లూ నడకతో, సైక్లింగ్ చేస్తూ, విపరీతమైన వేడితో ఉండే ఆవిరి గదిలో వినేశ్ గడిపింది. చివరకు బరువు తగ్గించుకోవటం కోసం శిరోజాలను సైతం కత్తిరించుకొన్నా ప్రయోజనం లేకపోయింది. వంద గ్రాముల అదనపు బరువు కారణంగా బంగారు పతకం కోసం పోటీ పడే అవకాశాన్ని కోల్పోడంతో పాటు... కనీసం రజత పతకానికి సైతం నోచుకోలేకపోయింది. అదనపు బరువు నిబంధన కారణంగా వినేశ్‌కు బంగారు పతకం పోరులో పాల్గొనే అవకాశాన్ని నిరాకరించడం గుండె కోతను మిగిల్చింది. వినేశ్‌తో పాటు కోట్లాది క్రీడాభిమానులు, యావత్ భారతజాతి తల్లడిల్లిపోయింది.

అదనంగా ఉన్న 100 గ్రాముల బరువే తనకు ఒలింపిక్స్ పతకం సాధించే అవకాశం లేకుండా చేయటాన్ని జీర్ణించుకోలేని వినేశ్ అర్ధంతరంగా రిటైర్మెంట్ ప్రకటించింది. వినేశ్‌కు న్యాయం చేయాలంటూ అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘానికి భారత కుస్తీ సమాఖ్య అప్పీలు చేసింది. ఫైనల్ బరిలో దిగకుండానే సర్వం కోల్పోయిన వినేశ్‌కు కనీసం రజత పతకమైనా ఇవ్వాలంటూ మొరపెట్టుకొన్నారు. రజత పతకాలు ఇద్దరికీ ఇచ్చినా ఇబ్బంది రాదని అంటున్నారు. వినేశ్‌కు ప్రధాని, కేంద్ర క్రీడామంత్రి; భారత ఒలింపిక్స్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో పాటు పలువురు క్రీడాదిగ్గజాలు, సింధు లాంటి ఒలింపియన్లు అండగా నిలిచారు.

ప్రతిభకు, బరువుకు సంబంధం ఏంటని పలువురు నిపుణులు, ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. 100 గ్రాముల అదనపు బరువుతో ప్రత్యర్థికి జరిగే నష్టమేంటని నిలదీస్తున్నారు. హార్మోనుల అసమతౌల్యత వల్ల మహిళల బరువు తరచూ మారిపోతూ ఉంటుందని, ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని మినహాయింపు ఇవ్వాలంటూ సూచిస్తున్నారు.

భారత ఒలింపిక్స్ సంఘం మొరను అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం ఆలకించినా... ఆలకించకున్నా, కనీసం రజత పతకం ఇచ్చినా, ఇవ్వకున్నా... నిజమైన విజేతగా కోట్లాది మంది క్రీడాభిమానుల గుండెల్లో వినేశ్ పోగట్ నిలిచిపోతుంది.

వ్యాసకర్త సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్
మొబైల్: 84668 64969

దేవుడికొక దెప్పిపొడుపు

చాలామంది భక్తులు దేవుడిని తమ ప్రభువుగానూ, తమను దేవుడి దాసానుదాసులుగానూ భావించుకొని ఎంతో వినయ విధేయతలతో ఆయనను కొలుస్తారు. కొందరు భక్తులు మాత్రం (కనీసం అప్పుడప్పుడు) దేవుడు తమ బాల్యమిత్రుడో, సమ ఉజ్జీయో, బంటో అయినట్టు భావించి, 'ఎడవబ్బ సామ్మని కులుకుతూ కూర్చొంటివి?' అన్నంతలేసి మాటలంటారు. ఎగతాళి చేస్తారు. ఎకసక్కెం చేస్తారు. 'ఏరా! ఒరే!' అంటారు. ఈ రోజులలో అయితే ఇతర భక్తులు ఊరుకోరని కొంత వెనకాడుతున్నారు గానీ, పూర్వం కొందరు మహా మహా భక్తులే తమ రచనలలో దేవుడినే దెప్పి పొడిచిన సందర్భాలు ఎన్నెన్నో కనిపిస్తాయి. ఎవరి దాకానో ఏమిటి, ఆది శంకరాచార్యులే అప్పుడప్పుడూ అలాంటి వ్యాజ స్తుతులు చేసేవారు.



జ్యోతిర్మయం

'ఏమయ్యా, సాంబశివా! ఆకాశంలో ఒకే ఒక్క సూర్యుడున్నాడు. ఆయన సామర్థ్యం చూసి అయినా నువ్వు నేర్చుకోవచ్చు గదా? భూనభోంతరాళమంతా వ్యాపించి ఉన్న దట్టమైన, గాఢమైన చిక్కని చీకటిని పాపం ఆయన ఒక్కడే పటాపంచలు చేసేస్తున్నాడు. చేసి, ప్రాణికోటిలో ప్రతి జీవికీ కళ్ళ ఎదుట కనిపిస్తున్నాడు. **ఏకః వారిజ బాంధవః క్షితి నభోవ్యాప్తం తమో మండలం/ భిత్వా, లోచన గోచరః అపి.** అదే నువ్వున్నావు. కావడానికి కోటి సూర్యుల కాంతి కలవాడివి. **త్వం కోటి సూర్య ప్రభః** కానీ కొంచెం నా కంటికి సాక్షాత్కరించవయ్యా అంటే ససేమిరా కనబడవేమి? **వేద్యం కిం న భవసి, అహో?** అదేమంటే, 'నీ అజ్ఞాన తమస్సు వల్ల నేను కనిపించడం లేదు' అంటావు. అసలు అల్పుడిని నేనెంత? ఆ అల్పుడి అల్పమైన అజ్ఞానాంధకారం ఎంత? భూమ్యాకాశాలు వ్యాపించి ఉన్న అంధకారం ముందు, నా తమోంధకారం ఎంత? కోటి సూర్యుల కాంతి వాడివి నీకది అడ్డమా? నువ్వు తలచుకొంటే దాన్ని అర క్షణంలో ధ్వంసం చేయగలవు. కనుక నెపాలూ, సాకులూ మాని నా కళ్ళకు కనిపించవయ్యా, పుణ్యం ఉంటుందని 'శివానందలహరి'లో అంటారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.1.47 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** చిత్త రా.3.17 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.9.37 నుండి 11.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.43 నుండి 7.25 వరకు, **అమృతఘడియలు:** రా.8.12 నుండి 9.57 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

16న తిరుచానూరు అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం



తిరుచానూరు (తిరుపతి జిల్లా): తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 16వ తేదీ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 16న తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. ఇందులో పాల్గొన్న గృహస్థులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, వడ బహుమానంగా అందజేయనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ వ్రతం కారణంగా అమ్మవారి ఆలయంలో ఆర్జిత సేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వచనం, బ్రేక్ దర్శనం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఆదివాసీ దినోత్సవంలోనూ విలువ ఇవ్వరా?

రంపచోడవరంలో గిరిజన ప్రజాప్రతినిధుల ఆగ్రహం



రంపచోడవరం ఐటీడీఏలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి

రంపచోడవరం(అల్లూరి సీతారామరాజు జిల్లా): 'ఆదివాసీ దినోత్సవం రోజు కూడా మాకు విలువ ఇవ్వరా? వేడుకలకు పిలిచి మాకు కనీస విలువ ఇవ్వకుండా అవమానిస్తారా?' అంటూ అధికారులపై రంపచోడవరం గిరిజన ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఏఎస్ అధికారులతో పాటు ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య తదితరులు హాజరయ్యారు. అధికారులు జెండా ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన సమయంలో సైతం స్థానిక గిరిజన ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదు. దీంతో వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేడుకలను బహిష్కరించి ఐటీడీఏ గేటు బయట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ దినోత్సవంలో కూడా స్థానిక సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీలకు కనీస ప్రాధాన్యం ఇవ్వరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఐఏఎస్ అధికారుల సమక్షంలో ఇలా జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వేడుకలను బహిష్కరించిన వారిలో వైస్ ఎంపీపీ పండా కుమారి, ఎంపీటీసీ వంశీ కుంజం, సర్పంచ్‌లు వడగల ప్రసాద్, రమేశ్‌బాబుదొర, పండా రామకృష్ణదొర ఉన్నారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి స్పందిస్తూ.. 'రంపచోడవరం ఐటీడీఏలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవం పూర్తిగా టీడీపీ కార్యక్రమంలా నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవం రోజున.. గిరిజన ప్రజాప్రతినిధులకు అవమానం జరగడం దారుణం. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తాం' అని చెప్పారు.

సచివాలయాల వ్యవస్థ ప్రక్షాళనను స్వాగతిస్తున్నాం

- గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ సమూల మార్పులకు శ్రీకారం చుడుతుందనే నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతులైన గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే దాదాపుగా ఐదేళ్ల సర్వీస్‌లో విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనల గురించి సైతం అనుభవం గడించారని..ఆయా ఉద్యోగులను వారికి సంబంధించిన మాతృశాఖలతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఉన్న అనేక ఖాళీలలో అవకాశం కల్పించి అర్హత ప్రకారం భర్తీ చేయాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

'వందేభారత్' షెడ్యూల్‌లో మార్పు



తాటిచెట్లపాలెం/ రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విశాఖ - సికింద్రాబాద్–విశాఖ (20834/20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌ను మార్పు చేస్తున్నట్లు రైల్వే బోర్డు ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఆదివారం మినహా ప్రతి రోజూ ఈ రైలు రాకపోకలు సాగిస్తోంది. డిసెంబర్ 10 నుంచి మంగళవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో(వారానికి ఆరు రోజులు) వందేభారత్ నడవనుంది.

• తెలంగాణ

'మనూ'లో యూజీకి 12 నుంచి దరఖాస్తులు

మనూ డీఓఏ డైరెక్టర్ వనజ వెల్లడి



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మనూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం.వనజ శుక్రవారం తెలిపారు. జీయూఈటీలో హాజరుకాని ఇంటర్మీడియట్/12వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా నేరుగా మనూ అడ్మిషన్ పోర్టల్ లింక్ ద్వారా ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బీఏలో ప్రవేశాలు (ఆనర్స్/పరిశోధన) హైదరాబాద్ క్యాంపస్‌లో, లక్నో క్యాంపస్, మనూ మోడల్ స్కూల్ క్యాంపస్ హైదరాబాద్ (ఈవినింగ్ కాలేజ్), వారణాసి క్యాంపస్, భోపాల్ క్యాంపస్, దర్భంగా క్యాంపస్‌లలో అందుబాటులో ఉండగా, బీఏ జేఎంసీ (ఆనర్స్/రీసెర్చ్), బీకామ్ (ఆనర్స్/రీసెర్చ్) బీఎస్సీ (ఆనర్స్/పరిశోధన), బ్యాచిలర్ ఆఫ్ ఒకేషన్ (ఎంఐటీ/ఎంఎల్‌టీ/ఈటీటీ) హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు. సీయూఈటీలో హాజరైన అభ్యర్థులకు ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. దరఖాస్తును సమర్పించేటప్పుడు విద్యార్థులు వారి మొబైల్ నంబర్, ఈ–మెయిల్‌ను నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించి, అడ్మిషన్ పోర్టల్ లింక్‌పై క్లిక్ చేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23120600 (ఎక్స్‌టెన్షన్ 1801)ని సంప్రదించాలన్నారు.

'నాగోబా'కు పోటెత్తిన భక్తజనం

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివచ్చారు. గంటల తరబడి బారులుతీరి నాగోబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో జొన్నగట్కా ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ నాగోబా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

జస్టిస్ దుర్గాప్రసాద్‌కు హైకోర్టు ఘన వీడ్కోలు

ఆయన సేవల్ని కొనియాడిన సీజే జస్టిస్ ఠాకూర్



జస్టిస్ దుర్గాప్రసాద్ దంపతులను సత్కరించి చిత్రపటం బహూకరిస్తున్న సీజే జస్టిస్ ఠాకూర్ తదితరులు

సాక్షి, అమరావతి: హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావుకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. జస్టిస్ దుర్గా ప్రసాద్ ఈ నెల 11న పదవీ విరమణ చేయనున్నారు. ఆ రోజున ఆదివారం కావడంతో ఆయనకు హైకోర్టు శుక్రవారమే వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులంతా మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీజే జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ.. జస్టిస్ దుర్గాప్రసాదరావు న్యాయాధికారిగా, న్యాయమూర్తిగా ఎనలేని సేవలు అందించారన్నారు. న్యాయమూర్తిగా ఆయన 16 వేల కేసులను పరిష్కరించారన్నారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం ,రాష్ట్ర న్యాయవాద మండలి చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మ మాట్లాడుతూ.. జస్టిస్ దుర్గాప్రసాదరావు తన తీర్పుల్లో నిష్పాక్షికత, సమానత్వానికి పెద్దపీట వేశారని చెప్పారు. జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ.. వ్యక్తులకన్నా వ్యవస్థ గొప్పదన్నారు. వ్యక్తులు వచ్చిపోతుంటారని, వ్యవస్థ ఎప్పటికీ శాశ్వతమన్నారు. అదనపు అడ్వొకేట్ ఇవన సాంబశివప్రతాప్, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, ఉపాధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి హైకోర్టు రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదుల సంఘం, హైకోర్టు ఉద్యోగుల సంఘం జస్టిస్ దుర్గాప్రసాదరావు దంపతులను ఘనంగా సన్మానించాయి.

సత్యదేవుని సన్నిధిలో 'స్వర్ణ' ధ్వజస్తంభం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన సత్యదేవుని సన్నిధిలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభానికి స్వర్ణ రేకు తాపడం పనులు పూర్తవడంతో శుక్రవారం పండితుల మంత్రోచ్చారణ మధ్య ధ్వజస్తంభాన్ని ప్రారంభించారు. దీంతో స్వామివారి ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. నెల్లూరుకు చెందిన దాతలు రూ.3 కోట్లతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి దానికి స్వర్ణ రేకు తాపడం చేసేందుకు ముందుకు వచ్చారు. 50 ఏళ్ల తరువాత సత్యదేవునికి ఈ ఏడాది ఏప్రిల్ 22న పాత ధ్వజస్తంభం స్థానంలో 'నారేప'కర్రతో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠ చేశారు. గత మే లో ధ్వజస్తంభానికి స్వర్ణ తాపడం చేసేందుకు రాగి రేకుపై బంగారు పూత పనులను చెన్నైలో ప్రారంభించారు. ఆ రేకులు బుధవారం దేవస్థానానికి చేరడంతో గురువారం తాపడం పనులు చేపట్టి సాయంత్రానికి పూర్తి చేశారు. ధ్వజస్తంభం చివరన స్వర్ణ మేఖలాలు, సుదర్శన చక్రం అమర్చారు.



నూతన ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు, దాత దంపతులు

దాత దంపతులు, ఆలయ ఇన్‌చార్జి ఈవో డీఎల్‌వీ రమేష్ బాబు, వేద పండితులు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తికి జైలు

రూ.20 లక్షలు వసూలు చేసిన వేణుగోపాల్‌కు ఏడాది జైలుశిక్ష, జరిమానా



సత్తెనపల్లి: స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో దోషి ఓర్సు వేణుగోపాల్‌కి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని శుక్రవారం తీర్పు చెప్పారు. నేరారోపణ రుజువు కాకపోవడంతో వేణుగోపాల్ భార్య, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శైలజను నిర్దోషిగా ప్రకటించారు. కేసు వివరాలు.. సత్తెనపల్లి పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన కొలుసు ఆంజనేయులు కుమార్తె వెంకటశ్రావణికి స్పోర్ట్స్‌కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని 2015వ సంవత్సరంలో నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన ఓర్సు వేణుగోపాల్, శైలజ దంపతులు ఒప్పందం చేసుకున్నారు. ఇందుకు రూ.30 లక్షలు ఖర్చవుతుందని చెప్పగా ఆంజనేయులు రూ.20 లక్షలు ఇచ్చారు. తరువాత వారు సీటు ఇప్పించలేదు. దీంతో కొలుసు ఆంజనేయులు 2015లో వేణుగోపాల్ దంపతులపై సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏ–1గా వేణుగోపాల్, ఏ–2గా శైలజపై కేసు నమోదు చేసిన అప్పటి పట్టణ సీఐ ఎస్.సాంబశివరావు విచారించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరారోపణ రుజువు కావడంతో వేణుగోపాల్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరునెలలు జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. శైలజపై నేరారోపణ రుజువు కాకపోవడంతో ఆమెను నిర్దోషిగా ప్రకటించారు.

ఎన్నికల గుర్తులపై కోర్టుకు వెళ్లడానికి వీల్లేదు

హైకోర్టుకు నివేదించిన ఈసీ



సాక్షి, అమరావతి: ఎలక్షన్ సింబల్స్ విషయంలో అభ్యంతరాలు ఉంటే వాటిని ఎలక్షన్ ట్రిబ్యునల్ ముందే లేవనెత్తాల్సి ఉంటుంది తప్ప, న్యాయస్థానాల్లో కాదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) హైకోర్టుకు నివేదించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని వివరించింది. అందువల్ల గాజు గ్లాసు కేటాయింపు విషయంలో పిటిషనర్లు తమ అభ్యంతరాలన్నింటినీ ట్రిబ్యునల్ ముందు లేవనెత్తాల్సి ఉంటుందని తెలిపింది. దీనిపై అధికరణ 226 కింద హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదంది. ఈసీ చెప్పిన ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఈ వివరాలన్నింటినీ అఫిడవిట్‌గా తమ ముందుంచాలని జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను ఆదేశించింది. దీని ఆధారంగా తమ ముందున్న అప్పీళ్ల విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ విచారణను ఈనెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ ఎం.కిరణ్మయి ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. గాజు గ్లాసు గుర్తు కేటాయింపు విషయంలో ఈసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందంటూ.. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ, దళిత బహుజన పార్టీలు ఎన్నికల సమయంలో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి, ఈ విషయంలో జోక్యానికి నిరాకరించారు. ఈ తీర్పును ద్విసభ్య ధర్మాసనం ముందు సవాలు చేశారు.

ప్రాణం తీసిన జల్లికట్టు

- ఎద్దు దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి
- చిత్తూరు జిల్లాలో ఘటన



దిలీప్‌కుమార్ (ఫైల్)

పూతలపట్టు (చిత్తూరు జిల్లా): జల్లికట్టు ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. ఈ ఘటన గురువారం చిత్తూరు జిల్లా, యాదమరి మండలం, కొట్టాలలో చోటుచేసుకోగా, శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. ఆడిజాతర పురస్కరించుకుని కొట్టాలలో గురువారం మారెమ్మ జాతర జరిగింది. ఇందులోనే జల్లికట్టును నిర్వహించారు. దీనికి మండల, తమిళనాడు సరిహద్దు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఎద్దులొచ్చాయి. కొంతసేపటికి ఓ ఎద్దు జల్లికట్టును వీక్షిస్తున్న బంగాపాళ్యంకు చెందిన దిలీప్‌కుమార్ (40)పైకి దూసుకెళ్లింది. కొమ్ములతో బలంగా పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఇదే ఘటనలో మరో 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. అనుమతి లేకుండా జల్లికట్టు నిర్వహించిన మునిరత్నం, సెల్వరాజ్, పళనివేలు, మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిత్తూరు మండలం, తమ్మింద గ్రామంలో పదేళ్లుగా కాపురం ఉంటున్నారు.

స్వగ్రామంలో బాలు విగ్రహావిష్కరణ



విగ్రహం వద్ద బాలు కుటుంబసభ్యులు

పళ్లిపట్టు (తమిళనాడు): దివంగత సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆయన కుటుంబీకులు తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా, పళ్లిపట్టు సమీపంలోని కోనేటంపేటలో శుక్రవారం ఆవిష్కరించారు. కోనేటంపేటలో పుట్టిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రముఖ గాయకుడిగా ప్రపంచకీర్తి ఆర్జించారు. 2017లో తన 71వ జన్మదిన వేడుకలను స్వగ్రామంలో కుటుంబీకులు, గ్రామీణులతో కలిసి జరుపుకున్న సందర్భంగా గ్రామస్తుల కారణంగానే తాను 'బాలు'గా అందరికీ సుపరిచితమయ్యానని గుర్తు చేసుకున్నారు. 2020లో తన 74 ఏట అనారోగ్యంతో బాలు చెన్నైలో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎస్పీబీ స్వగ్రామంలోని ఆయన ఇంటి వద్ద విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయన మామ కొడుకు ఆత్మకూరు భానుమూర్తి నిర్ణయించి, 4 అడుగుల ఎస్పీబీ పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీబీ సతీమణి సావిత్రి, చెల్లెలు, గాయకురాలు ఎస్పీ శైలజ, ఆమె భర్త శుభలేఖ సుధాకర్, చెల్లెళ్లు వసంత, కళ్యాణి పాల్గొన్నారు.

డిజిటల్ ఇండియా దిశగా వాల్తేర్ రైల్వే డివిజన్

66 స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ల బుకింగ్ ప్రారంభం

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సంపూర్ణ డిజిటల్ దిశగా అడుగులు వేస్తోంది. డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లలో టికెట్లు తీసుకునేవారి సౌలభ్యం కోసం క్యూఆర్ కోడ్‌ను వినియోగిస్తూ నగదు చెల్లించే పద్ధతిని ప్రవేశపెట్టింది. వాల్తేర్ డివిజన్ పరిధిలో మొత్తం 115 స్టేషన్లున్నాయి. వీటిలో శుక్రవారం 66 స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. త్వరలోనే మరిన్ని స్టేషన్లకు విస్తరించనున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర యూపీఐ యాప్స్‌లలో క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి టికెట్లకు చెల్లించవచ్చు.

ఈ తేలు కుట్టదు



తేలు.. దీన్ని చూడగానే ముచ్చెమటలు ఖాయం. ఇక ముట్టుకోవాలంటే గుండె ధైర్యం కావాలి. అలాంటిది కొంతమంది ఓ ప్రాంతంలో నాగపంచమి రోజున వాటితో పరాచకాలు అడుతున్నారు. శుక్రవారం కర్ణాటకలోని యాదగిరి జిల్లా, గుర్మిట్కల్ తాలూకా, కందుకూరు సమీపంలోని కొండమ్మవ్వ అమ్మవారి సన్నిధిలో తేళ్ల పంచమి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు గుట్టపై తేళ్ల కోసం రాళ్ల కింద వెతుకుతూ కనిపించిన వృశ్చికాలను పట్టుకుని ఒంటిపై వేసుకున్నారు. ఇలా చేస్తే మంచి జరుగుతుందని, తేళ్ల పంచమి రోజున ఇవి కుట్టవని భక్తులు తెలిపారు.

– రాయచూరు రూరల్

భార్య రాకతో.. పెళ్లి కొడుకు పరార్



పెళ్లి ఫొటోలు చూపుతున్న సంధ్య

తిరుమల: భార్యకు తెలియకుండా రెండో పెళ్లికి సిద్ధమయ్యాడో ప్రబుద్ధుడు. భార్య రావడంతో ఆ వివాహం నిలిచిపోగా.. పెళ్లి కుమారుడు పారిపోయాడు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా పేట పెండ్యాలకు చెందిన రాకేశ్‌కు 2016 ఏప్రిల్‌లో సంధ్యతో వివాహమైంది. వీరికి మాన్యత అనే ఏడేళ్ల పాప కూడా ఉంది. పాప పుట్టిన తరువాత భార్యను పుట్టింటికి పంపేశాడు. కొంత కాలం తర్వాత విడాకులు నోటీసులు పంపాడు. ఇద్దరూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. విడాకులకు సంధ్య ఒప్పుకోలేదు. న్యాయస్థానం కొంతకాలం కలిసి జీవించాలని ఆదేశాలివ్వగా.. అత్తవారింటికి చేరిన సంధ్యను భర్త రాకేశ్, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేశారు. దీంతో ఆమె తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ కేసు కొనసాగుతోంది. కాగా.. రాకేశ్ హైదరాబాద్‌కు చెందిన ఓ యువతితో రెండో వివాహానికి సిద్ధమయ్యాడు. తిరుమలలోని ఓ మఠంలో శుక్రవారం వివాహం జరుగుతుండగా.. భార్య కల్యాణ మండపానికి చేరుకుంది. దీంతో రాకేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం సంధ్య.. కుమార్తెతో కలిసి తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

19 నుంచి 'ఒంగోలు' ఈవీఎంల చెకింగ్

- బాలినేని ఫిర్యాదు మేరకు ఈవీఎంల పరిశీలనకు ఈసీ అనుమతి
- ఇది రీ కౌంటింగ్ కాదు
- ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఇటీవలి ఎన్నికల్లో ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈవీఎంల పరిశీలనకు ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయమై శుక్రవారం ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను విలేకర్లు అడగగా.. జరిగేది రీకౌంటింగ్ కాదని, డమ్మీ బ్యాలెట్‌లతో ఈవీఎంల పరిశీలన జరుగుతుందని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బెల్ కంపెనీ ఇంజనీర్లతో డమ్మీ బ్యాలెట్‌లు ఏర్పాటు చేసి ఫిర్యాదు చేసిన వారికి చూపించనున్నట్టు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను పరిశీలించనున్నట్లు చెప్పారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రోజుకు రెండు ఈవీఎంల వంతున పరిశీలించనున్నట్లు తెలిపారు.

కన్ఫర్మ్ కాని టికెట్‌తో రైలెక్కితే దించేస్తారు

- రిజర్వేషన్ టికెట్ నిబంధనల అమలుపై రైల్వే బోర్డు కీలక ఆదేశాలు
- వెయిట్ లిస్టెడ్ టికెట్‌తో 'పెనాల్టీ' చెల్లించి ప్రయాణించే పద్ధతి ఇక బంద్
- అలా దొరికితే.. పెనాల్టీ వసూలు చేసి రైలు దించేలా నిబంధనలు కఠినతరం
- జనరల్ క్లాస్ రుసుము వసూలు చేసి వాటిల్లోకి తరలింపు
- వాటిల్లో ఖాళీలు లేకుంటే రైలు దిగిపోవాల్సిందే



సాక్షి, హైదరాబాద్: కన్ఫర్మ్ కాని వెయిటింగ్ జాబితాలో ఉన్న రైలు టికెట్‌తో రిజర్వ్‌డ్ కోచ్‌లలో ప్రయాణిస్తే టీసీలు ఇక రైలు నుంచి దింపేస్తారు. వారు జనరల్ క్లాస్ టికెట్ ధర చెల్లించి అప్పటికప్పుడు ఆ కోచ్‌లోకి మారాల్సి ఉంటుంది. లేని పక్షంలో రైలు దిగిపోవాల్సిందే. ఈమేరకు రైల్వే బోర్డు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు.. రిజర్వేషన్ క్లాస్‌కు సంబంధించిన వెయిట్ లిస్టెడ్ టికెట్‌తో అదే క్లాసులో పెనాల్టీ చెల్లించి ప్రయాణించేందుకు కొన సాగుతున్న 'అనధికార' వెసులుబాటుకు అవకాశం లేకుండా రైల్వే బోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

ఇక ఆ టికెట్‌తో వెళ్లడం కుదరదు..

రిజర్వ్‌డ్ కోచ్‌లలో ప్రయాణం చేసేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ కొన్నప్పుడు.. కన్ఫర్మ్ అయితే సంబంధిత కోచ్‌లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించొచ్చు. కానీ, ప్రయాణ సమయం నాటికి కన్ఫర్మ్ కాని పక్షంలో ఆ టికెట్ రద్దయి, సంబంధిత టికెట్ రుసుము మొత్తం సంబంధీకుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. టికెట్ రద్దయినందున, ఆ టికెట్ ప్రయాణానికి వీలుండదు. కానీ, రైల్వే స్టేషన్లలోని టికెట్ కౌంటర్‌లో కొనుగోలు చేసిన రిజర్వ్‌డ్ క్లాస్ టికెట్ కన్ఫర్మ్ కాని పక్షంలో ఆ టికెట్ రుసుము కోసం మళ్లీ స్టేషన్‌లోని కౌంటర్‌కు వెళ్లి రద్దు ఫామ్ పూరించి టికెట్‌తో కలిపి అందజేస్తే గానీ ఆ డబ్బులు తిరిగి చెల్లిస్తారు. కానీ, చాలామంది ఆ కన్ఫర్మ్ కాని టికెట్‌ను రద్దు చేసుకోకుండా, సంబంధిత కోచ్‌లో ప్రయాణిస్తారు. టీసీ చెకింగ్ చేసినప్పుడు కొంత ఫైన్ చెల్లించటం ద్వారానో, ఎంతో కొంత ముట్టచెప్పటం ద్వారానో ప్రయాణాన్ని కొనసాగిస్తారు. ఇద్దరు ముగ్గురు కలిసి ప్రయాణిస్తున్నప్పుడు, కొన్ని టికెట్లు కన్ఫర్మ్ అయి, కొన్ని వెయిటింగ్ జాబితాలోనే ఉండిపోతే, అలాగే సర్దుకుని వెళ్తుంటారు. కానీ, ఇక నుంచి అలాంటి అవకాశం లేకుండా రైల్వే బోర్డు కఠినతరం చేసింది.

అలా పట్టుబడితే పెనాల్టీనే

టికెట్ కన్ఫర్మ్ కాని పక్షంలో దాన్ని రద్దు చేసుకోవాల్సిందే. ఒక వేళ ఆ టికెట్‌తో రిజర్వ్‌డ్ కోచ్‌లో ప్రయాణిస్తూ పట్టుబడితే, వారి నుంచి రూ.250 నుంచి రూ.440 వరకు పెనాల్టీ వసూలు చేసి, వారిని తదుపరి స్టేషన్‌లో దింపి, జనరల్ క్లాస్ టికెట్ రుసుము తీసుకుని అందులోకి మార్పిస్తారు. జనరల్ క్లాస్‌లో అవకాశం లేనప్పుడు స్టేషన్‌లో దింపేస్తారు. ఈమేరకు జోన్లకు రైల్వే బోర్డు నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయి.

వేలల్లో ఫిర్యాదులు.. అలా చేస్తే టీసీలపైనా చర్యలు

కన్ఫర్మ్ కాని టికెట్‌తో ప్రయాణించటం నిబంధనలకు విరుద్ధం. అయినా కూడా వాటితో రిజర్వ్‌డ్ కోచ్‌లలో.. టీసీల సహకారంతో ప్రయాణించే పద్ధతి అనధికారికంగా అమలులో ఉంది. ఇలా క్రమంగా రిజర్వ్‌డ్ కోచ్‌లలో ఇలాంటి వారి సంఖ్య పెరుగుతూండటంతో.. రిజర్వేషన్ టికెట్‌తో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కొంతమంది వారిని దబాయించి మరీ సీటులో జాగా కల్పించుకుని ప్రయాణిస్తున్నారు. మరికొందరు సీట్లలో ఏదో ఓ వైపు కూర్చుని వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలాంటి వాటిపై ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు రైల్వే బోర్డుకు 8 వేల వరకు ఫిర్యాదులందినట్టు తెలిసింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన రైల్వే బోర్డు, నిబంధనలను కచ్చితంగా అనుసరించాలని, రిజర్వ్‌డ్ కన్ఫర్మ్ టికెట్ లేని వారు ఎట్టి పరిస్థితిలో రిజర్వ్‌డ్ కోచ్‌లలో ప్రయాణించకుండా చూడాలని, ఒకవేళ టీసీలు వారికి వీలు కల్పించినట్టు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరికలు జారీ అయ్యాయి. కాగా, కన్ఫర్మ్ కాని టికెట్ ఉన్న వారిని జనరల్ కోచ్‌లకు తరలిస్తే, వాటిపై మరింత భారం పెరుగుతుందనీ,. ఈ నేపథ్యంలో రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య పెంచాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

నాడు గుండె చెరువు.. నేడు ఆదరువు

బెజవాడ వాసులకు వరద ముంపు లేదిక



విజయవాడ కృష్ణలంకలోని రణధీర్‌నగర్ వైపు నిర్మించిన వరద రక్షణ గోడ

వైఎస్ జగన్ పాలనకు ముందు వరకు విజయవాడలో కృష్ణా నదికి వరద వస్తోందంటే నదిని ఆనుకుని ఉన్న కాలనీల ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. తట్టా, బుట్టా నెత్తిన పెట్టుకుని.. పిల్లలను చంకనెత్తుకుని.. కట్టుబట్టలతో దాదాపు 80 వేల మంది ఇతర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు, తాత్కాలిక పునరావాస శిబిరాలకు పరుగులు తీయాల్సిన దయనీయ స్థితి. విజనరీనని చెప్పుకునే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటికీ 2014–19 మధ్య ఈ సమస్య పరిష్కారానికి ఏమీ చేయలేదు. నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ ప్రజల కష్టనష్టాల్ని కళ్లారా చూశారు. 2019లో సీఎం కాగానే ఆ పరిస్థితిని మార్చేయడానికి వేగంగా అడుగులు వేశారు. పద్మావతి ఘాట్ నుంచి కోటి నగర్ వరకు రూ.474.51 కోట్లతో 5.66 కిలోమీటర్ల మేర 12 లక్షల కూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా రక్షణ గోడ (రిటైనింగ్ వాల్) నిర్మించారు. ఇప్పుడు ఎంత భారీగా వరద వచ్చినా ఎవరికీ ఇబ్బంది లేదు. కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వర్‌నగర్, కోటినగర్, పోలీస్‌కాలనీ, రణధీర్‌నగర్, గౌతమినగర్, నెహ్రూనగర్, చలసాని నగర్, గీతానగర్, బాలాజీనగర్, ద్వారకానగర్, భూపేష్ గుప్తా నగర్, భ్రమరాంబపురం వాసులంతా నిశ్చింతగా గడుపుతున్నారు. వారధి వద్ద రిటైనింగ్ వాల్ వెంట రూ.12.3 కోట్లతో సుందరంగా పార్కును కూడా నిర్మించారు.

– సాక్షి ప్రతినిధి, విజయవాడ

అరచేతిలో అపార సౌర శక్తి

బుల్లి సౌర ఫలకం!

వెంట్రుక కన్నా 100 రెట్లు పలుచన | సెల్ ఫోన్‌ను ఇట్టే చార్జ్ చేసుకోవచ్చు

ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టుల ఆవిష్కారం


ఒకవైపు ఇంధన అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరుల ఉత్పత్తి అంతులేని కాలుష్యానికి, గ్లోబల్ వార్మింగ్ పెనుభూతానికి కారకంగా మారుతోంది. సౌర విద్యుత్ సమర్థ ప్రత్యామ్నాయంగా కన్పిస్తున్నా దాని తయారీకి భారీ ఫలకాలు, విశాలమైన స్థలం వంటివెన్నో కావాలి. ఈ సమస్యలకు కూడా చెక్ పెడుతూ, సౌర విద్యుదుత్పత్తిని అత్యంత సులభతరం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎక్కడికక్కడ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోగలిగే అతి సూక్ష్మ సౌర ప్యానళ్ల త్వరలో రాబోతున్నాయి. వెంట్రుక మందంలో కేవలం వందో వంతు మాత్రమే ఉండే ఈ బుల్లి సౌర ప్యానళ్లను ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సైంటిస్టులు తాజాగా అభివృద్ధి చేశారు. వీటిని ప్రయాణాల్లో వీపుకు తగిలించుకునే బ్యాక్‌ప్యాక్‌పై, సెల్ ఫోన్ వెనక, కార్ రూఫ్ మీద... ఇలా ఎక్కడైనా సులువుగా అమర్చుకోవచ్చు! అంతేకాదు, ప్రస్తుత సౌర ఫలకాల కంటే రెట్టింపు సౌర విద్యుదుత్పాక సామర్థ్యం ఈ బుల్లి ఫలకాల సొంతం!!

ఎలా పని చేస్తుంది?

ఈ బుల్లి ప్యానళ్లలో సోలార్ కోటింగ్‌ను పెరోవ్‌స్కైట్స్‌గా పిలిచే పదార్థంతో తయారు చేస్తారు. ప్రస్తుత సిలికాన్ ఆధారిత సౌర ప్యానళ్లతో పోలిస్తే ఇది సూర్యరశ్మిని మరింత మెరుగ్గా ఒడిసిపడుతుంది. పైగా ప్రస్తుత ప్యానళ్లు అవి ఒడిసిపడుతున్న సూర్యరశ్మిలో 22 శాతాన్ని మాత్రమే ఇంధనంగా మార్చగలుగుతున్నాయి. ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టులు రూపొందించిన బుల్లి ప్యానళ్లు 27 శాతం సామర్థ్యంతో పని చేస్తాయి. దీన్ని మున్ముందు 45 శాతం దాకా పెంచుకోవచ్చని వాళ్లు బల్లగుద్ది చెబుతున్నారు. ''తొలిసారి రూపొందించినప్పుడు వీటి కన్వర్షన్ సామర్థ్యం 6 శాతమే. ఐదేళ్లలోనే దాన్ని 27 శాతానికి పెంచగలిగాం'' అని వివరించారు. ''ఎలా చూసుకున్నా సౌర విద్యుదుత్పత్తి రంగంలోనే ఇది అతి కీలకమైన ముందడుగు. ఎందుకంటే సిలికాన్ ఆధారిత ప్యానళ్లను బిగించేందుకు ప్రత్యేక సౌర క్షేత్రాలు తప్పనిసరి. అందుకు పంట పొలాలను వాడుతుండటం ప్రపంచవ్యాప్తంగా రైతుల ఆందోళనలు తదితరాలకు దారి తీస్తోంది. కానీ పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లకు ఆ అవసరమే ఉండదు. సిలికాన్ ప్యానళ్లతో పోలిస్తే వీటిని ఎక్కడంటే అక్కడ అతి సులువుగా బిగించుకోవచ్చు. కారుచౌకగా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. ఎలాంటి ఉపరితలం మీదైనా ఇవి సులువుగా ఒదిగిపోతాయి. చివరికి ప్లాస్టిక్, కాగితంపై కూడా!'' అని పరిశోధనలో పాలుపంచుకున్న ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టు జుంక్ వాంగ్ వివరించారు. ''పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లలో కేవలం ఒక మైక్రాన్ మందం కోటింగ్ ఉంటుంది. ప్రస్తుత సౌర ప్యానళ్లలో వాడుతున్న సిలికాన్ కోటింగ్‌తో పోలిస్తే ఇది ఏకంగా 150 రెట్లు పలుచన'' అని చెప్పారు.

ఆ సమస్యనూ అధిగమిస్తే...

సంప్రదాయ సిలికాన్ సౌర ప్యానళ్లతో పోలిస్తే బుల్లి ప్యానళ్లలో ఒక పెద్ద సమస్య లేకపోలేదు. అదే... స్థిరత్వం! పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లు ప్రయోగశాల పరిస్థితుల్లోనే కరిగిపోతున్నాయి. లేదా కొద్ది రోజుల్లోనే విరిగిపోతున్నాయి. అయితే ఇది సమస్యేమీ కాదని వాంగ్ అన్నారు. ''వాటి జీవితకాలాన్ని పెంచేందుకు జరుగుతున్న పరిశోధనలు కొలిక్కి వస్తున్నాయి' అని వివరించారు.




పెరోవ్‌స్కైట్‌తో తయారైన బుల్లి సౌర ప్యానల్‌ను పరిశీలిస్తున్న ఆక్స్‌ఫర్డ్ పరిశోధక బృంద సభ్యుడు షుయ్‌ఫెంగ్ హూ

ఆకాశమే హద్దు...!

ప్రపంచవ్యాప్తంగా సౌర ప్యానళ్ల ఏర్పాటు ఒక్క గత ఏడాదిలోనే ఏకంగా 80 శాతం పెరిగినట్టు స్వచ్ఛ ఇంధన గణాంకాలు, విశ్లేషణలో పేరున్న వుడ్ మెకెంజీ సంస్థ వెల్లడించింది. వాటి ఏర్పాటుకు వెచ్చించాల్సిన ఖర్చు భారీగా తగ్గుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా సౌర విద్యుత్ అతి చౌకైన ఇంధన వనరుగా మారిపోతోంది. అంతేగాక గత 19 ఏళ్లుగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విద్యుత్ వనరుగా నిలుస్తూ వస్తోంది. ''ఈ పరిస్థితుల్లో మేం రూపొందించిన బుల్లి సౌర ప్యానళ్లు గనక ఒక్కసారి సక్సెసైతే వీటి వాణిజ్య విలువ ఆకాశాన్నంటుతుంది. అప్పుడిక ప్రపంచ ఇంధన రంగ ముఖచిత్రమే మారిపోవడం ఖాయం'' అని పరిశోధక బృందం సారథి హెన్రీ స్నెయిత్ ధీమాగా చెబుతున్నారు!

– సాక్షి, నేషనల్ డెస్క్

సిసోడియాకు బెయిల్



- దర్యాప్తును సాగదీస్తూ నిందితుడిని ఎంతోకాలం జైల్లో ఉంచలేమన్న సుప్రీం
- శుక్రవారం తిహార్ జైలు నుంచి విడుదల
- 17 నెలలుగా జైలులో విచారణ ఖైదీగా గడిపిన మాజీ ఉప ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్య కుంభకోణం కేసులో 17 నెలల క్రితం అరెస్టయి తిహార్ జైలులో విచారణ ఖైదీగా గడుపుతున్న ఆప్ నేత, నాటి ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఎట్టకేలకు సుప్రీంకోర్టులో బెయిల్ దొరికింది. సుదీర్ఘకాలంపాటు కేసు దర్యాప్తును సాగదీసి విచారణ ఖైదీకుండే హక్కులను కాలరాయలేమని శుక్రవారం బెయిల్ ఉత్తర్వులిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం సిసోడియాకు బెయిల్‌ను మంజూరుచేస్తూ 38 పేజీల తీర్పు వెలువరించింది. బెయిల్ పిటిషన్‌పై ఆగస్ట్ ఆరో తేదీన వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్‌చేసి ఆగస్ట్ 9వ తేదీన వెలువరించింది.

వైకుంఠపాళి ఆడించారు..

''బెయిల్ అనేది నియమం. బెయిల్‌ను తిరస్కరించి విచారణ ఖైదీగా జైలుకు పరిమితం చేయడం అనేది ఒక మినహాయింపు'' మాత్రమే అనే సూత్రాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు జ్ఞప్తికి తెచ్చుకోవాల్సిన సమయమిది. బెయిల్ విషయంలో విచారణ కోర్టులు, హైకోర్టులు సేఫ్ గేమ్ ఆడుతున్నాయి. మనీశ్‌పై సీబీఐ, ఈడీలు దర్యాప్తు పూర్తిచేసి జూలై 3 కల్లా చార్జ్‌షీట్లు సమర్పిస్తాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గతంలో హామీ ఇచ్చారు. కానీ అది జరగలేదు. సిసోడియాను ట్రయల్ కోర్టుకు, అక్కడి నుంచి హైకోర్టుకు, తర్వాత సుప్రీం కోర్టుకు, మళ్లీ ట్రయల్ కోర్టుకు తిప్పుతూ ఆయనతో వైకుంఠపాళి ఆట ఆడించారు. బెయిల్ అనివార్యమైన కేసుల్లోనూ బెయిల్ తిరస్కరించడంతో సంబంధిత పిటిషన్లు సుప్రీంకోర్టుకు వెల్లువలా వస్తున్నాయి. సమాజంతో మమేకమైన సిసోడియా లాంటి వ్యక్తులను శిక్ష ఖరారు కాకుండానే సుదీర్ఘ కాలం నిర్బంధించి ఉంచకూడదు. స్వేచ్ఛగా, వేగవంతమైన విచారణను కోరడం నిందితుడికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. అయితే కేసు విచారణ నత్తనడకన సాగడానికే సిసోడియానే కారణమన్న కిందికోర్టు అభిప్రాయం వాస్తవదూరంగా ఉంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ విషయంలో సిసోడియాకు బెయిల్‌ను తిరస్కరిస్తూ మే 21వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. ''రూ.10 లక్షల వ్యక్తిగత బాండ్‌తోపాటు అదే మొత్తానికి మరో రెండు షూరిటీలను సమర్పించాలి. పాస్ట్‌పోర్ట్‌ను ప్రత్యేక ట్రయల్ కోర్టులో ఇచ్చేయాలి. సాక్ష్యాధారాలను ధ్వంసం చేయకూడదు. సాక్షులను ప్రభావితం చేయకూడదు. దర్యాప్తు అధికారి ఎదుట ప్రతి సోమ, గురు వారాల్లో ఉదయం 10–11 గంటల మధ్య హాజరు కావాలి'' అని కోర్టు షరతులు విధించింది.

తొలుత సీబీఐ.. ఆ తర్వాత ఈడీ


డిప్యూటీ సీఎంగా ఉన్న సిసోడియాను మద్యం కేసులో 2023 ఫిబ్రవరి 26వ తేదీన సీబీఐ అరెస్ట్‌చేసింది. తర్వాత రెండు రోజులకే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. మార్చి 9న మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదుచేసి ఈడీ సైతం జ్యుడీషియల్ కస్టడీలో ఉండగానే ఆయనను అరెస్ట్‌చేసింది.

అంబేడ్కర్‌కు రుణపడ్డా: సిసోడియా

తీర్పు నేపథ్యంలో శుక్రవారం తీహార్ జైలు నుంచి సిసోడియా విడుదలయ్యారు. పెద్దసంఖ్యలో జైలు వద్దకొచ్చిన ఆప్ కార్యకర్తలు ఆయనపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. '' నిరంకుశ కేంద్రప్రభుత్వ చెంప చెళ్లు మనిపించేందుకు రాజ్యాంగ అధికారాలను వినియోగించిన కోర్టుకు నా కృతజ్ఞతలు. శక్తివంతమైన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వల్లే బెయిల్ పొందగలిగా. ఈ బెయిల్ ఉత్తర్వు చూశాక జీవితాంతం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు రుణపడిపోయా. ఈ అనైతిక యుద్ధానికి రాజ్యాంగబద్ధంగా తార్కిక ముగింపు పలికాం. ఏదో ఒక రోజు ఈ చెడు సంస్కృతి అంతమవుతుంది. అప్పుడు బెయిల్‌పై కేజ్రీవాల్ కూడా విడుదల అవుతారు'' అని సిసోడియా అన్నారు.

ఆప్ హర్షం

సిసోడియాకు బెయిల్‌పై ఆప్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. '' సత్యమేవ జయతే. ఢిల్లీలో విద్యా విప్లవానికి నాంది పలికిన సిసోడియాకు ఇది గొప్ప విజయం. ఇది విద్యా విజయం, విద్యా ర్థుల విజయం'' అని ఢిల్లీ మహిళా మంత్రి అతిశి వ్యాఖ్యానించారు.



చినికి చినికి గాలివానగా...

జయ వర్సెస్ ధన్‌ఖడ్!



మీ గొంతులో వ్యంగ్యం ధ్వనిస్తోంది

- ధన్‌ఖడ్ సంబోధనపై జయ అభ్యంతరం
- స్కూలు పిల్లల్లా చూస్తున్నారని ఆక్షేపణ
- ఆమె తీరుపై తీవ్రంగా ఆగ్రహించిన ధన్‌ఖడ్
- సెలబ్రిటీలైతే నిబంధనలకు అతీతులా?
- పేరు ప్రఖ్యాతులున్నది మీకు మాత్రమేనా?
- చైర్‌కే ఉద్దేశాలు ఆపాదిస్తున్నారంటూ ధ్వజం
- జయకు మద్దతుగా విపక్షాల వాకౌట్

ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానం!

న్యూఢిల్లీ: పేరులో ఏముందంటారు. కానీ పేరు పెను వివాదానికి దారి తీయగలదని, అంతకుమించి రాజకీయ సంక్షోభానికీ కారణం కాగలదని రాజ్యసభ సాక్షిగా రుజువైంది. సమాజ్‌వాదీ ఎంపీ జయాబచ్చన్ పేరు విషయమై శుక్రవారం రాజ్యసభలో రాజుకున్న రగడ నాటకీయ మలుపులు తిరిగి చివరికి రాజకీయ దుమారంగా మారింది. ఏకంగా రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను ఉప రాష్ట్రపతి పదవి నుంచి తొలగించాలంటూ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని విపక్ష ఇండియా కూటమి నిర్ణయించుకునే దాకా వెళ్లింది! దాంతో విపక్ష సభ్యులకు, ఆయనకు మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న విభేదాలు కీలక మలుపు తిరిగాయి.

వేడెక్కిన రాజ్యసభ

జయాబచ్చన్ 'పేరు' అంశం శుక్రవారం రాజ్యసభను అమాంతం వేడెక్కించింది. విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై గత వారం బీజేపీ సభ్యుడు ఘన్‌శ్యాం తివారీ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేయడంతో రగడకు బీజం పడింది. ఇది ముగిసిపోయిన అంశమని ధన్‌ఖడ్ బదులివ్వడంతో విపక్ష ఎంపీలంతా గొడవకు దిగారు. దీనిపై జయ మాట్లాడతాననడంతో ధన్‌ఖడ్ అనుమతించారు. 'జయా అమితాబ్ బచ్చన్! మాట్లాడండి' అన్నారు. ఆయన తన పేరును పిలిచిన తీరులో వ్యంగ్యం ధ్వనిస్తోందంటూ జయ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ''నేను నటిని. హావభావాలను ఇట్టే అర్థం చేసుకోగలను. మీ మాటతీరు ఏమాత్రం అంగీకార యోగ్యంగా లేదు. మీరు సభాధ్యక్ష స్థానంలో ఉండొచ్చు గాక. కానీ మీరు మా తోటి సభ్యులు మాత్రమే'' అన్నారు. దాంతో ధన్‌ఖడ్ తీవ్రంగా ఆగ్రహించారు. 'ఇక చాలు' అంటూ మధ్యలోనే కల్పించుకున్నారు. ''మీకు గొప్ప పేరుండొచ్చు. కానీ నటీనటులు దర్శకుడు చెప్పినట్టు చేయాల్సిందే. సభాధ్యక్ష స్థానం నుంచి నేను చూసేది మీకు కన్పించకపోవచ్చు. నా మాటతీరునే తప్పుబడతారా? నేనేం చేయాలో మీరు నిర్దేశించలేరు'' అంటూ ఆక్షేపించారు. ఇందుకు విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలపడంతో ధన్‌ఖడ్ మరింతగా మండిపడ్డారు. ''మీరు సెలబ్రిటీ అయినా, మరెవరైనా సరే! నథింగ్ డూయింగ్. నిబంధనలను అర్థం చేసుకోవాల్సిందే. సభా మర్యాదలు పాటించి తీరాల్సిందే'' అని బచ్చన్‌కు స్పష్టం చేశారు. విపక్ష ఎంపీలంతా తీవ్ర అభ్యంతరం తెలిపినా, మూకుమ్మడిగా నినాదాలకు దిగినా లెక్కచేయలేదు. ఈ అంశంపై మాట్లాడేందుకు ఎవరికీ అనుమతివ్వబోనని స్పష్టం చేశారు. ''పేరు ప్రఖ్యాతులు మీకే ఉంటాయనుకోకండి. మనమంతా ఇక్కడికొచ్చేది మన బాధ్యతలు సరిగా నిర్వర్తించి పేరు సంపాదించేందుకే. పేరు ప్రఖ్యాతులకు తగ్గట్టుగా నడుచుకోవాలి'' అంటూ క్లాసు తీసుకున్నారు. ''సీనియర్ సభ్యులైనంత మాత్రాన సభాపతి స్థానాన్ని అవమానించేందుకు సభాపతి మాటతీరుకు ఉద్దేశాలు ఆపాదించేందుకు ఎవరికీ హక్కు లేదు. పరిస్థితిని బట్టి ప్రతిస్పందించాల్సి వచ్చింది. నా సొంత స్క్రిప్టునే అనుసరిస్తాను తప్ప ఎవరో చెప్పినట్టు నడుచుకునే ప్రసక్తే లేదు'' అంటూ కుండబద్దలు కొట్టారు. విపక్ష సభ్యుల వ్యాఖ్యలేవీ రికార్డుల్లోకి వెళ్లబోవని స్పష్టం చేశారు. జయ పేరుపై రాజ్యసభలో ఆమెకు, ధన్‌ఖడ్‌కు సంవాదం జరగడం వారం రోజుల్లో ఇది మూడోసారి.

మేం స్కూలు పిల్లలమా?: జయ

ధన్‌ఖడ్ తీరుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నట్టు విపక్ష సభ్యులు ప్రకటించారు. దాంతో ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ''మీరు దేశం మొత్తాన్నీ అస్థిరపరిచే ప్రయత్నంలో ఉన్నారని నాకు బాగా తెలుసు. సభలో గందరగోళం సృష్టించడమే మీ ఉద్దేశం. అందుకు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించబోను. మీరంతా మీ బాధ్యతల నుంచి పారిపోతున్నారు'' అంటూ ఆక్షేపించారు. ''రాజ్యాంగాన్ని పణంగా పెట్టయినా ఖర్గే తన మాట నెగ్గించుకోవాలనుకుంటున్నారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే'' అంటూ తప్పుబట్టారు. అనంతరం సోనియాగాంధీ తదితరులతో కలిసి జయాబచ్చన్ సభ నుంచి వాకౌట్ చేశారు. సభా ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ''క్రమశిక్షణలో పెట్టేందుకు మేమేమీ స్కూలు పిల్లలం కాదు. ధన్‌ఖడ్ మాటతీరుతో చాలా కలత చెందాను. అధికార పక్ష సభ్యులు నిండు సభలో మా పట్ల అమర్యాదకరమైన మాటలు వాడుతున్నారు'' అని ఆరోపించారు.

ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ అభిశంసనకు తీర్మానం ప్రవేశపెట్టాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఈ మేరకు నోటీస్‌పై 87 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసినట్టు సమాచారం. ''నోటీసు ఎప్పుడివ్వాలో త్వరలో నిర్ణయిస్తాం. ఇది తీర్మానం దాకా వెళ్లకపోయినా, చైర్మన్‌గా ధన్‌ఖడ్ అనుసరిస్తున్న ఏకపక్ష పోకడలను దేశ ప్రజల ముందు ఎత్తి చూపడమే మా ఉద్దేశం'' అని విపక్షాలు స్పష్టం చేశాయి.

87 మంది ఎంపీల సంతకాలు

ముందస్తు నోటీసు తప్పనిసరి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బి) ప్రకారం ఉపరాష్ట్రపతిని తొలగించాలని కోరుతూ మహాభిశంసన తీర్మానం ప్రవేశపెట్టవచ్చు. మెజారిటీ సభ్యుల మద్దతు లభిస్తే తీర్మానం నెగ్గి ఆయన పదవీచ్యుతుడవుతారు. అయితే మహాభిశంసన కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టబోతున్నామంటూ కనీసం 14 రోజుల ముందస్తు నోటీసివ్వడం తప్పనిసరి.

హిజాబ్ సర్క్యులర్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: తాము ధరించే దుస్తులను ఎంచుకొనే స్వేచ్ఛ విద్యార్థినులకు ఉండాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఎలాంటి దుస్తులు ధరించాలో వారు నిర్ణయించుకోవచ్చని ఉద్ఘాటించింది. తమ విద్యా సంస్థ ప్రాంగణంలో విద్యార్థినులు హిజాబ్, బుర్ఖా, టోపీ, నఖాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ ముంబైలోని ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠీ కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌పై న్యాయస్థానం స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. కాలేజీ సర్క్యులర్‌ను సమర్థిస్తూ బాంబే హైకోర్టు జూన్ 26న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జైనాబ్ అబ్దుల్ ఖయ్యూంతోపాటు మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠీ కాలేజీని నిర్వహిస్తున్న చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. కాలేజీ క్యాంపస్‌లో బొట్టుబిళ్ల, తిలకం ధరించడం కూడా నిషేధిస్తారా? అని ప్రశ్నించింది. హిజాబ్, బుర్ఖా వంటివి ధరించకుండా ఆంక్షలు విధిస్తే విద్యార్థినుల సాధికారత ఎలా సాధ్యమని నిలదీసింది.



'క్రీమీ లేయర్'పై బీజేపీ ఎంపీల ఆందోళన

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ క్రీమీ లేయర్‌కు రిజర్వేషన్ల ఫలాలు వర్తింపజేయకూడదని, క్రీమీ లేయర్‌ను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై బీజేపీ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. వారంతా శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై అభ్యంతరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని అమలు చేయొద్దంటూ వినతి పత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎవరికీ నష్టం జరగదని మోదీ హామీ ఇచ్చినట్టు అనంతరం వారు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, సాధికారతకు తాము కట్టుబడి ఉన్నామని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

గ్రామాల్లో మరో 2 కోట్ల ఇళ్లు

కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్(పీఎంఏవై–జీ) పథకం కింద గ్రామాల్లో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. 2024–25 నుంచి 2028–29కాలానికి గ్రామాల్లో పీఎం ఆవాస్ యోజన అమలుపై గ్రామీణాభివృద్ధి శాఖ ఇచ్చిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–పట్టణ(పీఎంఏవై–యూ) పథకం కింద రూ.2.30 లక్షల కోట్ల సాయం అందించనున్నారు. ఉద్యానరంగంలో చీడపీడలు తగ్గించడం, మెరుగైన విత్తనాలను సృష్టించడం, పూలు, పండ్ల దిగుబడి పెంచడమే లక్ష్యంగా క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్(సీపీపీ)కి కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఉద్యానరంగంలో విప్లవాత్మక మార్పుల కోసం రూ.1,765.67 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఆ 'క్రీమీలేయర్' రాజ్యాంగంలో లేదు

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలుకు ఆస్కారం లేదని కేంద్రం వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల అమలు విషయంలో క్రీమీలేయర్ నిబంధన లేదని స్పష్టంచేసింది. తాజాగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో దీనిపై భేటీలో విస్తృతంగా చర్చ జరిగిందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

నీట్‌-పీజీ పరీక్ష వాయిదా వేయలేం: సుప్రీం



న్యూఢిల్లీ: నీట్‌–పీజీ–2024 పరీక్షను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కేవలం ఐదుగురు విద్యార్థుల కోసం రెండు లక్షల మంది విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయలేమని తేల్చిచెప్పింది. నీట్‌–పీజీ పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తోసిపుచ్చింది. ఈ నెల 11న జరగాల్సిన ఈ పరీక్ష కోసం ఇప్పటికే పరీక్ష కేంద్రాలు కేటాయించారని, ఈ తరుణంలో వాయిదా వేయడం సరైంది కాదని పేర్కొంది. విద్యార్థులు సులువుగా పరీక్ష కేంద్రాలకు చేరుకొనేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని, వారికి అనుకూలమైన ప్రాంతాల్లో ఎగ్జామ్ సెంటర్లు కేటాయించారని ధర్మాసనం వెల్లడించింది. చీటికీమాటికీ కోర్టులను ఆశ్రయించి, పరీక్షలను వాయిదా వేయాలని కోరడం తగదని పిటిషనర్ల తరఫు న్యాయవాది సంజయ్ హెగ్డేకు సూచించింది.

కశ్మీర్‌లో సాధ్యమైనంత త్వరలో ఎన్నికలు

సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడి



జమ్మూ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం కృతనిశ్చయంతో ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ శుక్రవారం స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను పక్కదోవ పట్టించేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా అడ్డుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన అన్ని రాజకీయ పార్టీలూ అసెంబ్లీ ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలంటూ గట్టిగా కోరుతున్నాయన్నారు.

హరియాణా స్కూళ్లలో ఇకపై 'జై హింద్'



చండీగఢ్: హరియాణాలోని పాఠశాలల్లో ఇకపై 'జై హింద్' నినాదం వినిపించనుంది. విద్యార్థులు 'గుడ్ మార్నింగ్'ను వదిలేసి 'జై హింద్ అని పలకరించుకోవాలంటూ హరి యాణా ప్రభుత్వం జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశిస్తూ గురువారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆగస్ట్ 15వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అందులో పేర్కొంది. స్వాతంత్ర్య పోరాటం సమయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'జై హింద్' నినాదాన్ని తీసుకువచ్చారని, స్వాతంత్ర్యానంతరం ఇదే నినాదాన్ని భద్రతా బలగాలు సెల్యూట్‌గా తీసుకున్నాయని సర్క్యులర్ గుర్తు చేసింది.

వక్ఫ్ బిల్లుపై పార్లమెంటరీ సంఘం

సభ్యుల్లో విజయసాయిరెడ్డి, అసద్, డీకే అరుణ, లావు

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) బిల్లు–2024ను క్షుణ్ణంగా పరిశీలించి, మార్పు చేర్పులపై సిఫార్సులు చేయడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటుకు పార్లమెంటు శుక్రవారం ఆమోదం తెలిపింది. లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది కలిపి 31 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి వి.విజయసాయిరెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), డి.కె.అరుణ (బీజేపీ), అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), లావు శ్రీకృష్ణదేవరాయలు (టీడీపీ) ఉన్నారు. కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల తొలి వారంలో సమర్పించనుంది.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాలు 12వ తేదీ దాకా జరగాల్సి ఉండగా ముందే వాయిదా వేశారు.

బుద్ధదేవ్‌కు అంతిమ వీడ్కోలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు దిగ్గజం బుద్ధదేవ్ భట్టాచార్యకు సీపీఎం నేతలు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం వీడ్కోలు పలికారు. కోల్‌కతాలో సీపీఎం ప్రధాన కార్యాలయంలో బుద్ధదేవ్ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పార్టీలకు అతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. లాల్ సలామ్ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. సాయంత్రం బుద్ధదేవ్ పార్థివ దేహాన్ని ఆయన కోరిక ప్రకారమే ఎన్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బుద్ధదేవ్ భట్టాచార్య గురువారం తన ఇంట్లో కన్నుమూసిన సంగతి తెలిసిందే.

ఎన్నికలవేళ హసీనా తిరిగొస్తారు: సాజీబ్



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఆపద్ధర్మ ప్రభుత్వం నిర్ణయించినప్పుడు బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగొస్తారని ఆమె కుమారుడు సాజీబ్ వాజెద్ జాయ్ వెల్లడించారు. '' బంగ్లా మధ్యంతర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన మరుక్షణమే ఆమె భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్తారు' అని వాజెద్ అన్నారు. ప్రస్తుతం హసీనా న్యూఢిల్లీలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమె బ్రిటన్‌లో ఆశ్రయం పొందాలని యోచిస్తున్నట్లు భారత మీడియా కథనాలు ప్రచురించింది. అయితే బ్రిటన్ హోం శాఖ దీనిపై స్పందించడానికి నిరాకరించింది. బంగ్లాదేశ్ గురించి బ్రిటన్ విదేశాంగ మంత్రితో మాట్లాడానని, ఆయన ఎలాంటి వివరాలను పంచుకోలేదని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గురువారం చెప్పారు. ఈ నేపథ్యంలో వాజెద్ మీడియాతో మాట్లాడారు. అనివార్య పరిస్థితుల్లో తాను రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నట్లు వాజెద్ ప్రకటించారు.

బ్రెజిల్‌లో కూలిన విమానం

62 మంది మృత్యువాత..!

సావో పాలో: బ్రెజిల్‌లోని సావో పాలో రాష్ట్రంలో శుక్రవారం విమానం కుప్పకూలిన ఘటనలో అందులోని మొత్తం 62 మంది ప్రయాణికులు చనిపోయారు. సావో పాలో అంతర్జాతీయ విమానం వైపు వెళ్తున్న ఆ విమానం విన్హెడో నగరంలోని జనసమ్మర్దం ఉన్న ప్రాంతంపై కూలింది. విమానం శిథిలాల నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలను టీవీలు ప్రసారం చేశాయి. ఓ విమానం నిట్టనిలువునా గిరికీలు తిరుగుతూ కూలడాన్ని, ఆ వెంటనే ఆ ప్రాంతంలో మంటలు ఎగసిపడటాన్ని చూపించాయి. ఘటనలో విమానంలో ఉన్న 58 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్లు బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా పేర్కొన్నారు. మృతులకు సంతాపంగా ఒక నిమిషం మౌనం పాటించాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఫైర్ సిబ్బందితోపాటు మిలటరీ పోలీసులు, పౌర రక్షణ అధికారులు విన్హెడోని ఘటనా ప్రాంతంలో రక్షణ, సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.



విమాన శకలాల నుంచి ఎగిసిపడుతున్న మంటలు

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA




శుక్రవారం నాగపంచమి సందర్భంగా బెళగావి, బెంగళూరులో నాగుల కట్టకు మహిళల పూజలు

శనివారం । 10 । ఆగస్టు । 2024

న్యూస్‌రీల్

వసూళ్ల ముఠా అరెస్టు



నిందితురాలు కల్పన

దొడ్డబళ్లాపురం: ఈడీ, ఆర్‌బీఐ అధికారులు తెలుసని, లక్షలు పెట్టుబడి పెడితే కోట్ల లాభం ఇస్తామని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న 7మంది ముఠాని హెబ్బాళ పోలీసులు అరెస్టు చేసారు. చెన్నరాయపట్టణకు చెందిన కల్పన (47)తో పాటు 7మందిని పట్టుకున్నారు. ఈ ముఠాకు కల్పన నాయకురాలని పోలీసులు తెలిపారు. కుడుములి వద్ద వంద కోట్ల ఆస్తి ఉందని, దాన్ని సొంతం చేసుకోవాలంటే అర్జెంట్‌గా రూ.15లక్షలు కావాలని పలువురిని నమ్మించి డబ్బులు వసూలు చేసారు. మోసపోయిన రమేశ్,మాలా అనే ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి ముఠా ఆట కట్టించారు. నిందితుల్లో రిటైర్డు బ్యాంకు మేనేజరు దంపతులు కూడా ఉన్నారు. ఇప్పటివరకు కోట్లాది రూపాయలను వసూలు చేసినట్లు తెలిసింది.

పట్టాలు తప్పిన గూడ్స్



పట్టాలు తప్పిన దృశ్యం

యశవంతపుర: బొగ్గును తరలిస్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ప్రమాదం గోవా-బెళగావి-కారవార సరిహద్దులో జరిగింది. లోంధ వాస్కో రైలు మార్గంలోని దూద్ సాగర్ నుంచి సోనాలిం మధ్య సొరంగ మార్గం- 15 సమీపంలో గూడ్స్ పట్టాలు తప్పింది. వాస్కో నుంచి హొసపేట వద్ద జిందాల్ ఫ్యాక్టరీకి బొగ్గును తీసుకెళ్తుండగా గూడ్స్ పట్టాలు తప్పింది. శుక్రవారం ఉదయం 9:30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఫలితంగా ఈ మార్గంలో తిరిగే యశవంతపుర- వాస్కో (నంబరు 17309), వాస్కో- యశవంతపుర (17310) రెండు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. శుక్రవారం సాయంత్రం బయలుదేరే గోవా ఎక్స్‌ప్రెస్ రైలును దారి మళ్లించినట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. సహాయక చర్యలను చేపట్టారు.

ప్రేమజంట ఆత్మహత్య



సచిన్, ప్రియా (ఫైల్)

యశవంతపుర: పెద్దల పంతాలకు యువతీ యువకుడు బలయ్యారు. ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన బాగలకోట జిల్లా రవకవి బనహట్టి తాలూకా నందగాంవ్ గ్రామంలో జరిగింది. సచిన్ దళవాయి (22), ప్రియా మడివాళర (19) ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని తీర్మానం చేసుకున్నారు. అయితే వారి పెళ్లికి సచిన్ కుటుంబసభ్యులు ఒప్పుకోక పోవటంతో కలిసి జీవించలేమని తీవ్ర వ్యథకు గురయ్యారు. ఇద్దరూ కలిసి చనిపోవడమే మేలనుకున్నారు. గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. మహాలింగపుర పోలీసులు ఘటన స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిల్లే కదా అనుకుంటే..

- రేబిస్‌తో మహిళ మృతి





గంగీబాయి (ఫైల్)

శివమొగ్గ: ఇంట్లో పెంచుకుంటున్న పిల్లి కరవడంతో రేబిస్ వ్యాధి బారిన పడి మహిళ మరణించిన ఘటన జిల్లాలోని శికారిపుర తాలూకా తరలఘట్ట గ్రామంలో జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన గృహిణి గంగీబాయి (44) అనే మహిళ రెండు నెలల క్రితం ఇంట్లో చూసుకోకుండా పిల్లి తోకపై కాలు వేసింది. అప్పుడు పిల్లి ఆమె కాలుపై కరిస్తే, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందింది. రేబిస్ సోకకుండా ముందు జాగ్రత్తగా ఐదు ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉండగా ఒక ఇంజెక్షన్‌ను మాత్రమే తీసుకుని ఏమీ కాదులే అని ఊరుకుంది. పది రోజుల క్రితం ఆమె ఉన్నఫళంగా అనారోగ్యం బారిన పడటంతో శికారిపుర తాలూకా ఆస్పత్రిలో, ఆపై శివమొగ్గలోని ప్రభుత్వ మెగ్గాన్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృత్యువాత పడినట్లు జిల్లా సీజనల్ వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ మల్లప్ప తెలిపారు. పెంపుడు జంతువులు కరిచిన వెంటనే గాయాన్ని యాంటిబయాటిక్ ద్రవం, లేదా సబ్బుతోనైనా శుభ్రంగా కడగాలన్నారు. తరువాత సమీప ఆస్పత్రికి వెళ్లి నెల రోజుల్లో నాలుగు రేబిస్ ఇంజెక్షన్లను వేయించుకోవాలని, అప్పుడే రేబిస్ నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. పిల్లి, కుక్క వంటి జంతువుల కాట్లపై నిర్లక్ష్యం వద్దని ప్రజలకు సూచించారు.

గమ్యం చేరే దారేదీ?



- బెంగళూరు ట్రాఫిక్ మరింత సంక్లిష్టం
- భవిష్యత్తులో వాహన రద్దీకి మరింత ఆజ్యం
- ఒక్కో సిగ్నల్ వద్ద 10 నిమిషాలు వృథా
- నగర భూ రవాణా డైరెక్టరేట్ సర్వేలో నిజాలు



మారతహళ్లిలో ఎప్పుడూ ఇదే దృశ్యం

సాక్షి, బెంగళూరు: సిలికాన్ సిటీ బెంగళూరు అంటే గుర్తొచ్చే ప్రధాన సమస్యల్లో ట్రాఫిక్ ఒకటి. ఉద్యాన నగరి ట్రాఫిక్ నగరంగా కూడా అపఖ్యాతిని మూటగట్టుకుంది. విపరీతమైన ట్రాఫిక్ సంకటం నగరవాసులను పట్టి పీడిస్తోంది. ఈ బెడద రానున్న రోజుల్లో మరింతగా పెరగనున్నట్లు తెలుస్తోంది. ఏ స్థాయిలో ట్రాఫిక్ ఇక్కట్లు పెరగనున్నాయి అంటే ప్రతి ప్రతి సిగ్నల్ కూడలిలో 10 నుంచి 12 నిమిషాలు వేచి చూసే పరిస్థితులు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల బెంగళూరు సంచార నిర్వహణ (ట్రాఫిక్ మేనేజ్‌మెంట్) భవిష్యత్తులో మరింత కఠినం కానుందని బీబీఎంపీ రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసు, నగర భూ రవాణా డైరెక్టరేట్ కార్యాలయం నిర్వహించిన సమీక్షలో తేలింది.

2025లో డేంజర్ బెల్స్

2025 నుంచి బెంగళూరులో ట్రాఫిక్ సమస్య మరింత పెరగనుంది. బెంగళూరులో 162 జంక్షన్లలో కనిష్ఠంగా 10-11 నిమిషాలు వేచి ఉండే దుస్థితి ఏర్పడనుంది. కేఆర్ సర్కిల్, సిల్క్‌బోర్డు, ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డు, చాళుక్య సర్కిల్, ఎలెక్ట్రానిక్ సిటీ, టౌన్‌హాల్ తదితర 162 కూడళ్లలో ఈ పరిస్థితి ఏర్పడనుంది. ఒక్కో కూడలిని దాటేందుకు కనిష్ఠంగా 10 నిమిషాలు సమయం పట్టవచ్చు. ఇప్పటికే సిల్క్‌బోర్డు సిగ్నల్‌లో వాహనాలు కనీసంగా ఐదారు నిమిషాలు వేచి ఉండాల్సి వస్తోంది.



పరిష్కారాలకై అన్వేషణ

రోడ్డు విస్తరణ ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు చెక్ పెట్టాలంటే అందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఉంది. బీబీఎంపీ ద్వారా రోడ్డు విస్తరణ గురించి ప్రస్తుతం సర్వే నిర్వహిస్తోంది. అయితే ఈ సర్వే పూర్తి కావాలంటే చాలా సమయం పడుతుంది. న్యాయపరంగానూ ఆలస్యమవుతుంది. రోడ్ల విస్తరణ కంటే సొరంగ మార్గాలు, పై వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం మంచి పరిష్కారం అవుతాయి. అలాగే పార్కింగ్ సమస్య కూడా బెంగళూరును వేధిస్తోంది. పబ్లిక్ పార్కింగ్‌కు చోటు దొరకడం లేదు.

రోడ్లపై రెట్టింపు వాహనాలు

- ప్రస్తుతం బెంగళూరు రోడ్లు కేవలం 50 లక్షల వాహనాలు నడిచేందుకు అనువుగా ఉన్నాయి. అయితే వాహనాల సంఖ్య అంతకు రెండు రెట్లు ఎక్కువగా ఉంది.
- బెంగళూరు రోడ్లపైకి ప్రతి రోజూ రెండు వేల కొత్త వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. నేడు రాజధానిలో సుమారు 1.18 కోట్ల వాహనాలు ఉన్నాయి.
- రానున్న నాలుగు నెలల్లో కొత్తగా మరో 2 లక్షల వాహనాలు చేరవచ్చు. 2024 చివరి నాటికి 1.21 కోట్ల వాహనాలు బెంగళూరులో ఉండే అవకాశం ఉంది.
- నిత్యం పొరుగు రాష్ట్రాల నుంచి, ఇతర జిల్లాల నుంచి బెంగళూరుకు వచ్చే వాహనాల సంఖ్య సుమారు లక్ష దాకా ఉంటోంది.

మంత్రి జార్కిహొళికి సమన్లు

దొడ్డబళ్లాపురం: హిందూ మతం పట్ల అవమానకరంగా వ్యాఖ్యలు చేశారనే కేసులో మంత్రి సతీష్ జార్కిహొళికి కోర్టు సమన్లు జారీ చేసింది. 2022 సెప్టెంబర్‌లో బెళగావి జిల్లా నిప్పాణిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ మతం గురించి అవమానకరంగా మాట్లాడారు. హిందూ అనే పదమే అశ్లీలమని, భారత్‌కు హిందూ పదానికి సంబంధం లేదని అన్నారు. దీంతో దిలీప్ కుమార్ అనే వకీలు స్థానిక కోర్టులో ప్రైవేటు కేసు వేశారు. ఒక ప్రజాప్రతినిధి ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడి మతాల మధ్య చిచ్చు రేపేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

బావిలో దూకి తల్లీ పిల్లల ఆత్మహత్య

- శివమొగ్గ జిల్లాలో ఘోరం



ఘటన జరిగిన బావి

శివమొగ్గ: ఎంత కష్టం వచ్చిందో గానీ ఓ తల్లి ఘోర నిర్ణయం తీసుకుంది. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు పిల్లలు, తల్లి ఉదయానికల్లా ఓ ఇంటి సమీపంలోని బావిలో శవమై తేలిన ఘటన జిల్లాలోని హొసనగర తాలూకా చంపాపుర గ్రామంలో వెలుగు చూసింది. వివరాలు.. రాజేష్ అనే వ్యక్తి భార్య వాణి (32), వారి ఇద్దరు పిల్లలు సమర్థ్(12), సంపద (6). వాణి పిల్లలను తీసుకుని గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త ఎన్నిచోట్ల వెదికినా ఆచూకీ లేదు. శుక్రవారం ఉదయం పొరుగున ఉన్న ఇంటి పక్కన బావిలో తల్లీపిల్లల మృతదేహాలు తేలుతుండటంతో కలకలం రేగింది. భర్త, స్థానికుల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మొదట పిల్లలను పడేసి, ఆపై వాణి దూకి ఉంటుందని అనుమానిస్తున్నారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యలకు కారణం కావచ్చని సమాచారం. ఇన్‌స్పెక్టర్ రమేష్, పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

స్కాములతో సంబంధం లేదు



సమావేశాన్ని ప్రారంభిస్తున్న సీఎం తదితరులు



సభకు హాజరైన జన సందోహం

- సీఎం సిద్దరామయ్య
- మైసూరులో జనాందోళన సభ
- గవర్నరుపై ఆగ్రహం

మైసూరు: ముడా, వాల్మీకి మండలిలో జరిగిన కుంభకోణాలతో నాకు సంబంధం లేదు. నన్ను ఈ కేసులో ఇరికించేందుకు కుట్ర జరుగుతోంది. నా రాజీనామాను డిమాండ్ చేస్తూ జేడీఎస్ బీజేపీ పాదయాత్ర చేస్తున్నాయి. దీనికి నేను భయపడేది, తలొంచేది లేదు అని సీఎం సిద్దరామయ్య అన్నారు. శుక్రవారం మైసూరులోని మహారాజా కళాశాల మైదానంలో జరిగిన కాంగ్రెస్ జనాందోళన మహాసభను బాకా ఊది ప్రారంభించిన ఆయన.. వాల్మీకి అభివృద్ధి మెంట్ కార్పొరేషన్‌లో రూ.84 కోట్ల అవినీతి జరిగిన మాట వాస్తవమేనన్నారు. సిట్ విచారణ జరిపి మొత్తం రూ.46 కోట్లు రికవరీ చేశారన్నారు. ఈ కేసులో ఆర్థిక శాఖ పాత్ర లేదు. నా ప్రమేయం లేదు. అయినప్పటికీ ఈడీ సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోందని అన్నారు. ఇప్పుడు ముడా స్థలాల పేరుతో నాపై, నా భార్యపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థలాల్లో ఎలాంటి గోల్‌మాల్ జరగలేదని ఆయన ఏకరువు పెట్టారు. అయినప్పటికీ గవర్నర్ గెహ్లాట్ హడావుడిగా నాకు నోటీసులు జారీ చేశారు, నాపై ఫిర్యాదు చేసిన అబ్రహాంకు బ్లాక్‌మెయిల్ కేసులో కోర్టు రూ. 25 లక్షల జరిమానా విధించిందన్నారు. బీజేపీకి చెందిన శశికళ జొల్లె, మురుగేష్ నిరాణిపై ఫిర్యాదు చేసి రెండేళ్లు దాటింది. అయినా వారికి గవర్నర్ నోటీసు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా యడియూరప్ప, విజయేంద్ర తదితరులపై ఆరోపణలతో దాడి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పెద్దసంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వేలాది మంది సభకు వచ్చారు.

సిద్దుకు నేను కాపలా ఉంటా

- సభలో డీసీఎం డీకేశి

మైసూరు: నన్ను మొండోడు అంటారు. ఈ మొండోడు సిద్దరామయ్య వెన్నంటి ఉన్నాడు. మా వెంట 136 మంది ఎమ్మెల్యేలున్నారు. సిద్దరామయ్యను బీజేపీ, జేడీఎస్ వారు గద్దె దింపలేరని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. మైసూరులో జరిగిన కాంగ్రెస్ జనాందోళన సభలో డీకే ప్రసంగించారు. ఎవరు రాజీనామా ఇస్తారో కాలమే నిర్ణయిస్తుందన్నారు. సీఎం సిద్దరామయ్య రాజీనామా కావాలా? అంటూ విపక్ష నేతలను ఏకవచనంతో ప్రశ్నించారు. ఈ మొండోడు సీఎంకు ఎల్లప్పుడూ కాపలా ఉంటాడు. ఈ జన్మలో మీరు ఏమీ చేయలేరు. వచ్చే పదేళ్లలో కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది అని అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర జరుగుతోందన్నారు. ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య అధికార దుర్వినియోగానికి పాల్పడలేదన్నారు. గతంలో మీ తండ్రి యడియూరప్ప రెండు సార్లు జైలుకు ఎందుకు వెళ్లారు, విదేశాల్లోని లక్ష్మీ విలాస్ బ్యాంకుకు ఎందుకు నగదు బదిలీ అయిందో చెప్పాలని బీజేపీ నేత విజయేంద్రకు ప్రశ్నించారు. సుద్దపూస అని చెప్పుకుంటున్న హెచ్‌డీ కుమారస్వామి గతంలో డీనోటిఫై చేసిన 50 కేసులను బయటకు తీస్తామని చెప్పారు.

సర్కారును పెకలించడమే లక్ష్యం: యడ్డి

మైసూరు: ఎవరు రాజకీయ సన్యాసం తీసుకోవాలో త్వరలోనే తేలుతుందని బీజేపీ మాజీ సీఎం యడియూరప్ప అన్నారు. ఆయన శుక్రవారం మైసూరులోని చాముండిబెట్ట వద్ద విలేకరులతో మాట్లాడుతూ తనపై సీఎం సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలకు దీటుగా స్పందించారు. ఎవరు ఏమవుతారో త్వరలో తేలుతుందన్నారు. సీఎంగా సిద్దరామయ్య భార్య పేరిట విలువైన స్థలాలను కేటాయించారన్నారు. ఇంతకు ముందు ఎప్పుడైనా ఇలాంటిది జరిగిందా? అని అన్నారు. అది క్షమించరాని నేరం, అందుకే పోరాటం చేస్తున్నాం, ఈ అవినీతి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సారథ్యంలో పాదయాత్ర చేస్తున్నారన్నారు. శనివారం మైసూరులో జరిగే తమ చారిత్రక సమావేశంలో సుమారు 3 లక్షల మందికి పైగా పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడాలని చాముండేశ్వరి దేవిని ప్రార్థించినట్లు చెప్పారు. తర్వాత ఆయన మైలారి హోటల్‌కు వెళ్లి దోసె ను ఆరగించారు.

చకచకా కూటమి పాదయాత్ర



మైసూరు వైపు సాగుతున్న పాదయాత్ర

మండ్య: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ, జేడీఎస్ కూటమి చేస్తున్న చలో మైసూరు పాదయాత్ర శుక్రవారం 7వ రోజు మండ్య జిల్లాలోని శ్రీరంగపట్టణం నుంచి మైసూరు వైపు కదిలింది. వేలాది మంది కార్యకర్తలు, ఎక్కువగా జేడీఎస్‌వారు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, సీనియర్లు జగదీశ్ శెట్టర్, అశ్వథ్‌నారాయణ, ఎంపీ యదువీర్ ఒడెయార్, బి.శ్రీరాములు, ఆర్. అశోక్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నడిచారు. గురువారం మండ్య తూబినకెరె నుంచి మొదలైన యాత్ర రాత్రి 10 గంటలకు శ్రీరంగ పట్టణం చేరుకుంది. శుక్రవారం ఉదయం మళ్లీ నడక సాగించారు. జేడీఎస్ యువ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి కొబ్బరికాయ కొట్టి భూమాతకు నమస్కారం చేసి పాదయాత్రలో సాగారు. శ్రీరంగపట్టణం పశ్చిమ వాహిని వద్ద నేతలకు కొబ్బరి, బెల్లం, మోసంబిల భారీ హారం వేశారు. పాదయాత్ర నేడు మైసూరుకు చేరుకోవడంతో ముగుస్తుంది. బృహత్ బహిరంగ సభకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

ఉన్మాది ఘాతుకం

- మహిళపై పిచ్చివాని దాడి
- బెంగళూరులో దురాగతం



రక్తపు మడుగులో మహిళ



దుండగున్ని పట్టుకున్న స్థానికులు

యశవంతపుర: బెంగళూరులో మహిళలపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇంటా బయటా భద్రత లేకుండా పోతోందనే విమర్శలున్నాయి. హాస్టల్‌లోకి ప్రియుడు చొరబడి యువతిని పొడిచి చంపడం తెలిసిందే. ఇంతలోనే రోడ్డుపై వెళుతున్న మహిళపై పిచ్చివాడు దాడి చేసిన ఘటన బెంగళూరులో జరిగింది.

ఏం జరిగిందంటే..

వివరాలు.. ఏపీలోని వైఎస్సార్ జిల్లా కడప నగరానికి చెందిన సునీత (40) ఇద్దరు పిల్లలతో కలిసి కోడిగేహళ్లి పోలీసు స్టేషన్ పరిధిలోని సహకార నగరలో నివాసం ఉంటోంది. భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సునీత గురువారం సాయంత్రం రోడ్డుపై పిల్లలను సమీప స్టేడియంలో వదిలి, వాకింగ్ చేస్తుండగా మతిస్థిమితం లేని ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె తలపై బండరాయితో పదేపదే బాదాడు. తల నుంచి తీవ్ర రక్తస్రావమై ఆమె కుప్పకూలింది. ఇంతలో స్థానికులు దుండగున్ని పట్టుకొని చితకబాదారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దుండగున్ని అదుపులోకి తీసుకెళ్లారు. సంఘటన దృశ్యాలు వైరల్ అయ్యాయి. నిందితున్ని గోపాల్‌గా గుర్తించాం, అతడు విచారణకు సహకరించడం లేదు అని పోలీస్ కమిషనర్ దయానంద తెలిపారు.

క్లుప్తంగా

ఐదేళ్లూ సిద్దూనే సీఎం

• మంత్రి మునియప్ప

మైసూరు: సిద్ధరామయ్యను గద్దె దించడం సాధ్యం కాదని, ఐదేళ్లూ ఆయనే సీఎంగా ఉంటారని మంత్రి కేహెచ్ మునియప్ప అన్నారు. ఆయన శుక్రవారం మైసూరులో కాంగ్రెస్ జనాందోళన సభలో మాట్లాడారు. సీఎంకు తామంతా అండగా ఉన్నామని, ఆయనను అధికారం నుంచి తొలగించేందుకు ఒప్పుకోబోమని అన్నారు. మైనార్టీలు, వెనుక బడిన వర్గాలు, దళితులు, రైతులు అందరూ సిద్ద రామయ్య వైపే ఉన్నారన్నారు. సిద్ద రామయ్యను రాజీనామా చేయనీయబోమన్నారు. మంత్రి ఈశ్వర్‌ఖండ్రె మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ బీజేపీ ఏజెంట్‌లా పని చేస్తున్నారన్నారు. ఆయనను వెంటనే కేంద్రం రీకాల్ చేయాలన్నారు. వసతి శాఖా మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ప్రజా పరిపాలన అందిస్తున్న సిద్దరామయ్య పాలనను సహించలేక విపక్షాలు పాదయాత్ర నాటకం ఆడుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను ఓటీఎస్ గడువు పెంపు

యశవంతపుర: బీబీఎంపీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పన్నులను చెల్లించటానికీ బీబీఎంపీ వన్‌టైమ్ సెంటిల్‌మెంట్ సౌకర్యాన్ని విస్తరించింది. ఓటీఎస్ ద్వారా పన్నులు చెల్లించడానికి సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. పన్నుదారుల నుంచి వినతులు రావడంతో విస్తరించినట్లు తెలిపింది. మహదేవపుర విభాగంలో 60 వేల ఆస్తులపై రూ. 124 కోట్ల పన్ను బకాయిలు, బొమ్మనహళ్లిలో 45,381 ఆస్తులపై రూ. 71 కోట్ల బకాయిలు ఉన్నట్లు పేర్కొంది.

సర్కార్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే పాదయాత్ర

మండ్య : కాంగ్రెస్ సర్కార్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేపట్టామని శాసనసభ విపక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అక్రమాలకు సంబంధించి సమాధానం ఇవ్వని అధికార పార్టీ నేతలు తమ పాదయాత్రపై సెటైర్లు వేయడం దారుణమన్నారు. బీజేపీ, జేడీఎస్ చేస్తున్నది ప్రజల తరపున పోరాటమని, కాంగ్రెస్ చేపట్టిన జనాందోళన కార్యక్రమాలు ఆ పార్టీ నేతలను కాపాడుకునేవని అన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుల

కృష్ణరాజపుర: మహదేవపుర నియోజకవర్గ పరిధిలోని కణ్ణూరులో బెళ్లహళ్లి క్రాస్ నుంచి కణ్ణూరు గుండా మైలహళ్లికి చేరుకునే రాష్ట్ర రహదారి–104 అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మంజుల భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పనులను నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

రంగేగౌడ కన్నుమూత

మైసూరు: ప్రముఖ వన్యజీవి ఛాయాగ్రాహకుడు, సీనియర్ పాత్రికేయుడు లోకేష్ మొసళె తండ్రి రంగేగౌడ (87) శుక్రవారం ఉదయం మైసూరులోని ఆర్టీనగర జర్నలిస్ట్ కాలనీలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వయోసహజ ఆరోగ్య సమస్యలతో గత కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. రంగేగౌడ స్వస్థలం హాసన్ జిల్లా ఎం.కె.మొసళె గ్రామం. ఉపాధ్యాయునిగా సేవలందించి రిటైరైన తరువాత మైసూరులో స్థిరపడ్డారు. జయనగర కావేరి పాఠశాల సమీపంలోని శ్మశానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

త్రిచక్ర వాహనం పంపిణీ

కెలమంగలం: గత జనవరి నెలలో రోడ్డు ప్రమాదానికి గురై కాళ్లకు బలమైన దెబ్బ తగిలి నడవలేని స్థితిలో ఉన్న హోసూరు విలేకరికి షిరిడిసాయి ట్రస్ట్ ప్రతినిధులు త్రిచక్రవాహనాన్ని అందజేశారు. హోసూరు గోకుల్‌నగర్‌కు చెందిన ఆనంద్, ఓ ఆంగ్ల పత్రికలో విలేకరిగా పనిచేస్తూ వచ్చాడు. గత జనవరి నెలలో పట్టణంలోని రింగ్‌రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుని గత కొద్ది రోజుల క్రితం ఇంటికొచ్చాడు. అయితే నడవలేక మంచానికే పరిమితమయ్యాడు. అతని పరిస్థితిని తెలుసుకుని హోసూరులోని షిరిడీసాయి ట్రస్ట్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ త్రిచక్ర వాహనాన్ని ఉచితంగా అందజేశారు.

జంగిల్‌బుక్ షో


ప్రదర్శనలో క్రికెటర్ శ్రేయాంక పాటిల్...

బొమ్మనహళ్లి: జంగిల్‌బుక్ కథతో మోగ్లీ, ఇతర అడవి జంతువులు నగరంలోని గరుడామాల్‌లో కనువిందు చేస్తున్నాయి. మహిళా క్రికెటర్ శ్రేయాంక పాటిల్ ఈ ప్రదర్శనని ప్రారంభించారు. చిన్నప్పుడు టీవీల్లో తాను చూసిన ది జంగల్ బుక్‌ను గుర్తుకు చేసుకున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ప్రదర్శన జరుగుతుందని తెలిపారు.

దళితులను విస్మరించిన సర్కార్


ఎమ్మెల్యే రూపా శశిధర్ ఇంటి ముందు ప్రతిఘటన నిర్వహిస్తున్న దృశ్యం


కోలారులో ప్రతిఘటన నిర్వహిస్తున్న దృశ్యం

• ఎమ్మెల్యే ఇంటి ఎదుట దళిత సంఘాల నిరసన

కేజీఎఫ్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ నిధులను దారి మళ్లించిందని ఆరోపిస్తూ దళిత సంఘటనల నాయకులు శుక్రవారం కేజీఎఫ్‌లోని ఎమ్మెల్యే రూపా శశిధర్ ఇంటి ఎదుట ప్రతిఘటన నిర్వహించారు. సాహితీవేత్త, సామాజిక చింతకుడు కోటిగానహళ్లి రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. దళితులకు రిజర్వు చేసిన నిధులు పక్కదోవ పడుతుండగా ప్రశ్నించాల్సిన దళిత ప్రజా ప్రతినిధులు నోరు మెదపడం లేదన్నారు. దళితుల విద్యాభివృద్ధికి రిజర్వు చేసిన 2.46 లక్షల కోట్ల రూపాయల నిధులు, బీజేపీ ప్రభుత్వ అవధిలో 39 వేల కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించారు. ఆ నిధులను తిరిగి దళితుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఇంటిలో లేకపోవడంతో ఇంటి డోర్‌కు వినతిపత్రం అంటించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ నాగవేణికి వినతిపత్రం అందజేశారు. ప్రతిఘటనలో మావళ్లి శంకర్, నంగసంద్ర విజికుమార్, శ్రీనాథ్, హారోహళ్లి రవి, వెంకటేష్, పిచ్చహళ్లి మంజునాథ్, కృష్ణమూర్తి, దేవరాజ్ పాల్గొన్నారు.

కోలారు : ఎస్సీ, ఎస్టీ నిధుల మళ్లింపును నిరసిస్తూ డీ హెచ్‌ఎస్ కార్యకర్తలు శుక్రవారం జిల్లా కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రతిఘటన నిర్వహించారు. దళిత హక్కుల సమితి జిల్లా నాయకుడు కేవీ మంజునాథ్ మాట్లాడారు. దళితులకు అన్యాయం జరుగుతున్నా దళిత ప్రజా ప్రతినిధులు ప్రశ్నించడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. హనుమంతరాయ్, గాంధీ నగర నారాయణస్వామి, పీ శ్రీనివాస్, అశోక్, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


నాగ పంచమి కావడంతో శుక్రవారం పూజల కోసం నందిహిల్స్‌కు వెళ్తున్న భక్తులు

ముంబై పోలీసులమని.. రూ 15 లక్షల వసూలు

హోసూరు: జిల్లాలో మరో సైబర్ నేరం చోటుచేసుకుంది. ముంబై పోలీసు అధికారులమంటూ ఫోన్ చేసి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి వద్ద రూ. 15.25 లక్షలు దోచుకున్నారు సైబర్ నేరగాళ్లు. వివరాల మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరికి చెందిన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగికి గత జూలై చివర్లో ఫోన్ చేసిన వ్యక్తులు ముంబై పోలీసులమని, మీ మొబైల్ నంబర్‌తో డ్రగ్స్ పార్సిల్ వచ్చినట్లు, మీపై కేసు నమోదు చేయడంతో కఠిన శిక్ష తప్పదని బెదిరించారు. కేసు నుంచి బయట పడాలంటే రూ. 20 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని భయపెట్టారు. అవాక్కైన ఉద్యోగి తన వద్ద ఉన్న రూ. 15.20 లక్షల నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశాడు. తరువాత వారిని సంప్రదించగా వారి నంబర్ స్విచాఫ్ అని రావడంతో మోసగాళ్ల పని అని తెలుసుకుని క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎమ్మెల్యేకు అభినందన

కృష్ణరాజపురం: హొసకోటె తాలూకా కొళతూరు వద్ద రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎంవీజీ సంస్థ ముఖ్యస్తురాలు ధరణి ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు.

దాతల సహకారంతో ఉత్తమ బోధన


ప్రొజెక్టర్ అందజేస్తున్న దాత ఎస్.ఆర్.ధర్మేష్

కోలారు : ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయల కల్పనకు దాతలు ముందుకు వస్తే విద్యార్థులకు ఉత్తమ బోధన అందుతుందని ఎస్.ఆర్. ధర్మేష్ అన్నారు. తాలూకాలోని రామసాగర గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం ఆయన ఉచితంగా ప్రొజెక్టర్ అందజేసి మాట్లాడారు. సమాజానికి సేవలు అందించిన వారు మాత్రమే చరిత్ర పుటల్లో మిగిలి ఉంటారన్నారు. దివంగత పునీత్ రాజ్‌కుమార్ దాతృత్వంలో ఆదర్శంగా నిలిచారన్నారు. బీఈఓ ముని వెంకటాచారి మాట్లాడుతూ దాతలు కల్పించిన సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు జి శ్రీనివాస్, నివృత్త ప్రధానోపాధ్యాయుడు మునేగౌడ పాల్గొన్నారు.

విద్యార్థులకు కార్డుల పంపిణీ

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన తమిళ్ పుదల్వన్ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని పై చదువులు చదువుతున్న 6270 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి నెలా రూ. 1000 ఆర్థిక సాయం అందించేందుకు గుర్తింపు కార్డులను శుక్రవారం బర్గూరు పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శరయు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని కళాశాల చదువులకెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు కూడా ప్రతి నెలా రూ. 1000 ఆర్థిక సాయం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మదియళగన్, వై. ప్రకాష్ పాల్గొన్నారు. జిల్లాలోని 54 కళాశాలల్లో చదువుతున్న 6270 మంది విద్యార్థినీవిద్యార్థు ఆర్థిక సాయం గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మణిమేఘలై, మలర్విళి, బాబు, జయంతి తదితరులు పాల్గొన్నారు.

డీకేపై కుమార ధ్వజం

శివాజీనగర: చేస్తే మగాడి రాజకీయం చేయాలని డీ.కే.శివకుమార్‌పై కేంద్రమంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన... మనిషిగా ప్రవర్తిస్తున్నావా?, రాజకీయం చేస్తే మగాడి రాజకీయం చేయాలి. మా కుటుంబానికి వ్యతిరేకంగా మాట్లాడుతావా. 10 నెలల్లో ప్రభుత్వం కూల్చేందుకు కుట్ర అంటున్నారు, ఆ మాట అజ్జయ్య చెప్పారా? అనవసరంగా తనను రెచ్చగొట్టవద్దని ధ్వజమెత్తారు. సీఎంను దించేయాలని కుట్ర చేస్తున్నవారు ఎవరు? హెచ్.డీ.రేవణ్ణ, పిల్లలపై కుట్ర చేసింది ఎవరు? వారిని జైలుకు పంపినవారు ఎవరు? తమ కుటుంబానికి వ్యతిరేకంగా మాట్లాడితే వారిని ఊరికే విడిచిపెట్టమని విరుచుకుపడ్డారు.

దేవెగౌడ కుటుంబంపై ఫ్లెక్సీలు

• ఇళ్ల స్థలాలు కొట్టేశారని కాంగ్రెస్ ఆరోపణలు

మైసూరు: మైసూరులోని వివిధ సర్కిళ్లలో రాత్రికి రాత్రే మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ కుటుంబం భూకబ్జా పేరుతో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెట్టారు. మైసూరులోని మహారాజ కాలేజీ మైదానం, రామస్వామి సర్కిల్‌తో పాటు కాంగ్రెస్ జనాందోలన సమావేశం జరిగిన పలు ప్రాంతాల్లో 25 ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, మాజీ సిఎం హెచ్‌డి కుమారస్వామి, మాజీ మంత్రి హెచ్‌డి రేవణ్ణ వారి హయాంలో సాగించిన భూకబ్జాలు ఇవీ అని అందులో ఆరోపించారు. సిద్దరామయ్య సర్కారు ముడా లబ్ధిదారుల జాబితాను విడుదల చేసింది. దేవెగౌడ కుటుంబం, జీటీ దేవెగౌడ, సా.రా. మహేశ్ సహా పలువురు నేతల పేర్లు వినిపించాయి. జేడీఎస్ పార్టీ సామాన్య ప్రజల్లో అనవసరంగా గందరగోళం సృష్టిస్తోందని, స్వయంగా భూకబ్జాలకు పాల్పడిన వారి మాటలు చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఫ్లెక్సీల్లో ముద్రించారు. దీంతో పాటు అదనంగా తొమ్మిది డీ నోటిఫికేషన్ కేసుల వివరాలు ఉన్నాయి. తనకు పారిశ్రామిక భూమి ఇచ్చారు. తాను ఇప్పటికే సంబంధిత రుసుము చెల్లించాను. అందుకోసం స్థల స్వాధీనపత్రం ఇప్పించాలని ముడా అధికారులకు కుమారస్వామి రాసిన లేఖను కూడా ఫ్లెక్స్‌లో పొందుపరిచారు.

జేడీఎస్ నేతల ధర్నా

ఫ్లెక్సీలకు నిరసనగా జేడీఎస్ నేత ఎస్.ఆర్. మహేశ్, కార్యకర్తలు, నాయకులతో కలిసి మెట్రోపోల్ సర్కిల్‌లో బైఠాయించారు. ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలి. వీటిని ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. చివరకు పోలీసులు మహేశ్, ఇతర ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని తరలించారు. ఫ్లెక్సీలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

నాగపూజతో ఇష్టార్థసిద్ధి


నాగుల కట్టకు పూజలు చేసిన దృశ్యం

విజయపుర: అన్నాచెల్లెళ్ల బంధాన్ని పెంపొందించేలా, పుట్టినిల్లు బాగుండాలని ఆకాంక్షిస్తూ మహిళలు నాగపంచమి వేడుకలను ప్రతిచోటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గాంధీచౌక్‌లోని నవగ్రహాలయం సమీపంలోని అశ్వత్థ కట్టెలో నాగులకట్టకు పూజలు చేశారు. ఆలయ పూజారి రమేష్ స్వామి మాట్లాడుతూ అన్నదమ్ముల బంధం బలపడాలని, పుట్టినింటితో బంధం బాగుండాలని ఆడపిల్లలు పూజించే పండుగ నాగ పంచమి అని అన్నారు. నాగశిలలను పూజించడం వల్ల ఇష్టార్థసిద్ధి కూడా కలుగుతుందని తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం

పట్టణంలోని 11వ వార్డు నవగ్రహ గుడి వీధిలో నూతనంగా అమర్చిన తాగునీటి కొళాయి పైప్‌లైన్‌ను పురసభ సభ్యుడు ఎం.కేశవప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ వార్డులో 30 ఏళ్లుగా ఉన్న నీటి సమస్య పరిష్కారానికి కొత్త పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. జేడీఎస్ నాయకులు ఎస్‌వీ బసవరాజు, విశ్వనాథ, ఎంకే అనంతకుమార్, మురళి, సమాజ సేవకులు సురేష్, బసవరాజు పాల్గొన్నారు.

మహాత్మునికి నివాళి


మహాత్మాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధికారులు

శివాజీనగర: క్విట్ ఇండియా దినాన్ని పురస్కరించుకుని బీబీఎంపీ పాలనాధికారి ఎస్.ఆర్.ఉమాశంకర్, చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ శుక్రవారం నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పుష్పమాల సమర్పించి నివాళులర్పించారు. సర్వమత ప్రార్థన కార్యక్రమంలో భాగంగా ప్రతిభా బాలమందిర పిల్లలచే గీతా వచనం, దీపికా శ్రీకాంత్‌చే వైష్ణవ జనతో, హడ్సన్ చర్చి పాదర్ రెవరెండ్ ఆల్ఫ్రెడ్ సుదర్శన్ బృందంచే బైబిల్ బోధనలు, గురుద్వార శ్రీ గురుసింగ్ బృందంచే గురుగ్రంథం, మౌల్వి హఫీజ్ షాబీర్ హుసేన్ ఆధ్వర్యంలో ఖురాన్ చదివి వినిపించారు. కార్యక్రమంలో బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ హరీశ్‌కుమార్, జోనల్ కమిషనర్ స్నేహాల్, చీఫ్ ఇంజినీర్ ప్రహ్లాద్, జోనల్ జాయింట్ కమిషనర్లు సరోజా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

చోరీలు చేసి చెన్నైలో మకాం

• జంటను అరెస్ట్ చేసిన పోలీసులు
• నగలు స్వాధీనం

యశవంతపుర: జోడి యాప్‌లో పరిచయమై ఒక్కటైన ఓంట చోరీలకు పాల్పడి కటకటాల పాలైంది. తమిళనాడుకు చెందిన నారాయణస్వామి(34) భార్యకు పెరాలసిస్ సోకింది. ఈక్రమంలో అతనికి జోడీ యాప్‌లో నవిత(39) అనే మహిళ పరిచయమైంది. ఆమె భర్త కూడా పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. వీరిద్దరి పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరికీ పిల్లలుండగా వారిని వదిలేసి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించారు. అయితే ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో పెళ్లి వాయిదా వేసి చోరీలు చేయాలని నిర్ణయించారు. నారాయణస్వామి తల్లి బెళ్లియమ్మ లక్కసంద్రలోని ఓ ఇంటిలో పనిచేస్తుండగా నారాయణస్వామి అక్కడకు వెళ్లి వచ్చేవాడు. ఆ ఇంటి యజమాని రిహాన్ లేని సమయంలో నారాయణస్వామి 330 గ్రాముల బంగారంను చోరీ చేశాడు. ఆ సొత్తును తాకట్టు పెట్టి వచ్చిన నగదుతో నారాయణ స్వామి, నవితలు చెన్నైకి వెళ్లారు. అక్కడ అద్దె ఇంటిలో ఉంటున్నారు. లక్కసంద్రలోని యజమానికి నారాయణస్వామిపై అనుమానం రావడంతో అడుగోడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జంట చైన్నెలో ఉన్నట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. నగలు విక్రయించిన ప్రాంతాలకు తీసుకెళ్లి సొత్తు స్వాధీనం చేసుకొని నారాయణస్వామి, నవితను అరెస్ట్ చేశారు.

తేలుతో ఆటాడుకుంటాం


చేతిపై తేలుతో బాలిక


మెడపై వేసుకున్న బాలుడు


ఓ మహిళ ధైర్యం

• యాదగిరి జిల్లా కొండమ్మవ్వ ఆలయంలో వింత ఆచారం
• నాగపంచమి రోజున తేళ్లతో భక్తుల సయ్యాట

రాయచూరు రూరల్: రాష్ట్రమంతటా శుక్రవారం నాగపంచమిని జరుపుకొంటే, జిల్లా సరిహద్దులోని ఓ గ్రామ ప్రజలు విభిన్నంగా తేళ్ల పంచమిని ఆచరించారు. యాదగిరి జిల్లా గుర్మిట్కల్ తాలూకా కందుకూరు సమీపంలోని కొండమవ్వ అమ్మవారి సన్నిధిలో తేళ్ల పంచమి పండుగ జరిగింది. గుట్టపై అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు, తరువాత ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తీసినా వాటి కింద తేళ్లు కనిపించాయి. చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా ఉత్సాహంగా తేళ్లను పట్టుకొన్నారు. అవి కాటేస్తాయన్న భయం ఏ కోశాన కనిపించలేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది.

కుట్టకపోవడం వింత

కొందరు తల, చెవులు, మెడ, నాలుకపై తేళ్లను ఆడించి ఆనంద పడ్డారు. ఈరోజున తేళ్లను పట్టుకున్నా శరీరంపై పాకించినా అవి కుట్టనే కుట్టవు. అమ్మవారి మహిమ ఇందుకు కారణమని భక్తుల విశ్వాసం. శ్రావణంలో తేలు పూజల వల్ల అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్న నమ్మకంతో వందలాది భక్తులు తరలిస్తారు. పాలు, నువ్వులు, బెల్లం తదితర పదార్థాల వంటకాలను గుట్టపై ఉంచి పూజలు చేస్తారు. కర్ణాటకతో పాటు పొరుగున ఉన్న తెలుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తారు.


పసికందు చేతిపై పెద్ద తేలు


నేను పట్టుకున్నా.. ఏమీ చేయలేదు


కోలారు వార్తలు...

కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లాలి


గాంధీవనం వద్ద ప్రతిఘటన నిర్వహిస్తున్న దృశ్యం


కోలారు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ కంపెనీల తీరును నిరసిస్తూ సంయక్త పోరాట సమితి, వివిధ సంఘటనల కార్యకర్తలు శుక్రవారం నగరంలోని గాంధీవనం వద్ద క్విట్ ఇండియా తరహా ప్రతిఘటన నిర్వహించారు. కేపీఆర్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెల్లదొరల తరహాలో కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్నాయన్నారు. వీరిని దేశం నుంచి వెళ్లగొట్టడానికి క్విట్ ఇండియా వంటి ఉద్యమం చేయాలన్నారు. ప్రధాని మోదీ కార్మికుల హితవును కాపాడడానికి బదులుగా కార్పొరేట్ కంపెనీలకు ఎర్ర తివాచి పరుస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు అబ్బణి శివప్ప మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజెల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, సామాన్య ప్రజల జీవితం దుర్భరంగా మారుతోందన్నారు. ప్రతిఘటనలో కేపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్, జిల్లా కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్, గాంధీనగర నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దోసెలు తిని విద్యార్థులకు అస్వస్థత


చికిత్స పొందుతున్న విద్యార్థులు

కోలారు : దోసెలు తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈఘటన తాలూకాలోని వేమగల్ అంబేడ్కర్ హాస్టల్లో శుక్రవారం చోటు చేసుకుంది. చౌడేశ్వరి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అమ్మనల్లూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు అంబేడ్కర్ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్నారు. శుక్రవారం ఉదయం దోసెలు తిన్నవారిలో 5 మందికి వాంతులు కాగా మరికొంతమంది కడుపు నొప్పితో బాధపడ్డారు. ఐదు మందిని చింతామణి ఆస్పత్రికి, మిగిలని విద్యార్థులను అమ్మనల్లూరు పీహెచ్‌సీలకు తరలించారు. విద్యార్థులు కోలుకుంటున్నారని వైద్యాధికారి అక్షయకుమార్ తెలిపారు. చింతామణి ఆస్పత్రికి సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసన్, వేమగల్ పోలీసులు, కోలారు తహసీల్దార్ డాక్టర్ నయన వెళ్లి విద్యార్థులను పరామర్శించారు.

పదిలో ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక తరగతులు


పాఠశాలల హెచ్‌ఎంలకు ఈ ఖాతాల పత్రాలు అందజేసిన దృశ్యం

కోలారు : వచ్చే ఏడాది జరిగే పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అక్రం పాషా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సభాంగణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విద్యా ప్రగతి పరిశీలనా సభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అధికారులు తరచుగా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంచే ప్రయత్నం చేయాలన్నారు. పాఠ్యాంశాలు సులభంగా అర్థం అయ్యేలా బోధించాలన్నారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పాఠశాలల ఆస్తులకు సంబంధించి ఈ ఖాతాల దాఖలాలను ప్రధానోపాధ్యాయులకు అందించారు. సమావేశంలో ఎస్పీ నిఖిల్, డీఈఓ కృష్ణమూర్తి, డైట్ ప్రిన్సిపాల్ జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగ పంచమి


నాగ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కోలారు : నాగ పంచమిని జిల్లా వ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అశ్వర్థకట్ట, నాగదేవతల కట్టలకు పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఇంటికి వచ్చే సోదరుల ఆరోగ్యం, ఐశర్యం, వృద్ధి కావాలని కోరుతూ భక్తితో పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ కాలనీల్లో అశ్వర్థకట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

మాలూరు : తాలూకాలోని తోర్నహళ్లి చెరువు ప్రాంగణంలో కోడి పందేలు ఆడుతుండగా శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 8,300 స్వాధీనం చేసుకున్నారు.

చిక్క తిరుపతిలో శ్రావణ మాస పూజలు

మాలూరు : ప్రసిద్ధ చిక్కతిరుపతి శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు శ్రావణ మాస శనివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ టీ సెల్వమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ శనివారం శ్రవణ నక్షత్రంలో శ్రీ స్వామి వారు జన్మించడం వల్ల శ్రీనివాసుడికి శ్రావణమాసం అత్యంత ఇష్టమైనదని, 4 శనివారాలలో స్వామి వారికి విశేష పూల అలంకరణ చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు ప్రసాదం, భోజన వ్యవస్థ కల్పిస్తామని తెలిపారు. ప్రతి శనివారం లక్ష మంది భక్తులు స్వామి వారి దర్శనం చేసుకోనున్నారని తెలిపారు.

క్లుప్తంగా

శాస్త్రీయంగా ఆలోచించాలి



తరగతులను ప్రారంభిస్తున్న కేపీజె రెడ్డి

గౌరిబిదనూరు: జీవితంలో ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞాని కేపీజె రెడ్డి అన్నారు. పట్టణంలోని అశ్వత్థయ్య ఇస్తూరి సంజీవమ్మ నేషనల్ కళాశాలలో పీయూసీ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి ప్రసంగిస్తూ విద్యావేత్త డాక్టర్ హెచ్ నరసింహయ్య ఆశయాలకు అనుగుణంగా కాలేజీలను నడుపుతున్నామన్నారు. బెంగళూరు జయనగర్ నేషనల్ కళాశాల వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ జయరామ్ పాల్గొన్నారు.

కారు అద్దం పగలగొట్టి ల్యాప్‌టాప్ చోరీ

మైసూరు: కారు అద్దాలు పగులగొట్టిన దుండగులు లోపల ఉంచిన ల్యాప్‌టాప్‌ను చోరీ చేసిన ఘటన నగరంలోని కేఆర్ ఆస్పత్రి వద్ద జరిగింది. మండ్యకు చెందిన పవన్‌కుమార్ మైసూరు కేఆర్ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు తన తల్లిదండ్రులతో కారులో ఆస్పత్రి వద్దకు వచ్చారు. కారును ధన్వంతరి రోడ్డులో నిలిపి ఆస్పత్రి లోపలకు వెళ్లి వచ్చేలోగా దుండగులు కారు వెనుక డోర్ అద్దం పగులగొట్టి ల్యాప్‌టాప్ చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై దేవరాజ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలి



స్థల దాత గంగమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు స్థానికులు చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ సూచించారు. తాలూకాలోని కెంకెరె గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన గంగమ్మ దాతృత్వం చాలా గొప్పదన్నారు.గ్రామ పంచాయతీ నుంచి ఆమెకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం గంగమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కెహెచ్‌పీ ఫౌండేషన్ శ్రీనివాసగౌడ, జీపీ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, నాగరాజనాయక్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య

దొడ్డబళ్లాపురం: వృద్ధుడు హత్యకు గురైన ఘటన నెలమంగల తాలూకా మాదనాయకనహళ్లిలో చోటుచేసుకుంది. మాదనాయకనహళ్లి 1వ వార్డు నివాసి సిద్దప్ప(70) గురువారం ఇంటిలో నిద్రిస్తుండగా దుండగులు చొరబడి ఇనుప రాడ్‌తో తలపై బాది హత్య చేసి పరారయ్యారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి మాదనాయకనహళ్లి పోలీసులలకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కొత్త భవనంలోకి కార్యాలయం తరలింపు



ప్రారంభిస్తున్న సిద్దలింగ స్వామీజీ

తుమకూరు: తుమకూరు నగరంలోని జూనియర్ కళాశాల మైదానం ఆవరణంలో ఉన్న పీయూ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని టౌన్‌హాల్ సర్కిల్‌లో ఉన్న పాత గ్రంథాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనంలోకి శుక్రవారం మార్పు చేశారు. తుమకూరు మఠం అధ్యక్షులు సిద్దలింగ స్వామీజీ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన భవనం అన్ని సదుపాయాలతో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో పీయూ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాలగురుమూర్తి, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జిల్లా క్రీడా సంఘం కార్యాధ్యక్షుడు టి.ఆర్. బసవరాజు పాల్గొన్నారు.

తామ్ర వస్తువుల చోరీ

మైసూరు: మెటగల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని గోపాలన్ ఎంటర్‌ప్రైసెస్ కర్మాగారం గోదాములో చోరీ జరిగింది. ఈ పరిశ్రమ ఏళ్లుగా మూతపడింది. వస్తువులున్న గోదాముకు యాజమాన్యం కాపలాదారును నియమించింది. ఆయన గోదాముకు తాళాలు వేసుకుని వెళ్లిన సమయంలో దొంగలు లోపలకు చొరబడి రూ.15 వేల విలువ చేసే 20 కేజీల తామ్ర వస్తువులను చోరీ చేశారు. కాపలాదారుడు మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా గేట్, కర్మాగారం గోదాము తాళాలు బద్దలైనట్లు కనిపించింది. లోపలకు వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగు చూసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భక్తి శ్రద్ధలతో నాగ పంచమి



పరంగిపాళ్యలో నాగదేవతలకు పాలాభిషేకం



తుమకూరులో నాగ దేవతలకు పూజలు



విదురాశ్వత్థంలో నాగశిలలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

యశవంతపుర: శ్రావణమాసంలో వచ్చిన తొలి పండుగ నాగుల పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మహిళలు వేకువజామునే స్నానాలు ఆచరించి ఇంటిని శుభ్రం చేసుకొని గడపకు కుంకుమ, పసుపుతో అలంకరించి నాగుల కట్ట వద్దకు వెళ్లి నాగ దేవత విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. నువ్వులు, వడపప్పుతో చేసిన ఉండ్రాళ్లను నాగదేవతలకు అర్పించి కర్పూర హారతి ఇచ్చి పూజలు చేశారు. దక్షిణ కన్నడ జిల్లా కుక్కే , దొడ్డబళ్లాపుర తాలూకా ఘాటి, పావగడ తాలూకా నాగలమడక, కెంగేరి సమీపంలోని ముక్తినాగ ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాగదేవతలకు పూజలు నిర్వహించారు. కుక్కే సుబ్రహ్మణ్య ఆలయంలో విశేష పూజలు చేశారు. బెంగళూరు నగరం మల్లేశ్వర ఆలయ అవరణలో నాగదేవత విగ్రహాలకు పాలు పోసి పూజలు చేశారు. పుట్టలకు పాలు పోసి, దారం చుట్టి పూజలు చేశారు. మైసూరు, చిక్కబళ్లాపుర, హావేరి, హుబ్లీ, ధార్వాడ, కలబురగి, రాయచూరు జిల్లాలో చివరి నాగపంచమిని ఘనంగా ఆచరిస్తారు.

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి పరిధిలోని హెచ్ఎస్ఆర్ లేఔట్ పరంగిపాళ్య గ్రామంలో మారెమ్మ దేవి ఆలయ ఆవరణలో నాగుల పుట్టకు, నాగదేవత విగ్రహాలకు మహిళలు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పాలు, పెరుగు, తేనెతో నాగదేవతకు అభిషేకం నిర్వహించారు. పుట్టలో పాలు, పెరుగు పోశారు.

తుమకూరు : తుమకూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా నాగపంచమి వేడకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి నాగుల కట్ట వద్దకు వెళ్లి నాగదేవతలకు పాలాభిషేకం నిర్వహించారు.

గౌరిబిదనూరు: తాలూకాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన విదురాశ్వత్థంలో భక్తుల సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు తరలివచ్చి 80 వేలకిపైగా నాగశిలలను దర్శించుకుని పూజలు చేశారు. ప్రధాన పూజారులైన నాగేంద్ర శర్మ, శ్రీధర శాస్త్రిలు పూజలు నిర్వహించారు. ఇక్కడికి వచ్చిన భక్తులు దేవాలయం వెనుక వీరసౌధ, స్వాతంత్ర్య సమర యోధుల స్మారకాలను వీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ మరిరాజు తెలిపారు.

చోరీ చేసిన నగలతో వాట్సాప్ డీపీ

- పట్టుబడిన కిలేడీ, నగలు స్వాధీనం



నిందితురాలు రేణుక



స్వాధీనపరచుకున్న ఆభరణాలు

కృష్ణరాజపుర: ఇళ్లలో పని చేస్తూ నగలను తస్కరించి వాటిని ధరించి వాట్సాప్‌లో డీపీగా పెట్టుకొని చివరకు కటకటాలపాలైంది ఒక కిలేడీ. హొసపేటకు చెందిన రేణుకా(38) అనే మహిళను హెచ్ఏఎల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సదరు మహిళ తనకు సౌత్, నార్త్ అన్ని రకాల వంటలు వచ్చని చెప్పి మారతహళ్లిలోని పూర్వ ఫౌంటెన్ అపార్ట్‌మెంట్‌లోని రెండు ఫ్లాట్లలో పని దక్కించుకుంది. ఆ రెండు ఇళ్లలోనూ చేతివాటం చూపి సుమారు 100 గ్రాముల బంగారు ఆభరణాలు దోచేసింది. ఇంటి యజమానురాలి తాళిబొట్టును కూడా దోచుకుంది. రేణుకాను పోలీసులు అనుమానంతో విచారణ చేపట్టారు. తనకేమి తెలియదని చెప్పడంతో వదిలేశారు. పోలీసులు తననేమీ చేయలేరని అనుకుందేమో దోచుకున్న నెక్లెస్‌ని మెడలో వేసుకుని సెల్ఫీ తీసుకుని వాట్సాప్ డీపీగా పెట్టుకుంది. ఆ డీపీని చూసిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా చోరీ చేసిన అన్ని ఆభరణాలతో కూడిన ఫొటోలు లభించాయి. దీంతో నిందితురాలిని అరెస్ట్ చేసి 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనపరచుకున్నారు.

ప్రపంచ స్థాయిలో బృందావన గార్డెన్స్ అభివృద్ధి



కేఆర్ఎస్ డ్యాం వద్ద వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

మండ్య: కేఆర్ఎస్ డ్యాంకు ఎలాంటి హాని జరగకుండా బృందావన గార్డెన్స్‌ను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పథకం రూపొందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి డి.కే.శివకుమార్ తెలిపరు. శుక్రవారం ఆయన కేఆర్ఎస్ జలాశయాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జలాశయ పరిరక్షణకు అవసరమైన స్థలాన్ని మినహాయించి ఇతర 200 ఎకరాల్లో అమ్యూస్‌మెంట్ పార్క్ నిర్మిస్తామన్నారు. దాదాపు రూ.2వేల కోట్లతో పథకం రూపొందిస్తామని తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు సదుపాయాలు మెరుగుపరుస్తామని తెలిపారు. ప్రవేశ మార్గాలను విస్తరించి అండర్ డ్రైనేజీలు నిర్మిస్తామని తెలిపారు. ఆయన వెంట మంత్రి ఎన్.చెలువరాయ స్వామి, ఎమ్మెల్యే పి.రవికుమార్, కె.ఎం.ఉదయ్, రంగనాథ్ ఉన్నారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

దొడ్డబళ్లాపురం: రక్తం పంచుకొని పుట్టిన తమ్ముడిని అన్న నిర్దాక్షిణ్యంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన బేగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. లక్ష్మి లేఔట్‌లో రజని(23), ప్రకాశ్(19) అన్నదమ్ములు నివాసం ఉంటున్నారు. అన్న రజని చెడు వ్యసనాలకు బానిసై పని చేయకుండా ఇంట్లో కూర్చుని ఉంటున్నాడు. ఎన్ని రోజులు ఇలాగే ఉంటావు, ఏదైనా పని చేయవచ్చుగా అని తమ్ముడు హితవు పలికాడు. నాకే నీతులు చెబుతావా? అంటూ రజని తన తమ్ముడిపై కత్తితో దాడి చేశాడు. ఘటనలో ప్రకాష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. బేగూరు పోలీసులు నిందితుడు రజినిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

కార్మికులపై మృత్యు పంజా

మైసూరు: బైక్ చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన శాంతిగేరి వద్ద జాతీయ రహదారిలో జరిగింది. మైసూరు జిల్లా పిరియాపట్టణ తాలూకా నవిలూరు గ్రామానికి చెందిన ఆకాష్, ప్రసన్నలు పిరియాపట్టణ నుంచి మడికేరికి సెంట్రింగ్ పని కోసం బైక్‌లో వెళుతుండగా శాంతిగేరి వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రసన్నను మడికేరి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నైస్ రోడ్డులో అధిక వేగానికి కళ్లెం

దొడ్డబళ్లాపురం: హైవేల్లో ప్రమాదాల నివారణకు పోలీసులు ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు అమలు చేస్తున్నా వాహనాల వేగం తగ్గడం లేదు. ఈక్రమంలో ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన నైస్ రోడ్డులో వేగానికి క్లాం వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నైస్ రోడ్డులో లేజర్ ట్రాక్ ఏర్పాటు చేశారు. వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి యజమానికి వాట్సాప్‌లో ఫొటో, జరిమానా రసీదు పంపుతున్నారు. ప్రస్తుతం రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నారు. అంతేకాకుండా వేగంగా వెళ్లే వాహన వివరాలను ముందు రాబోయే టోల్ సిబ్బందికి సమాచారం వెళ్లిపోతోంది. టోల్ వద్ద ఉండే పోలీసులు వాహనాన్ని అడ్డగించి జరిమానా విధిస్తున్నారు.

డెంగీతో హెడ్ కానిస్టేబుల్ మృతి



మృతుడు సోమశేఖర్

యశవంతపుర: డెంగీ జ్వరంతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన బెంగళూరులో జరిగింది. సోమశేఖర్ అనే వ్యక్తి ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులోని బెంగళూరు నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో సిటీ క్రైం రికార్డ్ బ్యూరోలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఆయన జ్వరానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చేరగా డెంగీ అని తేలింది. దీంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా డెంగీ కేసులు గత ఏడాదికంటే ఈ ఏడాది అధికంగా పెరిగాయని అధికారులు తెలిపారు. ఒక్క మంగళూరులోనే 259 డెంగీ కేసులు నమోదయ్యాయి. బెంగళూరు, ధార్వాడ, హావేరితో పాటు 8 జిల్లాల పరిధిలో కేసులు పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. డెంగీకి అడ్డుకట్ట వేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు ఆరోగ్యశాఖ డైరెక్టర్లను ఆదేశించారు.

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

దొడ్డబళ్లాపురం: బెంగళూరు–మంగళూరు మధ్య రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కొండచరియలు విరిగిపడ్డ నేపథ్యంలో రెండు వారాలుగా ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే. కడగరవళ్లి–ఎడకుమేరి మధ్యలో ధ్వంసమైన రైలు పట్టాల పనులు పూర్తి చేశారు. పట్టాలపై పడిన మట్టి, బండరాళ్లను తొలగించారు. దీంతో రైళ్ల రాకపోకలను ప్రారంభించారు. యశ్వంతపూర్–మంగళూరు మార్గంలో గోమటేశ్వర ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం సంచరించింది.

ట్యాంకు నిర్మాణం ప్రారంభం

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరిలో ఓవర్ ట్యాంక్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వం 30 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌ట్యాంక్ నిర్మాణానికి రూ. 22 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, వేపనపల్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్, యూనియన్ ఉపాధ్యక్షులు షేక్‌రషీద్ డీఎంకే నాయకులు భాగ్యరాజ్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతి మరక లేకపోతే ఎందుకు భయం ?

- సీఎంకు అశోక్ సూటిప్రశ్న

మైసూరు: 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను శుద్ధంగా ఉన్నానని వందసార్లు చెప్పిన సీఎం సిద్ధరామయ్య అవినీతికి పాల్పడకుండా శుభ్రంగా ఉంటే సీబీఐ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారు? అని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ నిలదీశారు. ఆయన శుక్రవారం సాయంత్రం నగరంలోని భాజపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాల్మీకి కుంభకోణాన్ని తొక్కిపెట్టేందుకు యత్నించారని, ఈడీ రంగంలోకి దిగగానే తప్పు జరిగిందని ఒప్పుకున్నారన్నారు. పెట్రోల్ బంకులతో పాటు వివిధ వనరుల నుంచి రాష్ట్రానికి చెందిన డబ్బు తెలంగాణ ఎన్నికలకు తరలించారన్నారు. వాల్మీకి కుంభకోణం గురించి సీఎంకు చాలా సమాచారం ఇచ్చానని, అయితే ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సీఎం ప్రజలను మభ్యపెడుతున్నారని ఆర్.అశోక్ మండిపడ్డారు. ముడా కుంభకోణానికి వ్యతిరేకంగా జేడీఎస్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్నామన్నారు. ముడా కుంభకోణంపై మీ సొంత పార్టీ అధ్యక్షుడు మరిగౌడ ఈడీ అధికారులకు లేఖ రాశారు కదా అని గుర్తు చేశారు. అలా అయితే మీ పార్టీ నేత అబద్ధాలు చెబుతున్నారా? అని నిలదీశారు. జనాందోళన సభకు కాంగ్రెస్ నేతలు డబ్బులు ఇచ్చి జనాన్ని తీసుకొచ్చారని అశోక్ విమర్శించారు.

పోలీసు వలయంలో మైసూరు నగరం

- రాజకీయ ప్రదర్శనల వేళ భారీ బందోబస్తు
- ఒక ఐజీ,నలుగురు డీఐజీలతో పర్యవేక్షణ
- ప్రముఖ ప్రాంతాల్లో మోహరించిన పోలీసు బలగాలు

మైసూరు: రాచనగరిలో శుక్ర, శనివారాల్లో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ పార్టీల సమావేశాల నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రఖ్యాత నాడహబ్బ మైసూరు దసరా మహోత్సవం చివరి రోజున జరిగే జంబూసవారీ ఊరేగింపు వేళ మాత్రమే ఇలాంటి బందోబస్తు కల్పించేవారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల అనుకూల, వ్యతిరేక సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో 5 వేల మందికి పైగా పోలీసులను బందోబస్తు కోసం నియమించారు. తుమకూరు, బెంగళూరు గ్రామీణ, రామనగర, చిక్కబళ్లాపుర, కోలారు, కేజీఎఫ్, మైసూరు, శివమొగ్గ, మండ్య, హాసన, చామరాజనగర, మడికేరితో పాటు పలు చోట్ల నుంచి పోలీసు సిబ్బందిని మైసూరుకు రప్పించారు. భద్రతకు నలుగురు డీఐజీలు, ఒక ఐజీ, 300 మంది ఇన్‌స్పెక్టర్లు, వెయ్యి మందికి పైగా సబ్ ఇన్‌స్పెక్టర్లు, వెయ్యి మందికి పైగా మహిళా పోలీసు సిబ్బందిని ఆయా ప్రదేశాలు, రోడ్లలో నియమించారు. కేఎస్ఆర్‌పీ, డీఏఆర్‌తో పాటు 100కు పైగా బెటాలియన్లను భద్రత కోసం కేటాయించారు. పోలీసుల కోసం 700కు పైగా బస్సులు ఏర్పాటు చేశారు. నగరంలోని అన్ని కల్యాణ మండపాలు, ఛత్రాలు బుక్ అయ్యాయి. 6 వేల మందికి అల్పాహారం, భోజన వ్యవస్థకు పోలీసులు హోటళ్లను బుక్ చేశారు. 400కు పైగా బాడీ కెమెరాలు, సీసీ కెమెరాలు అమర్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డేగకళ్లతో పహారా కాస్తున్నారు.

పగలు డ్రైవింగ్.. రాత్రిళ్లు కన్నాలు

- దొంగ అరెస్ట్
- 90 గ్రాముల నగలు స్వాధీనం



నిందితుడు సతీష్



స్వాధీనపరచుకున్న వస్తువులు

కృష్ణరాజపుర: పగలు క్యాబ్ నడుపుతూ రాత్రిళ్లు ఇళ్లకు కన్నాలు వేస్తున్న ఘరానా దొంగ పట్టుబడ్డాడు. తమిళనాడులోని చెన్నైకి చెందిన సతీష్(34) అనే దొంగను బాణసవాడి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడినుంచి 90 గ్రాముల బంగారు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బెంగళూరులోని కావలభైరసంద్రలో ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. యాప్ ద్వారా బుకింగ్ వస్తే డ్రైవర్‌గా పని చేసేవాడు. క్యాబ్ డ్రైవర్‌గా వెళ్లినప్పుడు రోడ్డు పక్కనున్న తాళం వేసిన ఇళ్లను గమనించేవాడు. ఆ తర్వాత బైక్‌పై వచ్చి దొంగతనాలు చేసేవాడు. కల్యాణనగర ఆర్‌బీఆర్ లేఔట్‌లో ప్రమోద్ భట్ అనే వ్యక్తి ఇంటిలో నిందితుడు ఈ ఏడాది ఏప్రిల్16న చోరీ చేశాడు. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించారు. దొంగ నలుపు రంగు పల్సర్ బైక్‌లో వచ్చి చోరీకి పాల్పడినట్లు తేలింది. 11 వేల బైక్ నంబర్లను ట్యాలీ చేసి చివరకు దొంగ వినియోగిస్తున్న బైక్‌ను ట్రేస్ చేశారు. అప్పటికే ఆ బైక్‌ను విక్రయించాడు. ఆ బండి కొన్న వ్యక్తిని విచారణ చేపట్టి నిందితుడు సతీష్ అని గుర్తించారు. తమిళనాడుకు వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేశారు.

హోసూరు వార్తలు..

కొత్త క్రిమినల్ చట్టాలు వద్దు



హోసూరులో సీపీఐ నిరసన

హోసూరు/కెలమంగలం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా శుక్రవారం హోసూరు, కెలమంగలం ప్రాంతాల్లో సీపీఐ నాయకులు ధర్నాలు చేశారు. హోసూరు తాలూకా కార్యాలయం ముందు ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యుడు లగుమయ్య మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలను బయటకు పంపి క్రిమినల్ చట్టాలను ఆమోదించారు, ఇవి ప్రజా వ్యతిరేకమైనవి, వెంటనే వెనక్కు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ధర్నా పెద్ద ఎత్తున సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కెలమంగలం బస్టాండులో కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.

సీతారాముల ఉత్సవం



విశేష అలంకరణతో శ్రీ సీతారామాంజనేయస్వామి

హోసూరు: హోసూరు సమీపంలోని పాతకోటలో వెలసిన ప్రఖ్యాత సీతా రామాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస పూజలను నిర్వహించారు. శుక్రవారం తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి ఆలయంలో అభిషేకం, అలంకరణ, విశేష పూజలు చేపట్టారు. ఉత్సవమూర్తిని అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

నాగులచవితి పూజలు



పూజలు చేస్తున్న మహిళా భక్తులు

క్రిష్ణగిరి: నాగపంచమిని పురస్కరించుకుని సూళగిరిలో పెద్ద ఎత్తున మహిళలు నాగుల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. సూళగిరిలోని మునియమ్మ సర్కిల్లో కట్టపై ఏర్పాటు చేసిన నాగుల విగ్రహాలకు పెద్ద ఎత్తున మహిళలు పూజలు నిర్వహించి నాగపంచమిని ఆచరించారు. నాగుల విగ్రహాలను పసుపు, కుంకుమతో అభిషేకించి పాలు పోసి పూజలు నిర్వహించారు.

వేర్వేరుగా ముగ్గురు ఆత్మహత్య

హోసూరు: హోసూరు, క్రిష్ణగిరి, డెంకణీకోట ప్రాంతాల్లో వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు ఒడిశాకు చెందిన పద్మలూసన్ (20) హోసూరు రెండవ పారిశ్రామిక వాడ మోర్నపల్లి ప్రాంతంలో ప్రైవేట్ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తూ వచ్చాడు. ఇతను సొంతూళ్లో ఓ యువతిని ప్రేమించేవాడు, ఆమెతో ఫోన్‌లో గొడవ జరగడంతో గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.

అనారోగ్యంతో..

క్రిష్ణగిరి సమీపంలోని కందికుప్పం గ్రామానికి చెందిన శక్తివేల్ (30). ధర్మపురిలోని ట్రాక్టర్ షోరూంలో పనిచేసేవాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన ఇతను గురువారం రాత్రి ఉరివేసుకొని ప్రాణాలు తీసుకొన్నాడు.

మద్యానికి బానిసై..

డెంకణీకోట పట్టణ పంచాయతీ తేరుపేట ప్రాంతానికి చెందిన రాజా (37), ఇతనికి తాగుడు అలవాటుండేది. రోజూ మద్యం తాగి ఇంటికెళ్లడంతో భార్య దండించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాజా గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించాడు. మూడు సంఘటనల్లోనూ పోలీసులు కేసులు నమోదు చేశారు.

వరమహాలక్ష్మికి శ్రావణమాస పూజలు



అమ్మవారిని అలంకరించిన దృశ్యం

చింతామణి : తాలూకాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కైవార శ్రీ యోగినారేయణ మఠం ఆవరణలో శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరమహాలక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రాతఃకాల ఘంటానాద సుప్రభాత, గోపూజతో పూజ కార్యక్రమాలను ధర్మాధికారి జయరాం దంపతులు ప్రారంభించారు. వేదికపై లక్ష్మీ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేసి అలంకరించారు. తాతయ్య రచించిన శ్రీరామతారక మంత్రాన్ని ముత్తైదువులు సామూహికంగా గాయనం చేశారు.



హాజరైన మహిళలు

పురాతన శివలింగం లభ్యం



మైసూరు: మైసూరు జిల్లా పిరియాపట్టణ తాలూకాలోని నారళాపుర గ్రామంలోని జమ్మి(బన్ని) చెట్టు కింద పురాతన శివలింగం బయల్పడింది. చుట్టుపక్కల గ్రామాలు, కొడగు భాగం నుంచి పలువురు భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. బాళెకట్టె ఆశా అనే మహిళ పొలంలో కొన్నాళ్ల క్రితం నుంచి భ్రమరాంభ అమ్మవారికి పూజలు జరుగుతుండగా, అదే స్థలంలో సుమారు నాలుగు అడుగుల లోతులో పీఠంతో కూడిన శివలింగం లభించింది.

అష్టమంగళ ప్రశ్న ద్వారా

దీని గురించి కోల్‌కతా వివేకానంద యూనివర్సిటీ ప్రొఫెసర్, జ్యోతిష్య పండితులు డా.కె.వెంకటరమణ భట్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరించాలని ఆశా అనే మహిళ తనతో అష్టమంగళ ప్రశ్న వేయించగా ఇక్కడ శివలింగం ఉందని, ఈ లింగాన్ని కొన్ని వేల సంవత్సరాల క్రితం వేదవ్యాస మహర్షి పూజించారని తెలిసిందన్నారు. శివలింగాన్ని వెలికితీసే పనిలో పలువురు పూజారులు, జ్యోతిష్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రాజ్యోన్మాదంపై నేడు కొవ్వొత్తుల ప్రదర్శన

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు

సాక్షి, అమరావతి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 'సామాజిక మహాశిల్పంపై' కూటమి ప్రభుత్వ దాడిని రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానంగా, ప్రజాస్వామ్య ఖూనీగా వైఎస్సార్ సీపీ భావిస్తోంది. కూటమి ప్రభుత్వ రాజ్యోన్మాదాన్ని ఖండించే కార్యక్రమంలో భాగంగా శనివారం (నేడు) సాయంత్రం అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో కొవ్వొత్తుల ప్రదర్శన పెద్దఎత్తున నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ పిలుపు నిచ్చింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. పార్టీ జిల్లా అధ్యక్షులకు, శాసనసభ్యులకు, అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థులు ఈ కార్యక్రమాలకు నేతృత్వం వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి, నిరసన కార్యక్రమం చేపట్టి, మీడియాతో మాట్లాడాలని సూచించింది.

ఎంపీ మిథున్‌రెడ్డికి వై కేటగిరీ భద్రత

- నేటి నుంచి విధుల్లోకి భద్రతా సిబ్బంది



సాక్షి, న్యూఢిల్లీ/పుంగనూరు (చిత్తూరు జిల్లా): వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి వై కేటగిరీ భద్రతను కల్పిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలిచ్చింది. ఇటీవల పుంగనూరు పర్యటన సమయంలో తనపై జరిగిన దాడిని వివరిస్తూ కేంద్ర హోం శాఖకు మిథున్‌రెడ్డి లేఖ రాశారు. దీనిపై స్పందించిన హోంశాఖ ఎనిమిది(4+ 4) సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో వై కేటగిరీ భద్రత కల్పించింది. గత నెల 18న పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి మిథున్‌రెడ్డి వచ్చి పార్టీ ముఖ్యులతో సమావేశమవగా.. టీడీపీ గుండాలు, ఆ పార్టీ శ్రేణులు రాళ్లు, ఇతర మారణాయుధాలతో ఆ ఇంటిపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ దాడులను రాష్ట్ర ప్రభుత్వం నిలువరించకపోగా బాధితులైన ఎంపీ, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ క్యాడర్‌పైనే తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోంది. ఈ దాడి తర్వాత కేంద్ర నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించే పరిస్థితులు లేకపోవడంతో ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖకు నివేదించాయి. ఈ నివేదికలను పరిశీలించిన కేంద్ర హోంశాఖ తక్షణం వై కేటగిరి భద్రతను కల్పిస్తూ ఉత్తర్వులిచ్చింది. భద్రతా సిబ్బంది శనివారం విధుల్లోకి చేరనున్నారు.

'ఉపాధి హామీ' వేతనాలకు కేంద్ర నిధులు విడుదల

సాక్షి, అమరావతి : ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వేతనాల చెల్లింపులకు అదనంగా మరో రూ.2,812.98 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేసిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో గతంలో ఆమోదించిన 15 కోట్ల పని దినాలకు సంబంధించి వేతన నిధులు రూ.2,934.80 కోట్లు మంజూరు చేసి.. ఆ నిధుల విడుదల చేసిందనీ, ఇటీవల 21.5 కోట్ల పనిదినాలకు పెంచిన నేపథ్యంలో ఆ మేరకు అదనంగా ఇప్పుడు రూ.2,812.98 కోట్లను మంజూరు చేస్తూ కేంద్రం ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ పథకం ద్వారా పనిచేసిన కూలీలకు వారికి సంబంధించిన కూలీ డబ్బులు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలోనే ఆయా వేతనదారుల ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. రాష్ట్రంలో గతంలో మునుపెన్నడూ లేని రీతిన ఒకేవిడతన గత రెండున్నర నెలలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు రూ.2,100 కోట్ల మేర వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. కాగా, గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ, జనవరి 26న గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు ఆయా గ్రామ పంచాయతీలు తమ సాధారణ నిధుల నుంచి చేసుకునే ఖర్చుల గరిష్ట పరిమితిని పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఐదు వేల వరకు జనాభా ఉండే గ్రామాల్లో గరిష్టంగా రూ.10 వేల వరకు, ఐదు వేలకు పైబడి జనాభా ఉండే గ్రామాల్లో గరిష్టంగా రూ.25 వేల వరకూ ఖర్చు చేసుకునేందుకు అనుమతిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీవో నంబర్ 450 జారీ చేశారు.

ప్రధానితో మందకృష్ణ భేటీ

- వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ భేటీ అయ్యారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో మోదీని కలిసిన మందకృష్ణ వర్గీకరణకు సహకరించినదుకు ధన్యవాదాలు తెలిపారు. దాదాపు అరగంటపాటు మోదీతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో మాట ఇచ్చి ఆ మాట నిలబెట్టుకోడంలో మోదీ వంద శాతం విజయం సాధించారన్నారు. రెండు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలయ్యేలా చూడాలని కోరారు. కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నారని, కాబట్టి ఏపీ, తెలంగాణలో సమస్య ఉత్పన్నం కాకుండా అమలు జరిగేలా చూడాలని విన్నవించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి..
సర్కారు పనే

విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనం వద్ద అంబేడ్కరిస్టులు, ప్రజాస్వామిక వాదులు, వైఎస్సార్‌సీపీ నేతల ఆందోళన

సాక్షి ప్రతినిధి విజయవాడ/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరం నడిబొడ్డులో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ పనేనని అంబేడ్కరిస్టులు, ప్రజాస్వామిక వాదులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఖండించారు. విగ్రహంపై దాడి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు, దళిత సంఘం నేతలు, ప్రజాస్వామ్యవాదులు ఆందోళన చేపట్టారు. నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని.. భావితరాలకు స్ఫూర్తిగా, దిక్సూచిగా పెట్టిన విగ్రహం అని చెప్పారు. నగరం నడిబొడ్డులో అంబేడ్కర్ విగ్రహం ఉండకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశమని, ఈ నేపథ్యంలో విగ్రహాన్ని కూల్చివేసే ప్రయత్నం చేసిందన్నారు. రేపోమాపో కూల్చి వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం స్పందించి ఘటనపై విచారణ జరిపించడమే కాక.. బాధ్యులను అరెస్టు చేయాలన్నారు. కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని, అన్ని జిల్లాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేయాలని వారంతా పిలుపునిచ్చారు.

ఏపీ చరిత్రలో చీకటి రోజు

రాష్ట్ర చరిత్రలో గురువారం ఒక చీకటి రోజు అని, స్వయంగా ప్రభుత్వమే దాడి చేయించడం దారుణం అని మాజీమంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. దేశానికే ఐకానిక్‌గా ఉన్న ఈ విగ్రహ విధ్వంసానికి సర్కారు తెగించడం చూసి.. విగ్రహ కమిటీ చైర్మన్‌గా పని చేసిన తన హృదయం చలించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'అంబేడ్కర్ కులానికి, మతానికి సంబంధించిన వ్యక్తి కాదు. అటువంటి వ్యక్తి విగ్రహాన్ని కూల్చేందుకు టీడీపీ నేతలు కుట్రపన్నారు. చరిత్ర క్షమించదు. అధికార పార్టీ పెద్దల సూచనలు, ఆదేశాలతోనే ఈ దాడి జరిగింది. ఇది దేశం తల దించుకోవాల్సిన ఘటన' అని ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, పార్టీ నేత పోతిన మహేష్, దళిత నేత పరిశపోగు శ్రీనివాసరావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం.. వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీగా సీపీ కార్యాలయానికి వెళ్లి డీసీపీ హరికృష్ణకు వినతి పత్రం సమర్పించారు. దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తొలగించిన మాజీ సీఎం పేరును తిరిగి ఏర్పాటు చేయాలని, విగ్రహానికి పటిష్ట భద్రత కల్పించాలని కోరారు.



అంబేడ్కర్ స్మృతివనం వద్ద నిరసన తెలియజేస్తున్న మేరుగు నాగార్జున, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, రాయన భాగ్యలక్ష్మి, పోతిన మహేష్ తదితరులు

సీఎం ప్రమేయంతోనే విగ్రహంపై దాడి

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: భారతరాజ్యాంగా నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అంటేనే సీఎం చంద్రబాబుకు గిట్టదనే విషయం పలుమార్లు స్పష్టమైందని, విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఆ మహనీయుడి విగ్రహంపై దాడి ఆయన ప్రమేయంతోనే జరిగిందని మాజీ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏపీలో అంబేడ్కర్ విగ్రహం పెట్టండని అడిగినందుకు కేసులు పెట్టించారని తెలిపారు. ఇవాళ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన స్థలాన్ని.. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు తన వారికి అప్పనంగా అమ్మేయాలని కుట్రలు చేస్తే ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు.

టీడీపీ నైజం మరోసారి బయటపడింది: మాజీ ఎంపీ సురేష్

అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటన ద్వారా చంద్రబాబు, టీడీపీ నేతల నైజం మరోసారి బయట పడిందని మాజీ ఎంపీ నందిగం సురేష్ ఆక్షేపించారు. హామీలు అమలు చేయకుండా, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే చంద్రబాబు, టీడీపీ నేతలు విధ్వంసం సృష్టిస్తున్నారని.. ఇందులో భాగంగానే అంబేడ్కర్ విగ్రహంపై దాడి అని చెప్పారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్.. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో చంద్రబాబు కక్ష పెంచుకుని, ఇలా అక్కసు వెళ్లకక్కుతున్నారని మండిపడ్డారు.

పెల్లుబికిన ఆగ్రహం

అంబేడ్కర్ విగ్రహంపై పచ్చమూక దాడిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన వెల్లువ



గుంటూరులో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అంబటి తదితరులు



బద్వేలులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ నాయకులు



కాశీబుగ్గలో నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

సాక్షి, అమరావతి: విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ పచ్చమూకలు దాడిచేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబికింది.

■ చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో.. ఎస్వీయూ విద్యార్థి సంఘాలు, దళిత సంఘాలు తిరుపతిలో.. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వాకాడులో.. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామినేటి కేశవులు, పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేరూరులో అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడిపట్ల డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించాలని ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం జిలాల్లా కార్యదర్శి వై. శివ డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాతకే దిక్కులేదంటే రాష్ట్ర ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పుత్తూరులో అన్నారు.

■ కడపలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. బద్వేలు నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుండి అంబేడ్కర్ విగ్రహం వరకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

■ అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వే కోడూరులో దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన వ్యక్తంచేసి పాలాభిషేకం చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి సిగ్గుచేటని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలాసుదర్శనం మదనపల్లెలో ఖండించారు.

■ కర్నూలులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఏఎండీ ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ తదితరులు నిరసనలో పాల్గొన్నారు

■ ప్రకాశం జిల్లాలో మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ సింగరాయకొండలో.. వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌లు నిరసన చేపట్టి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

■ అంబేడ్కర్ స్మృతివనంపై దాడి చేయడమంటే దేశ ప్రజలను అవమానించటమేనని పల్నాడు జిల్లా నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు కిశోర్, పార్టీ ఎస్సీ నేతలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రజాస్వామ్యవాదులు ఈ ఘటనను ఖండించాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గుంటూరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాజీమంత్రి అంబటి రాంబాబు, పార్టీ ఇతర నేతలు నిరసన వ్యక్తంచేసి అంబేడ్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధిచేశారు. తెనాలి, తాడికొండ, తుళ్లూరు, పొన్నూరులోనూ అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు.

■ ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు క్షీరాభిషేకం చేశారు. కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు, జై భీమ్‌రావ్ భారత పార్టీ జనరల్ సెక్రెటరీ పరసా సురేష్ దాడిని ఖండించారు. మచిలీపట్నంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అవనిగడ్డ, నిడమానూరులోనూ పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తంచేశారు.

■ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, తణుకు బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు.. పాలకొల్లులో ప్రజాస్వామ్యవాదులు నిరసన తెలిపారు.



చంద్రబాబు అలక్ష్యం, జగన్ స్ఫూర్తికి నిదర్శనం..

అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం

- తుప్పల్లోనే ఆగిపోయిన చంద్రబాబు డాంబికాలు
- బెజవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని నిలిపిన వైఎస్ జగన్
- బాబుకు, వైఎస్ జగన్‌కు ఇదే తేడా

సాక్షి, అమరావతి: అమరావతిలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మిస్తానని గతంలో డాంబికాలు పోయిన చంద్రబాబు.. ఎక్కడో మారుమూల శాఖమూరులో స్థలం కేటాయించినట్లు ప్రకటించి ఐదేళ్లు వదిలేయడంతో స్మృతివనం స్ఫూర్తి తుమ్మ చెట్ల తుప్పల్లో చిక్కుకుపోయింది. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నతంగా ఆలోచించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుని విగ్రహం మారుమూల ప్రాంతంలో కాకుండా విజయవాడ నగరం నడిబొడ్డున నిర్మించి నిలువెత్తు స్ఫూర్తిని నింపారు. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్' ప్రాంగణాన్ని అడుగడుగునా అద్భుతాలతో దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారు. 18.81 ఎకరాల ప్రాంగణంలో 206 అడుగుల ఎత్తయిన సామాజిక న్యాయ మహాశిల్పంతో పాటు ఇక్కడ ప్రతి నిర్మాణం ఓ అద్భుతమే. రూ.404.35 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మహా స్థూపం (కోర్ వాల్)ను తుపాను గాలులు, భూకంపాల తీవ్రతను తట్టుకునేలా డిజైన్ చేశారు. 81 అడుగుల పీఠం (పెడెస్టల్)పై 125 అడుగుల ఎత్తు, 510 మెట్రిక్ టన్నుల బరువైన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. చుట్టూ గార్డెన్స్, నీటి కొలను మధ్యలో కాలచక్ర మహా మండపం డిజైన్‌తో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహ పీఠం ఓ అద్భుతం. పీఠం లోపల మూడు అంతస్తుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంలోనే పెద్దదైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని విహార థియేటర్‌లో అంబేడ్కర్ జీవిత చరిత్ర, విజ్ఞానం, భౌగోళిక, సంస్కృతి, చరిత్ర వంటి అనేక అంశాలపై సినిమాలు ప్రదర్శిస్తారు. అంబేడ్కర్ మైనపు బొమ్మతో కూడిన స్టడీ రూమ్, విద్యార్థుల కోసం ఇంటరాక్షన్ క్లాస్ రూమ్, అంబేడ్కర్ జీవిత చరిత్రతో కూడిన లైబ్రరీ కూడా ఉన్నాయి. రెండో అంతస్తును ధ్యాన మందిరం (మెడిటేషన్), సందర్శకులు అంబేడ్కర్ జీవిత చరిత్రపై అధ్యయనం చేసేలా తీర్చిదిద్దారు. అంబేడ్కర్ జీవిత చరిత్రతో కూడిన 36 కుడ్య చిత్రాలతో రూపొందించిన కొలనేడ్ మరో పెద్ద ఆకర్షణ.

దుండగులను వెంటనే శిక్షించాలి



విజయవాడ స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక చారిత్రక ఘట్టానికి ఆద్యుడిగా నిలిచారు. వైఎస్ జగన్ పేరును టీడీపీ దుండగులు ధ్వంసం చేయడం సరికాదు. ఆపేరు తిరిగి ఏర్పాటు చేయాలి. దుండగులు ఎవరైనా సరే పట్టుకొని వెంటనే శిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– జూపూడి ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు

మా ఆత్మగౌరవం దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోం



మేము దేవుడిగా చూసుకునే అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసి మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోం. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రులో అంబేడ్కర్ విగ్రహం పెట్టనీయకుండా అడ్డుకున్నారు. అక్కడ విగ్రహం పెట్టాలని తలపెట్టిన వ్యక్తిని కూడా చంపించారు. అండగా నిలిచిన కుల సంఘాల ప్రతినిధులను అరెస్టు చేయించారు. ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మా ఆత్మగౌరవం నిలబెట్టారు. అది చూసి చంద్రబాబు ఓర్వలేక ఇప్పుడు దాడి చేయించారు.

–నత్తా యోనారాజు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు

గవర్నర్ స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలి



రాజ్‌భవన్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనలో గవర్నర్ అబ్దుల్ నజీర్ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ దాడిపై మౌనం వహించడం సరికాదు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై, విగ్రహాలు, శిలాఫలకాలపై దాడులు జరుగుతుంటే ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు. ఈ దాడులపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈ దాడులపై జాతీయ స్థాయిలో సంఘాలకు, పార్టీల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం.

– పెరికె వరప్రసాదరావు, నేషనల్ దళిత జేఏసీ చైర్మన్

హామీలిచ్చా.. అప్పులున్నాయిగా..

- ప్రధానితో అరకు కాఫీ తాగించి ఆయన్నే బ్రాండ్ అంబాసిడర్ చేశా
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో చంద్రబాబు



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ హామీలిచ్చానని, కానీ, రాష్ట్రానికి ఉన్న రూ.10 లక్షల కోట్ల అప్పులకు వడ్డీ కట్టాలని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని, ప్రతి కులాన్ని అధ్యయనం చేస్తున్నానని, వారిని ఏ విధంగా పైకి తీసుకురావాలో ఆలోచిస్తున్నానని అన్నారు. ఆయన శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్నారు. అడవి తల్లికి ఆదివాసీ చీరను సమర్పించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశ ప్రధానితో అరకు కాఫీ తాగించి ఆయన్నే బ్రాండ్ అంబాసిడర్ చేశానని చెప్పారు. దేశంలోని ప్రతి షాపులో అరకు కాఫీ అమ్మేలా చేస్తానన్నారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి తగ్గుతోందని, గిరిజనుల్లో మాత్రం సంతానం పెరగడం శుభపరిణామమని అన్నారు. ఈ రోజుల్లో కూడా ఏజెన్సీలో డోలీ మోతలు విచారకరమని అన్నారు. డీఎస్సీకి పోటీ పడే గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. గిరిజన విద్యార్థుల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. లంబసింగిలో మ్యూజియం, పాడేరులో మెడికల్ కళాశాల రూ.500 కోట్లతో పూర్తి చేస్తామని చెప్పారు. పాడేరులో రూ.10 కోట్లతో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తామని, కుళాయి ద్వారా నీళ్లు అందిస్తామని, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని హామీల వర్షం కురిపించారు. మొన్నటి ఎన్నికల్లో వచ్చిన సుడిగాలిలో జగన్ కొట్టుకుపోయాడని, ఇక తిరిగి రాడని చంద్రబాబు అన్నారు. టీడీపీ హయాంలో తెచ్చిన 16 పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా మీ భూములను దోచుకోవాలని చూశారని, అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై చంద్రబాబు కసరత్తు

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీచేసే విషయంపై సీఎం చంద్రబాబు పార్టీ నేతలతో చర్చించారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆ జిల్లా నేతలతోపాటు పలువురు పార్టీ సీనియర్లతో మాట్లాడారు. పోటీ చేయాలా, వద్దా అనే విషయంపై నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. నేతలు చెప్పిన లెక్కల ప్రకారం గెలవడానికి సరిపోయే సంఖ్య లేదని తెలిసింది. అందుకే అభ్యర్థిని ఖరారు చేయకుండా సాగదీస్తున్నట్లు సమాచారం. పోటీ చేయాల్సివస్తే అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

ఐదేళ్లలో 18 శాటిలైట్ న్యూస్ చానళ్ల అనుమతి రద్దు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: నిబంధనల మార్గదర్శకాలు ఉల్లంఘించిన బ్రాడ్‌కాస్టర్స్‌పై చర్యలు తీసుకుంటామని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయమంత్రి మురుగన్ చెప్పారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఐదేళ్లలో 18 శాటిలైట్ న్యూస్ చానళ్ల అనుమతి రద్దుచేసినట్లు తెలిపారు. మరో మూడు శాటిలైట్ న్యూస్ చానళ్లను పరిమిత కాలానికి నిలిపేసినట్లు చెప్పారు. ప్రైవేటు శాటిలైట్ టీవీ చానళ్లకు అఖిల భారత ప్రాతిపదికన అనుమతి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మాండౌస్ తుపాను వల్ల నష్టపోయిన ఫ్లూక్యూర్డ్ పొగాకు బాధితులకు వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి జితిన్‌ప్రసాద తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. 2022–23లో 10,882 మంది రైతులకు పొగాకు బోర్డు గ్రోవర్స్ వెల్ఫేర్ స్కీం నుంచి రూ.10 వేలు వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు చెప్పారు.

గతేడాది పెండింగ్ నిధులు ఈ ఏడాది విడుదల చేశాం



ఉపాధి హామీ పథకం కింద 2023–24లో పెండింగ్‌లో ఉన్న నిధుల్ని 2024–25లో విడుదల చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి కమలేష్ పాసవాన్ తెలిపారు. దీంతో.. ఆంధ్రప్రదేశ్‌కు ఉపాధి హామీ పథకం కింద నిధుల పెండింగ్ లేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ. 2023–24లో ఏపీకి వేతనం, మెటీరియల్, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలకు రూ.732.63 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. 2024–25లో రూ.5,876 కోట్లు విడుదలయ్యాయని, ఇందులోనే 2023–24 పెండింగ్ నిధులున్నాయని చెప్పారు.

వందేభారత్ సేవలు నిరంతర ప్రక్రియ



బ్రాడ్‌గేజ్ విద్యుదీకరణ నెట్‌వర్క్ ఉన్న రాష్ట్రాలను కలుపుతూ దేశంలో ప్రస్తుతం 102 వందే భారత్ రైళ్లు సేవలందిస్తున్నాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ట్రాఫిక్ సమర్థన, కార్యాచరణ సాధ్యత, వనరుల లభ్యతలకు లోబడి వందేభారత్ సహా కొత్త రైలు సేవలను ప్రవేశపెట్టడం నిరంతర ప్రక్రియ అని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

విభజన చట్టాన్ని సవరించండి

- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి ప్రైవేటు బిల్లు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు వేగవంతంగా పూర్తికావడానికి వైఎస్సార్‌సీపీ మరో అడుగేసింది. విభజన చట్టాన్ని సవరించాలని కోరుతూ లోక్‌సభలో ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టింది. శుక్రవారం లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి ఈ సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని సెక్షన్ 90లో 90ఏ చేర్చాలని, అందులో పోలవరం సవరించిన అంచనా వ్యయం చేర్చాలని డిమాండ్ చేశారు. 'సెక్షన్ 90ఏ ప్రయోజనాల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఎ). సెంట్రల్ వాటర్ కమిషన్ సాంకేతిక సలహా కమిటీ ఆమోదించిన 2017–18 ధరలకు సవరించిన అంచనా వ్యయం రూ.55,548.87 కోట్లు సాయం చేయాలి. బి). పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు నీటిపారుదల భాగం అంతర్భాగంగా నీటి సరఫరా భాగాన్ని పరిగణించాలి. సి). ప్రాజెక్టు నిర్మాణానికి, ప్రాజెక్టు ద్వారా నిరాశ్రయులైన వారికి పునరావాసం నిమిత్తం ఖర్చులతో సహా కాంపొనెంట్ వారీగా అర్హతకు పరిమితం చేయకుండా రాష్ట్రం చేసిన వ్యయాన్ని తిరిగి చెల్లించాలి. ఏపీ ప్రభుత్వానికి రీయింబర్స్‌మెంట్ నెలరోజుల కంటే ఆలస్యం కారాదు' అని బిల్లులో పేర్కొన్నారు. ఇంకా వేగంగా అందించాలంటే ఆర్‌బీఐ నిర్వహించే ఎస్క్రో ఖాతా నుంచి రీయింబర్స్‌మెంట్ చేసేలా నిబంధన ఉండాలని చెప్పారు. ఈ ఖాతాలో సాంకేతిక కమిటీ ఆమోదించిన సవరించిన అంచానా మొత్తాన్ని కేంద్రం డిపాజిట్ చేయాలని ఆయన బిల్లులో కోరారు.

సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ■ 10-8-2024

దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎమ్) గా భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ సీనియర్ అధికారి **కె.పద్మజ** హైదరాబాద్ రైల్ నిలయంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. 1991 ఐఆర్‌టిఎస్ బ్యాచ్‌కు చెందిన పద్మజ ఎస్‌సిఆర్‌లో మొట్టమొదటి మహిళా పిసిసిఎమ్. 'ఇప్పుడంటే మహిళా అధికారులను అందరూ అంగీకరిస్తున్నారు కానీ, 30 ఏళ్ల క్రితం పురుష ఉద్యోగులు నా నుంచి ఆర్డర్స్ తీసుకోవడానికే ఇబ్బంది పడేవారు..' అంటూ నాటి విషయాలను చెబుతూనే, ఉద్యోగ జీవనంలో సవాళ్లను ఎదుర్కొన్న తీరు తెన్నులను 'సాక్షి'తో పంచుకున్నారు.


కె.పద్మజ

సవాళ్లే పట్టాలెక్కించేది

"సౌత్ సెంట్రల్ రైల్వేలో మొట్టమొదటి మహిళా ఆఫీసర్‌గా ఈ పోస్ట్‌లోకి రావడం చాలా సంతోషం అనిపించింది. ఇప్పుడంటే వర్క్‌ఫోర్స్‌లో చాలామంది అమ్మాయిలు వస్తున్నారు. కానీ, నేను జాయిన్ అయినప్పుడు ఒక్కదాన్నే ఉండేదాన్ని. కొత్తగా వర్క్‌లో చేరినప్పుడు ఒక తరహా స్ట్రెస్ ఉండేది. నన్ను నేను చాలా సమాధానపరుచుకునేదాన్ని. 'ఒక్కదాన్నే ఉన్నాను అని ఎందుకు అనుకోవాలి.. ఎవరో ఒకరు రూట్ వేస్తేనే ఆ తర్వాత వచ్చే మహిళలకు మార్గం సులువు అవుతుంది కదా' అనుకునేదాన్ని.

ఎదుర్కొన్న సవాళ్లు

మొదట్లో డివిజనల్ ఆఫీస్ మేనేజర్‌గా జాయిన్ అయినప్పుడు ఒక మహిళను అధికారిగా అంగీకరించడానికి సహోద్యోగులకే కష్టంగా ఉండేది. నేను మొదటిసారి ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లినప్పుడు స్టేషన్ మాస్టర్‌కి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. మొదట వాళ్లు నమ్మలేదు. ఆఫీసుకు ఫోన్ చేసి 'ఇక్కడెవరో లేడీ వచ్చారు. ఆవిడేమో నేను డివిజనల్ ఆఫీస్ మేనేజర్‌ని అంటోంది, ఏమిటిది?' అని అడిగారు. మా కొలీగ్ 'ఆవిడ కూడా నాలాగే ఆఫీసర్' అంటే అప్పుడు వాళ్లు అంగీకరించక తప్పలేదు. ఆ స్టేజ్ నుంచి ఇక్కడకు రావడానికి చాలా సవాళ్లు ఉన్నాయి. మొదట్లో గుర్తించిన మరో విషయం ఏంటంటే తోటి ఉద్యోగులు చాలామంది నా నుంచి ఆర్డర్స్ తీసుకోవడానికే ఇబ్బంది పడేవారు. దీంతో 'నేను ఎక్స్‌పర్ట్ అయితేనే ఈ అసమానతను తొలగించగలను' అనుకున్నాను. అందుకు, నా పనిని ఎప్పుడూ ముందు చేసినదానికన్నా బెటర్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చాను. పనిచేసే చోట రూల్స్ పరంగా అన్నీ క్లియర్‌గా ఉంటాయి. అయితే, మనతో ఉండే కొలీగ్స్, సీనియర్స్ విషయంలో వారి ప్రవర్తనలో తేడాలు కనిపిస్తుంటాయి. 'ఇంత సమర్థంగా చేస్తున్నా కూడా ఇంకా వివక్షతోనే చూస్తున్నారే..' అని అనిపించేది. ఇంటినుంచి బయటకు వచ్చినప్పుడు వీటన్నింటినీ ఎదుర్కోకతప్పదు అన్నట్టుగా ఉండేవి ఆ రోజులు. ఇప్పటి తరంలో ఈ ఆలోచన పూర్తిగా మారిపోయింది. అయితే, ఏదీ అంత సులువైనది కాదు, కష్టమైన జర్నీయే. కానీ, నిన్నటి కన్నా ఈ రోజు బెటర్‌గా మార్చుకుంటూ రావడమే నన్ను ఇలా ఒక ఉన్నత స్థానంలో మీ ముందుంచ గలిగింది.

కుటుంబ మద్దతు

ట్రెయిన్స్‌కు సంబంధించిన సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాలు, ప్రమాదాలు.. వంటి సమయాల్లో నైట్ డ్యూటీస్ కూడా తప్పనిసరి. నిరంతరాయంగా పని చేస్తూనే ఉండాలి. మా పని ఈ కొద్ది గంటలు మాత్రమే అన్నట్టు ఏమీ ఉండదు. 24/7 ఏ సమయంలోనైనా డ్యూటీలో ఉండాల్సిందే. మా పేరెంట్స్, కుటుంబ సభ్యులందరూ నా బాధ్యతలను, పని ఒత్తిడిని అర్థం చేసుకొని, పూర్తి మద్దతుని, సహకారాన్ని ఇవ్వడం వల్ల నేను నిశ్చింతగా నా పనులు చేసుకోగలిగాను.

ముఖ్యమైనవి వదులుకోవద్దు

పిల్లల చిన్నప్పుడు మాత్రం తీరిక దొరికేది కాదు. ఉద్యోగం, ఇల్లు, వేడుకలు.. వీటన్నింటిలో కొన్ని త్యాగాలు చేయక తప్పలేదు. వాటిని మనం అంగీకరించాల్సిందే. అయితే, ముఖ్యమైన వాటిని వదిలేదాన్ని కాదు. నాకు ఇద్దరు కూతుళ్లు. ఇప్పుడు వాళ్లు వర్కింగ్ ఉమెన్. డ్యూటీ చూసుకుంటూనే పిల్లల పేరెంట్ టీచర్ మీట్, స్పోర్ట్స్ మీట్, స్కూల్ ఈవెంట్స్.. తప్పనిసరి అనుకున్నవి ఏవీ మిస్ అయ్యేదాన్ని కాదు. ఆఫీస్ పని వల్ల ఇంట్లో ముఖ్యమైన వాటిని వదులుకున్నాను ... అనుకునే సందర్భాలు రాకూడదు అనుకునేదాన్ని. ఉద్యోగంలో చేరిన కొత్తలో ఊపిరి సలుపుకోనివ్వనంతగా పనులు చేస్తున్నాను అనే ఫీలింగ్ ఉండేది. అయితే, వర్క్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టిన తర్వాత అన్నీ సులువుగా బ్యాలన్స్ చేసుకోగలిగాను. మా నాన్నగారు ఐఎఎస్ ఆఫీసర్ కావడంతో తరచు బదిలీలు ఉండేవి. మా అమ్మానాన్నలు ఎంతో బిజీగా ఉండి కూడా మాతో ఎలా ఉండేవారో తెలుసు కాబట్టి, నేనే సరైన టైమ్ ప్లానింగ్ చేసుకోవాలి అనుకున్నాను. ఏదైనా పనికి గంట సమయం కుదరకపోతే అర గంటలోనైనా పూర్తి చేయాలి. ప్లానింగ్ మన చేతుల్లో ఉన్నప్పుడు దేనినీ వదులుకోవాల్సిన అవసరం లేదు. నాకు బుక్స్ చదవడం చాలా ఇష్టం. ఇప్పటికీ రోజూ కొంతసమయం బుక్స్‌కి కేటాయిస్తాను. అలాగే, మొక్కల పెంపకం పట్ల శ్రద్ధ తీసుకుంటాను.

పాజిటివ్ ఆలోచనలు మేలు..

ముందుగా మహిళ ఇతరుల మెదళ్ల నుంచి ఆలోచించడం మానేయాలి. వాళ్లేం అనుకుంటారో, వీళ్లేం అంటారో... అనే ఆలోచన మన జీవితాన్ని నరక మయం చేస్తుంది. కెరియర్ మొదట్లోనే మన కల పట్ల స్పష్టత ఉండాలి. ఎన్ని సమస్యలు వస్తున్నా మనకంటూ ఒక స్పష్టమైన దారిని ఎంచుకోవాలి. సగం జీవితం అయిపోయాకనో, పిల్లలు పెద్దయ్యాక చూద్దాంలే అనో అనుకోవద్దు. ముందుగా అన్ని రకాలుగా స్థిరత్వం ఉండేలా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలి. సమస్యలు వచ్చేదే మనల్ని ధైర్యంగా ఉంచడానికి అనుకోవాలి. మనకు ఏం కావాలో స్పష్టత ఉంటే బ్యాలెన్స్ చేసుకోవడం సులువు అవుతుంది" అంటూ సొంతంగా వేసుకున్న దారుల గురించి వివరించారు ఈ ఆఫీసర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో: నోముల రాజేష్‌రెడ్డి

హెల్దీ డైట్
హై ప్రొటీన్ ఆమ్లెట్ రోల్ అప్



కావలసినవి: పాలకూర– కప్పు; వెల్లుల్లి రేక – 1; శనగపిండి – టీ స్పూన్; కోడి గుడ్లు – 2; టొమాటో –1 (తరగాలి); ఉల్లి పాయ– 1 (తరగాలి); పచ్చిమిర్చి–1 (తరగాలి); కొత్తిమీర తరుగు– టేబుల్ స్పూన్; చీజ్– పావు కప్పు; నీరు – పావు కప్పు; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● పాలకూరను కడిగి నీరు పోయే వరకు ఆరనివ్వాలి. మిక్సీజార్‌లో పాలకూర, వెల్లుల్లి, శనగపిండి, నీరు, కొద్దిగా ఉప్పు వేసి గ్రైండ్ చేసి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో కోడిగుడ్ల సొన, టొమాటో ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, కొత్తిమీర, మిగిలిన ఉప్పు, చీజ్ వేసి బీటర్‌తో నురగ వచ్చే వరకు చిలకాలి ● పెనం వేడి చేసి నూనె వేసి కోడిగుడ్డు సొన మిశ్రమాన్ని పోయాలి. ఆమ్లెట్ ఒక మోస్తరుగా కాలిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి పెట్టుకున్న పాలకూర మిశ్రమాన్ని ఆమ్లెట్ మీద పోసి మూత పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. కాలిన తర్వాత తిరగేసి ఆమ్లెట్‌ను రోల్ చేయాలి. ఈ రోల్‌ను చిన్న ముక్కలు చేసి సర్వ్ చేయాలి.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు: కేలరీలు– 250; ప్రొటీన్– 20 గ్రాములు; కార్బోహైడ్రేట్‌లు – 12 గ్రాములు; ఫ్యాట్ – 15 గ్రాములు; ఫైబర్ – 4 గ్రాములు; కొలెస్ట్రాల్– 240 మిల్లీగ్రాములు; సోడియం– 500 మిల్లీగ్రాములు; విటమిన్ ఏ– 40శాతం డీవీ; విటమిన్ సీ– 25 శాతం డీవీ; క్యాల్షియం– 15 శాతం డీవీ; ఐరన్– 14 శాతం డీవీ

గమనిక: డీవీ అంటే డైలీ వాల్యూ. ఒకరోజులో దేహానికి అందాల్సిన సంబంధిత పోషకంలో ఈ పదార్థం ద్వారా అందే విలువ ఎంతో తెలియచేసే విధానం.



లూయిా @ 112
ఆరోగ్యమే ఆనందం

వందేళ్ల వనిత కాదామె. మరో పుష్కరకాలాన్ని కూడా చూసిన మహిళ. అత్యంత ఎక్కువ వయసున్న నగర నివాసిగా న్యూయార్క్ నగరం ఆమెను గుర్తించింది, గౌరవించింది. ఆమె పేరు లూయిా జీన్ సిగ్నోర్.

లూయిా జీన్ సిగ్నోర్ 1912లో న్యూయార్క్ నగరానికి సమీపంలోని హార్లెమ్‌లో పుట్టారు. నాలుగు దశాబ్దాల పాటు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టేషన్ అథారిటీలో ఉద్యోగం చేశారు. ఇటలీ నుంచి వచ్చి అమెరికాలో స్థిర పడిన కుటుంబం వారిది. ఇటాలియన్ అమెరికన్ ఆమె. వార్ధక్యం తప్ప ఎటువంటి అనారోగ్యమూ లేకుండా ఆరోగ్యంగా జీవించడానికి కారణం ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడమేనంటారు లూయిా. ఎవరి ఆరోగ్యం గురించి పట్టించుకోవాల్సింది వారే. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు పట్టించుకోవాలని ఎదురు చూడకూడదు. అలాగని ఒంటరిగా జీవించడంలో నిరుత్సాహ పడకూడదు. ఇందుకు లూయిా జీన్ సిగ్నోరే ఉదాహరణ.

బాగా నిద్రపోతాను!

"ఇది నా దేహం. నా దేహానికి ఏం కావాలో నాకు తెలుసు. నా దేహం పట్ల నాకు తగినంత శ్రద్ధ ఉంది. నేనేమి తినాలో, ఎలా తినాలో మరొకరు చెప్పాల్సిన అవసరం లేదు. రుచికరమైన ఇటాలియన్ ఫుడ్‌ని ఇష్టంగా తింటాను. ఎంతసేపు నిద్రపోవాలనిపిస్తే అంత సమయం నిద్రపోతాను. అయితే ఆహారం ఎక్కువ మోతాదు తీసుకోను. మితంగా తింటాను. గుడ్లు, బ్రెడ్, జామ్, టీ ఇష్టం. కాఫీ ఇష్టంలేదు. అసలే తాగను. టీవీ చూడడం, కాలనీలో పిల్లలు ఆడుకుంటూ ఉంటే చూడడం ఇష్టం. నా మేనల్లుడు, పొరుగింటి వారి మధ్య 112వ పుట్టినరోజు జరుపుకున్నాను" అన్నారామె న్యూయార్క్ మీడియాతో మాట్లాడుతూ.

వందేళ్లుగా... సింగిల్‌గా!

తల్లిదండ్రుల సంరక్షణ నుంచి బయటకు వచ్చి సొంతంగా తనను తాను పోషించుకోవడం మొదలు పెట్టినప్పటి నుంచి ఆమె జీవితంలో వందేళ్లపాటు ఒంటరిగానే జీవించారు. పెళ్లి, పిల్లలు లేకపోవడం వల్లనే ఆమె ఇన్నేళ్లపాటు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలిగారని చమత్కారంగా అన్నప్పటికీ అందులో వాస్తవం ఉందంటున్నారు ఆరోగ్య, మానసిక నిపుణులు. ఇదే మాట ఆమెతో అంటే... 'ఎప్పుడైతే పెళ్లి చేసుకుంటారో అప్పుడే సమస్యల్లో పడతారు' అంటారు నవ్వుతూ.

సినిమా



హీరో సూర్యకు గాయం

హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య, జ్యోతిక, కార్తీక్ సుబ్బరాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఊటీలో జరుగుతోందని కోలీవుడ్ టాక్. అక్కడ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించే సమయంలో సూర్య తలకు గాయం అయిందనే వార్తలు వచ్చాయి. దీంతో సూర్యకు ఏమైందోనని ఆయన అభిమానులు కంగారుపడ్డారు. అయితే అది చిన్న గాయమేనని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సూర్య అన్న బాగానే ఉన్నారని ఈ చిత్రం సహ–నిర్మాతల్లో ఒకరైన రాజశేఖర్ పాండియన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. దీంతో సూర్య అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.


● అజిత్

స్టైలిష్ యాక్షన్

అజిత్ కుమార్ హీరోగా నటిస్తున్న ద్విభాషా చిత్రం (తెలుగు, తమిళ్) 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. "స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న మూవీ ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ కీలకమైన షెడ్యూల్‌లో అజిత్‌తో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి అనూహ్యమైన స్పందన వచ్చింది. 2025 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం" అని చిత్రబృందం పేర్కొంది.



● ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్

ఎన్టీఆర్‌నీల్ ఆరంభం

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ ఎలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. శుక్రవారం 'ఎన్టీఆర్‌నీల్' సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు ఎన్టీఆర్. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. "ప్రేక్షకుల అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రంతో ప్రేక్షకులు ఓ సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పొందుతారు" అని చిత్రబృందం పేర్కొంది. ఇక ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభం అవుతుందని, 1969 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, కెమెరా: భువన్ గౌడ.

తల్లి మనసు ప్రారంభం


● అనంత కిశోర్, శ్రీనివాస్, సాత్విక్, సాహిత్య, ముత్యాల సుబ్బయ్య

ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మాతగా అడుగు పెట్టారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏషియన్ గ్రూప్ ఎమ్‌డీ భరత్ నారంగ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత పోకూరి బాబురావు క్లాప్ కొట్టారు. నటుడు బ్రహ్మానందం, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు పాల్గొని, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ– "'తల్లి మనసు' టైటిల్‌ని బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి కథో అర్థం అవుతుంది. మా అబ్బాయి అభిరుచి వల్లే ఈ బ్యానర్ ఆరంభించాం" అన్నారు. "ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది" అని చెప్పారు వి. శ్రీనివాస్ (సిప్పీ). "నవంబర్ లేదా డిసెంబర్‌లో ఈ చిత్రం విడుదల చేస్తాం" అని ముత్యాల అనంత కిశోర్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కోటి, కెమెరా: ఎన్. సుధాకర్ రెడ్డి.



ఆ ఈలలు అమితానందాన్నిచ్చాయి - భాగ్యశ్రీ బోర్సే

"నటి అవ్వాలనుకున్నప్పుడు భవిష్యత్ ఎలా ఉంటుందా అనిపించింది. దీనికి తోడు కొందరు కెరీర్‌లో వేగంగా ముందుకు వెళ్తుంటారు. వారిలా అవకాశాలు నాకు ఎప్పుడు వస్తాయా? అనే ఆలోచన కూడా ఉండేది. అయితే 'మిస్టర్ బచ్చన్' ట్రైలర్ లాంచ్ వేడుకలో నేను వేదికపైకి రాగానే ప్రేక్షకులు చేసిన హంగామా, ఈలలు చూసి నాకు అమితానందం కలిగింది. ఆ సమయంలో నాకు కన్నీళ్లొచ్చాయి (ఆనందంతో..)" అన్నారు భాగ్యశ్రీ బోర్సే. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే పరిచయం అవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్ల సమావేశంలో భాగ్యశ్రీ బోర్సే చెప్పిన సంగతులు.

● నా స్వస్థలం మహారాష్ట్రలోని ఔరంగాబాద్. మా నాన్నగారి ఉద్యోగ రీత్యా నైజీరియాలోని లాగోస్‌కు షిఫ్ట్ అయ్యాం. నా స్కూలింగ్ అంతా అక్కడే జరిగింది. బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ కోసం ముంబై వచ్చాను. గ్రాడ్యుయేషన్‌లో ఉండగానే మోడలింగ్ చేయమని నన్ను చాలామంది ప్రోత్సహించడంతో ట్రై చేద్దామనుకున్నాను. ఈ ఫీల్డ్ నాకు బాగా నచ్చింది. మెల్లిగా కెమెరా భయం కూడా పోయింది. ఆ తర్వాత కొన్ని కమర్షియల్ యాడ్స్ చేశాను ● 'మిస్టర్ బచ్చన్'లో తెలుగు మార్వాడీ అమ్మాయి జిక్కీ పాత్రలో కనిపిస్తాను. కథలో జిక్కీ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంది. మిస్టర్ బచ్చన్ (రవితేజ పాత్ర)ను మోటివేట్ చేసేలా నా రోల్ ఉంటుంది. అయినా మహిళలు లేకుండా ఏ కథ పూర్తి కాదని నా అభిప్రాయం. తెలుగు భాష మీద పట్టు సాధించి, జిక్కీ పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతానని హరీష్ శంకర్‌గారిని అడిగితే ఆయన ప్రోత్సహించారు ● హీరోగా రవితేజగారికి చాలా అనుభవం ఉంది. కానీ ఆయన ఓ కొత్త నటుడిగా సెట్స్‌లో కష్టపడతారు. పీపుల్ మీడియా వంటి ప్రముఖ సంస్థ ద్వారా హీరోయిన్‌గా పరిచయం అవుతుండటం సంతోషంగా ఉంది. నాకు డ్యాన్స్ బ్యాగ్రౌండ్ లేదు. కానీ ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పుల్', 'సితార' పాటలకు మంచి స్పందన లభిస్తుండటం సంతోషాన్నిచ్చింది. ఇక నా నెక్స్ట్ మూవీస్ గురించి త్వరలో చెబుతాను.

ఈసారి తెలుగమ్మాయిని పరిచయం చేస్తున్నాను - వైవీఎస్ చౌదరి


● వైవీఎస్ చౌదరి, వీణా రావు, గీత

"నేను పరిచయం చేసిన ఎంతోమంది హీరోయిన్లు స్టార్స్‌గా వెలిగారు. అయితే ఇందులో చాలా మంది ముంబై నుంచి వచ్చిన వారే. ఈసారి మన తెలుగమ్మాయిని హీరోయిన్‌గా పరిచయం చేయాలని వీణా రావుని ఎంచుకున్నా. ఈ మూవీలో అతిరథ మహారథులు ఇంకెందరో ఉంటారు. అలాగే కొత్త వారికి కూడా అవకాశం ఇస్తున్నాం" అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. దివంగత హరికృష్ణ కుమారుడు, దివంగత జానకి రామ్ (ఎన్టీఆర్ సోదరుడు) తనయుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ వైవీఎస్ చౌదరి ఇటీవల ఓ సినిమాని ప్రకటించారు. న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత ఈ సినిమాని నిర్మించనున్నారు. కాగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వీణా రావుని పరిచయం చేశారు వైవీఎస్ చౌదరి. అనంతరం ఆయన మాట్లాడుతూ– "మహేశ్‌బాబుగారి బర్త్ డే (ఆగస్టు 9) సందర్భంగా మా సినిమా కార్యక్రమం జరుపుకోవడం హ్యాపీ. ఈ మూవీకి కీరవాణిగారు సంగీతం అందించనుండటం నా అదృష్టం. సాయి మాధవ్ బుర్రా మాటలు, చంద్రబోస్‌గారి పాటలు మహాద్భుతంగా ఉండనున్నాయి" అన్నారు. "వైవీఎస్ చౌదరి, కీరవాణి, చంద్రబోస్ వంటి మహామహులతో పనిచేసే అవకాశం ఇచ్చిన గీతగారికి ధన్యవాదాలు" అని డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా చెప్పారు.

సస్పెన్స్ డీల్


● ధరణి, హను కోట్ల, చందన

హను కోట్ల లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ది డీల్'. అనితా రావు సమర్పణలో పద్మా రమాకాంత రావు, కొల్వి రామకృష్ణ ఈ సినిమాను నిర్మించారు. ధరణి ప్రియ, చందన హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'ది డీల్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ– "నటన, దర్శకత్వంపై మంచి అవగాహన ఉన్న హను కోట్ల 'ది డీల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడం హ్యాపీ. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా విజయం సాధించాలి" అన్నారు. "ఓ డిఫరెంట్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను... ఆదరించాలి" అని తెలిపారు హను కోట్ల. నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్, రచయిత సాయిమాధవ్ బుర్రా, డిజిక్వెస్ట్ ఇండియా లిమిటెడ్ ఎమ్‌డీ కె.బసిరెడ్డి మాట్లాడారు.

నెత్తుటితో రాసిన ప్రేమకథ


● ఎస్ఎస్ సైదులు, భ్రమరాంబిక

ఎస్ఎస్ సైదులు హీరోగా, భ్రమరాంబిక అర్పిత హీరోయిన్‌గా నటించిన ద్విభాషా చిత్రం (తెలుగు, బంజారా) '1980లో రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌కి నిర్మాతలు రామ్ తాళ్లూరి, బెక్కం వేణుగోపాల్, నటులు సోహైల్, ఆటో రామ్‌ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. "కృష్ణలంక... ఇక్కడ పుట్టే కులాన్ని బట్టి రాతలు రాయబడే ప్రాంతం. బతుకు బాగు కోసం ఎన్నో విప్లవ గేయాలు పాడిన గొంతులు మూగబోయిన ప్రాంతం, ఇది రాధాకృష్ణుల ప్రేమకావ్యాన్ని నెత్తురుతో లిఖించబడ్డ ప్రాంతం" అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఎస్ఎస్ సైదులు మాట్లాడుతూ– "మంచి కథతో తీసిన మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం" అన్నారు. "తనికెళ్లభరణిగారి వాయిస్‌తో మా సినిమాకు ఒక కొత్త ఫీల్ వచ్చింది" అన్నారు ఇస్మాయిల్. "1980 కి తగ్గట్లుగా ఈ సినిమాను ఇస్మాయిల్‌గారు తీశారు" అని పేర్కొన్నారు ఊడుగు సుధాకర్.



ముగింపు వేడుకల్లో భారత బృందానికి పతాకధారిగా హాకీ జట్టు గోల్‌కీపర్ శ్రీజేశ్

పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో పాల్గొనే భారత బృందానికి పురుషుల విభాగం నుంచి హాకీ జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ పతాకధారిగా వ్యవహరిస్తాడు. రజత పతకం నెగ్గిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాను పతాకధారిగా ఎంపిక చేయాలని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) భావించింది. ఈ విషయంపై నీరజ్‌తో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష చర్చించింది. అయితే అంతర్జాతీయ హాకీ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించిన శ్రీజేశ్ ఈ గౌరవానికి అర్హుడని, అతనికే ఈ బాధ్యతలు ఇవ్వాలని నీరజ్ అభిప్రాయపడ్డాడు. దాంతో ఐఓఏ శ్రీజేశ్‌కు అవకాశం ఇచ్చింది. గురువారం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు 2-1తో స్పెయిన్‌పై గెలిచి వరుసగా రెండో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ ఒలింపిక్స్‌లోనూ భారత విజయాల్లో శ్రీజేశ్ కీలకపాత్ర పోషించాడు. ఇంతకుముందే మహిళల విభాగం నుంచి భారత షూటర్ మనూ భాకర్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. ఆదివారంతో పారిస్ ఒలింపిక్స్ ముగియనున్నాయి. ప్రారంభ వేడుకల్లో టీటీ స్టార్ ఆచంట శరత్ కమల్, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఫ్లాగ్ బేరర్స్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

బ్రేక్ డ్యాన్స్‌లో 'ఇండియా' జోరు





విశ్వక్రీడల్లో తొలిసారి ప్రవేశపెట్టిన బ్రేక్ డ్యాన్స్ (బ్రేకింగ్) ఈవెంట్‌లో ఇండియా జోరు సాగుతోంది. అదేంటి ఈ విభాగంలో భారత్ నుంచి ఒక్క డాన్సర్ కూడా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేదు కదా అని అనుకుంటున్నారా.. ఇండియా అంటే భారత్ అనుకుంటే మీరు పొరబడినట్లే. నెదర్లాండ్స్‌కు చెందిన 16 ఏళ్ల యువ డాన్సర్ ఇండియా సర్జో... 'పారిస్' క్రీడల్లో తాను పోటీపడుతున్న నాలుగు విభాగాల్లోనూ సెమీ ఫైనల్‌కు చేరింది. సాధారణంగా బ్రేక్ డ్యాన్స్‌లో పాల్గొనే డాన్సర్లు 'బి' గర్ల్స్, 'బి' బాయ్స్ అని ఆసక్తికర పేర్లు వినియోగిస్తారు. కానీ 16 ఏళ్ల సర్జో మాత్రం తన అసలు పేరుతోనే పోటీల్లో దిగింది. 'బి-గర్ల్' పేరు ఎందుకు పెట్టుకోలేదని చాలా మంది అడుగుతున్నారు. కానీ చిన్నప్పటి నుంచి నాకు అలాంటి ప్రత్యేకమైన పేరు ఎవరూ పెట్టలేదు. అందుకే ఇండియా పేరుతోనే బరిలోకి దిగుతున్నా' అని సర్జో వెల్లడించింది.

ప్రపంచ రికార్డు... పసిడి పతకం

400 మీటర్ల హర్డిల్స్‌లో అమెరికా మహిళా అథ్లెట్ సిడ్నీ మెక్లాఫ్లిన్ ఘనత



పారిస్: ఒలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌ను ప్రవేశపెట్టి 40 ఏళ్లయ్యాయి. అయితే ఇప్పటి వరకు ఈ విభాగంలో ఏ అథ్లెట్ వరుసగా రెండు స్వర్ణాలు సాధించలేదు. కానీ 'పారిస్'లో అమెరికా క్రీడాకారిణి సిడ్నీ మెక్లాఫ్లిన్ లెవ్రోన్ ఈ ఘనత సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం గెలిచిన సిడ్నీ మెక్లాఫ్లిన్ అదే ఫలితాన్ని పారిస్‌లో పునరావృతం చేసింది. ఈసారి ఏకంగా కొత్త ప్రపంచ, ఒలింపిక్ రికార్డులను కూడా సృష్టించింది. శుక్రవారం జరిగిన 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 25 ఏళ్ల సిడ్నీ 50.37 సెకన్లలో పూర్తి చేసి కొత్త ప్రపంచ, ఒలింపిక్ రికార్డులను నెలకొల్పింది. ఈ ఏడాది జూన్ 30న 50.65 సెకన్లతో తానే సాధించిన ప్రపంచ రికార్డును సిడ్నీ తిరగరాసింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సిడ్నీ 51.46 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకం నెగ్గింది. ఈ సమయాన్ని కూడా ఆమె 'పారిస్'లో అధిగమించింది. ఓవరాల్‌గా ఇప్పటి వరకు ఈ విభాగంలో సిడ్నీ మెక్లాఫ్లిన్ ఐదుసార్లు కొత్త ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది.

అమ్మకిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు


- 200 మీటర్ల స్ప్రింట్ విజేత లెట్సిల్ టెబోగో
- బోట్స్‌వానా చరిత్రలో తొలి ఒలింపిక్ స్వర్ణం
- నోవా లైల్స్‌కు కాంస్యం





పారిస్: ఒలింపిక్స్ అథ్లెటిక్స్ విభాగంలో ఆసక్తికర ఈవెంట్‌లలో ఒకటైన పురుషుల 200 మీటర్ల పరుగులో కొత్త చాంపియన్ అవతరించాడు. బోట్స్‌వానాకు చెందిన లెట్సిల్ టెబోగో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 21 ఏళ్ల టెబోగో 19.46 సెకన్లలో పరుగు పూర్తి చేశాడు. టోక్యోలో రజతం సాధించిన బెడ్‌నారెక్ (అమెరికా; 19.62 సెకన్లు) ఈసారి కూడా రజతంతో సరి పెట్టుకున్నాడు. 100 మీటర్ల పరుగు విజేత అయిన మరో అమెరికా అథ్లెట్ నోవా లైల్స్‌కు (19.70 సెకన్లు) కాంస్యం దక్కింది. గత ఒలింపిక్స్‌లోనూ లైల్స్‌కు కాంస్యమే లభించింది. కోవిడ్‌తో బాధపడుతూనే బరిలోకి దిగిన లైల్స్ అంచనాలకు తగినట్లుగా రాణించలేకపోయాడు.

ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికాకు పొరుగున బోట్స్‌వానా ఉంది. 26 లక్షల జనాభా కలిగిన ఈ దేశ చరిత్రలో ఇదే తొలి ఒలింపిక్ స్వర్ణ పతకం కావడం విశేషం. గత ఏడాది బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో టెబోగో 100 మీటర్లలో రజతం, 200 మీటర్ల పరుగులో కాంస్యం సాధించాడు. అతని కెరీర్ ఎదుగుదలలో తల్లి ఎలిజబెత్ సెరాతివా పాత్ర ఎంతో ఉంది. అయితే అతను ఒలింపిక్ సన్నాహాల్లో ఉన్న సమయంలో 44 ఏళ్ల వయసులో ఆమె బ్రెస్ట్ క్యాన్సర్‌తో మరణించింది. తన చేతి వేలి గోర్లపై తల్లి పేరు రాసుకొని అతను రేస్‌లో పాల్గొన్నాడు. పరుగు పూర్తి కాగానే జాతీయ పతాకాన్ని ఒంటిపై కప్పుకున్న టెబోగో భుజాలపై తన రెండు షూస్ వేసుకొని భావోద్వేగంతో కన్నీళ్ల పర్యంతమయ్యాడు. అందులో ఒక షూను తీసి అతను కెమెరాకు చూపించాడు. దానిపై అతని తల్లి పేరు, పుట్టిన తేదీ రాసి ఉన్నాయి. ప్రేక్షక సమూహంలో ఉన్న అతని చెల్లెలు కూడా అన్న ప్రదర్శనకు జేజేలు పలకింది. 'నేను ఒలింపిక్ పతకం గెలవాలని ఆమె ఎంతో కోరుకుంది' అని టెబోగో చెప్పాడు. మరోవైపు టెబోగో విజయంతో బోట్స్‌వానా దేశంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ విజయంపై ప్రజలంతా సంబరాలు చేసుకోవాలంటూ దేశాధ్యక్షుడు మాగ్‌వీట్సీ మసీసీ శుక్రవారం 'హాఫ్ డే' సెలవు ప్రకటించడం విశేషం.



'నేను పెట్టుకున్న లక్ష్యం సాధిస్తాను. భవిష్యత్తులో జావెలిన్‌ను సుదూరం విసరగలుగుతాననే నమ్మకముంది. అదే పనిగా శ్రమిస్తా. కఠోరంగా సాధన చేస్తా. చివరకు దీన్ని సాధించేదాకా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటా' – నీరజ్



నదీమ్‌కు 10 కోట్ల నజరానా

కరాచీ: దాతల విరాళంతో జావెలిన్‌ను కొనుగోలు చేసి పారిస్‌లో పసిడి పతకం సాధించిన పాకిస్తాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ పంట పండింది. పంజాబ్ ప్రావిన్స్ రాష్ట్రం ముఖ్యమంత్రి మరియం నవాజ్ (మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె) ఒలింపిక్ చాంపియన్‌కు పాకిస్తాన్ కరెన్సీలో రూ. 10 కోట్లు (భారత కరెన్సీలో రూ. 3 కోట్లు) నజరానా ప్రకటించారు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	32	25	20	77
2	అమెరికా	31	39	38	108
3	ఆస్ట్రేలియా	18	16	14	48
4	ఫ్రాన్స్	14	20	22	56
5	బ్రిటన్	14	20	22	56
6	జపాన్	14	8	13	35
7	దక్షిణ కొరియా	13	8	7	28
8	నెదర్లాండ్స్	12	6	9	27
9	ఇటలీ	11	11	11	33
66	భారత్	0	1	5	6

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

అమన్ కంచు పట్టు



కాంస్య పతకం గెలిచిన భారత రెజ్లర్

57 కేజీల విభాగంలో మూడో స్థానం | ప్లే ఆఫ్ బౌట్‌లో ప్యూర్టోరికో రెజ్లర్‌పై 13-5తో విజయం

కుస్తీ క్రీడలో బీజింగ్ ఒలింపిక్స్ నుంచి మొదలైన భారత 'పట్టు' పారిస్ ఒలింపిక్స్‌లోనూ కొనసాగింది. వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ క్రీడాంశంలో భారత్‌కు పతకం లభించింది. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో ఈసారి భారత్ నుంచి అమన్ సెహ్రావత్ రూపంలో ఒక్కడే అర్హత సాధించాడు. ఆ ఒక్కడే పతక వీరుడయ్యాడు. 57 కేజీల విభాగంలో పోటీపడ్డ అమన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో 57 కేజీల విభాగంలోనే భారత్‌కు రజత పతకం అందించిన రవి దహియాను జాతీయ ట్రయల్స్‌లో ఓడించిన అమన్ తనలో ఒలింపిక్ పతకం తెచ్చే సత్తా ఉందని తాజా ప్రదర్శనతో నిరూపించాడు. అమన్ కాంస్యంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో ఆరో పతకం చేరింది.

పారిస్: అంచనాలకు అనుగుణంగా రాణించిన భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో అమన్ 13-5 పాయింట్ల తేడాతో డారియన్ టోయ్ క్రూజ్ (ప్యూర్టోరికో)పై విజయం సాధించాడు. అండర్-23 విభాగంలో ప్రపంచ చాంపియన్ అయిన 21 ఏళ్ల అమన్ భారత్ నుంచి పురుషుల విభాగంలో ఒక్కడే ప్రాతినిధ్యం వహించాడు. డారియన్‌తో జరిగిన కాంస్య పతక బౌట్ ఆరంభంలో హోరాహోరీగా సాగింది. ఒకదశలో 2-3తో వెనుకబడ్డ అమన్ నెమ్మదిగా తన పట్టు ప్రదర్శించాడు. మూడు నిమిషాల నిడివిగల తొలి భాగం ముగిసేసరికి అమన్ 6-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. రెండో భాగంలోనూ అమన్ నేర్పుతో పోరాడాడు. మొదట్లో రెండు పాయింట్లు కోల్పోయినా... వెంటనే తేరుకొని పొరపాట్లకు తావివ్వకుండా వ్యూహాత్మకంగా ఆడాడు. ఈ క్రమంలో దూకుడు పెంచి డారియన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి వరుసగా 2,2,2,1 పాయింట్లు సాధించి 13-5తో ఆధిక్యంలోకి వెళ్లి విజయంతోపాటు కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు.

7 ఒలింపిక్స్ క్రీడల్లో పతకం సాధించిన ఏడో భారతీయ రెజ్లర్‌గా అమన్ గుర్తింపు పొందాడు. గతంలో ఖాషాబా జాదవ్ (1952 హెల్సింకి: కాంస్యం), సుశీల్ కుమార్ (2008 బీజింగ్: కాంస్యం... 2012 లండన్: రజతం), యోగేశ్వర్ దత్ (2012 లండన్: కాంస్యం), సాక్షి మలిక్ (2016 రియో: కాంస్యం), రవి దహియా (2020 టోక్యో: రజతం), బజరంగ్ పూనియా (2020 టోక్యో: కాంస్యం) ఈ ఘనత సాధించారు.

అనాథగా వచ్చి అద్భుతం చేసి...

స్ఫూర్తిదాయకం అమన్ ప్రస్థానం



'గెలవడం అనేది నిజంగా అంత సులువే అయితే అందరూ అదే చేసేవాళ్లు'... ఢిల్లీలోని ప్రతిష్టాత్మక రెజ్లింగ్ శిక్షణా కేంద్రం 'ఛత్రశాల్'లో అమన్ సెహ్రావత్ గదిలో అతని మంచం పక్కన చేతి రాతతో రాసుకున్న ఈ క్యాప్షన్ కనిపిస్తుంది. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినప్పుడు 'క్వాలిఫైడ్ అథ్లెట్' అంటూ ఇచ్చిన సర్టిఫికెట్ కూడా మరో పక్కన ఉంటుంది. ఒలింపిక్స్ ఐదు రింగులతో పాటు పతకం చిత్రాన్ని కూడా అక్కడ అతను అంటించుకున్నాడు. ఇప్పుడు అక్కడ బొమ్మ మాత్రమే కాదు అసలు ఒలింపిక్ పతకమే వేలాడనుంది! ఈ మెగా ఈవెంట్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగిన 21 ఏళ్ల అమన్ తన తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. భారత్ తరఫున అన్ని కేటగిరీలు కలిపి పురుషుల విభాగంలో బరిలోకి దిగిన ఒకే ఒక్కడు ఇప్పుడు కాంస్యంతో మెరిశాడు. ఛత్రశాల్ సెంటర్‌లో యువ రెజ్లర్లకు స్ఫూర్తినివ్వడం కోసం దేశానికి కీర్తిని తెచ్చిన రెజ్లర్ల ఫొటోలను పెట్టారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన సుశీల్ కుమార్, బజరంగ్ పూనియా, యోగేశ్వర్ దత్, రవి దహియాలతో పాటు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన అతి పిన్న వయస్కుడైన అమిత్ దహియా ఫొటో కూడా ఉంటుంది. ప్రతీ రోజూ ప్రాక్టీస్ కోసం అక్కడి నుంచే నడిచే అమన్ తన గురించి కూడా కలకన్నాడు. అతను ఢిల్లీ చేరేసరికి అతని ఫొటో కూడా సిద్ధమైపోతుందేమో!

తల్లిదండ్రులను కోల్పోయి...

హరియాణాలోని బిరోహర్‌కు చెందిన అమన్ తొమ్మిదేళ్ల వయసులో నాన్న ప్రోత్సాహంతో మట్టిలో రెజ్లింగ్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సుశీల్ రజతం గెలిచిన క్షణాన్ని టీవీలో చూసిన అతను ఎప్పటికైనా ఢిల్లీలో ఛత్రశాల్ స్టేడియానికి వెళ్లి గొప్ప రెజ్లర్‌ను అవుతానంటూ నాన్నకు చెప్పేవాడు. దురదృష్టవశాత్తూ ఏడాది తిరిగేలోగా అతని తల్లిదండ్రులు అనూహ్యంగా మరణించారు. దాంతో కొందరు సన్నిహితులు తెలిసిన వారి సహకారంతో ఛత్రశాల్ స్టేడియంకు తీసుకొచ్చి చేర్పించారు. అప్పటి నుంచి అతనికి ఆ కేంద్రమే సొంత ఇల్లుగా, అతని లోకమంతా రెజ్లింగ్‌మయంగా మారిపోయింది. ప్రాక్టీస్ తప్ప మరో పని లేకుండా అమన్ గడిపేవాడు. కోచ్ లలిత్ కుమార్ అతడిని తీర్చిదిద్దాడు.



అండర్-23 ప్రపంచ విజేతగా...

18 ఏళ్ల వయసులో తొలిసారి జాతీయ విజేతగా నిలిచిన అనంతరం అమన్ జూనియర్ స్థాయిలో పలు అంతర్జాతీయ పతకాలు గెలుచుకున్నాడు. ఆసియా క్యాడెట్స్, వరల్డ్ క్యాడెట్స్, ఆసియా అండర్-20, ఆసియా అండర్-23 చాంపియన్‌షిప్‌లలో అతను సాధించిన విజయాలు అమన్‌కు గుర్తింపు తెచ్చి పెట్టాయి. అయితే 19 ఏళ్ల వయసులో అండర్-23 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించడంతో అతనిపై అందరి దృష్టి పడింది. భవిష్యత్తులో అద్భుతాలు చేయగల ఆటగాడిగా అందరూ అంచనాకు వచ్చారు. వేర్వేరు గ్రాండ్ ప్రిలు, ఇన్విటేషన్ టోర్నీలలో కూడా వరుస విజయాలు సాధించడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ క్రమంలో సీనియర్ స్థాయిలో సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైంది. అమన్ ఎక్కడా తగ్గకుండా తన ఆటలో మరింత పదును పెంచుకున్నాడు. ఫలితంగా 2022 ఆసియా క్రీడల్లో కాంస్యం, గత ఏడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం అతని ఖాతాలో చేరాయి.

సుశీల్ ఫోన్ కాల్‌తో...

ఆసియా క్రీడల సెమీఫైనల్లో, ఆ తర్వాత ఆసియా క్వాలిఫయర్స్‌లో బలహీన డిఫెన్స్‌తో అమన్ పరాజయంపాలై కాస్త నిరాశ చెందాడు. ఆ సమయంలో అతనికి తీహార్ జైలు నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అది చిరపరిచితమైన గొంతే. తన కెరీర్ ఆరంభంలో తనను ప్రోత్సహించి నువ్వు గొప్పవాడివి అవుతావని ఆశీర్వదించిన సుశీల్ కుమార్ చేసిన ఫోన్ అది. 'నీ ఆటకు డిఫెన్స్ పనికిరాదు. అలా చేస్తే ఎప్పటికీ గెలవలేవు. ఒక్క సెకను కూడా డిఫెన్స్‌పై దృష్టి పెట్టకుండా ఆరంభం నుంచి అటాక్ చేస్తేనే నీకు సరిపోతుంది. సీనియర్ స్థాయిలో డిఫెన్స్ టెక్నిక్ చూడ్డానికి బాగానే ఉంటుంది కానీ ఫలితాన్ని ఇవ్వదు. నేను కూడా అలాగే చేశాను' అంటూ సుశీల్ చెప్పడం అమన్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపించింది. ఆ తర్వాత అతని ఆటలో దూకుడు మరింత పెరిగింది.

గురువునే ఓడించి...

పారిస్ ఒలింపిక్స్ అవకాశం అమన్‌కు అంత సులువుగా రాలేదు. ఛత్రశాల్‌లో తాను ఎంతో అభిమానించే రెజ్లర్ రవి దహియా. అతడిపై ఇష్టం కారణంగా అన్ని చోట్లా అతడినే అనుకరిస్తూ అతని శిష్యుడిగా తనను తాను భావించుకునేవాడు. కానీ గురువుతోనే పోటీ పడాల్సిన స్థితి వస్తే! అమన్‌కు అదే అనుభవం ఎదురైంది. రవి దహియా కేటగిరీ అయిన 57 కేజీల విభాగంలోనే తానూ పోటీ పడుతున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లేందుకు ఒకరికే అవకాశం ఉంది. కామన్వెల్త్ క్రీడల ట్రయల్స్‌లో రవి చేతిలో 0-10తో అమన్ చిత్తుగా ఓడాడు. కానీ ఆ తర్వాత అర్థమైంది తాను గురుభావంతో చూస్తే పని కాదని, ఒక ప్రత్యర్థిగా మాత్రమే చూడాలని. 2024 ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ ట్రయల్స్‌లో చెలరేగి రవిని ఓడించడంలో సఫలమైన అమన్... గురువు స్థానంలోకి వచ్చి కొత్త శకానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత క్వాలిఫయర్స్‌లోనూ చెలరేగి ఒలింపిక్ బెర్త్‌ను సాధించాడు. ఈ క్రమంలో వాంగెలోవ్, ఆండ్రీ యెట్‌సెంకో, చోంగ్ సాంగ్ వంటి సీనియర్లను అతను ఓడించగలిగాడు.

ఘనమైన రికార్డుతో...

ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తర్వాత ప్రపంచ రెజ్లింగ్‌కు రాజధాని లాంటి 'డేగిస్తాన్'లో అతను సన్నద్ధమయ్యాడు. ఛత్రశాల్‌లో మినహా అతని కెరీర్‌లో శిక్షణ తీసుకున్న మరో చోటు డేగిస్తాన్ (రష్యాకు సమీపంలో ఉండే) మాత్రమే. అత్యుత్తమ సౌకర్యాలతో పాటు పలువురు చాంపియన్ ప్లేయర్ల మధ్య సాధన చేయడం, పదునైన స్పేరింగ్ పార్ట్‌నర్‌లు ఉండటంతో అమన్ ప్రాక్టీస్ జోరుగా సాగింది. చివరకు తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు అమన్ ఆగలేదు. ఫిబ్రవరి 2022లో సీనియర్ స్థాయిలో తొలిసారి అంతర్జాతీయ రెజ్లింగ్‌లో బరిలోకి దిగిన అమన్ అప్పటి నుంచి ఈ ఒలింపిక్స్‌కు ముందు వరకు 39 బౌట్‌లలో పాల్గొంటే 31 విజయాలు సాధించాడు. అంటే 79.4 విజయశాతం. ఇదే అతనిపై ఒలింపిక్ పతకం అంచనాలను పెంచింది. ఇప్పుడు తనకంటే ముందు ఒలింపిక్ పతకాలు సాధించిన తనలో స్ఫూర్తిని నింపిన దిగ్గజాల సరసన అతను సగర్వంగా నిలబడ్డాడు.

–సాక్షి క్రీడా విభాగం

సీఏఎస్‌లో ముగిసిన వినేశ్ కేసు వాదనలు

ఒలింపిక్స్ ముగిసేలోపు తీర్పు వచ్చే అవకాశం

పారిస్: భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అనర్హతపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో విచారణ జరిగింది. సీఏఎస్ అడ్‌హక్ కమిటీ ఆర్బిట్రేటర్ డాక్టర్ అనాబెలె బెన్నెట్ ముందు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరఫున సీనియర్ లాయర్లు హరీశ్ సాల్వే, విదూశ్‌పత్ సింఘానియా వాదనలు బలంగా వినిపించారు. ప్రతివాదులైన యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)లు ప్రధానంగా నిబంధనల గురించే వివరించింది. దీనిపై తమ వాదనే పైచేయి సాధిస్తుందని, సానుకూల తీర్పు వస్తుందని ఐఓఏ కొండంత ఆశతో ఎదురుచూస్తోంది. మొత్తానికి రెండు రోజులుగా జరుగుతున్న విచారణ శుక్రవారంతో పూర్తయింది. ఆదివారం మెగా ఈవెంట్ ముగియనున్న నేపథ్యంలో నేడో రేపో సీఏఎస్ తీర్పు వెలువడే అవకాశముంది. ఫైనల్స్ రోజు వేయింగ్‌లో 100 గ్రాముల అధిక బరువు వల్ల వినేశ్ అనర్హతకు గురైంది. దీంతో కనీసం ఖాయమనుకున్న రజతం కూడా చేజారింది. దీనిపై సవాలు చేసిన ఫొగాట్ తన సెమీస్ ప్రదర్శన వరకు వేయింగ్‌లో ఏ సమస్యా లేదని కాబట్టి సంయుక్తంగా రజత పతకం బహూకరించాలని సీఏఎస్‌లో అప్పీలు చేసుకుంది.

భారత మహిళల, పురుషుల 4x400 రిలే జట్లు విఫలం


జ్యోతిక శ్రీ

పారిస్: ఒలింపిక్స్‌లో కనీస అంచనాలను అందుకోలేకపోయిన భారత మహిళల, పురుషుల జట్లు 4x400 మీటర్ల రిలే ఈవెంట్లలో నిరాశపరిచి హీట్స్‌లోనే వెనుదిరిగాయి. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీ, విత్యా రాంరాజ్, పూవమ్మ రాజు, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత మహిళల జట్టు హీట్స్‌లో పోటీపడ్డ ఎనిమిది జట్లలో చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలవడం గమనార్హం. భారత బృందం 3 నిమిషాల 32.51 సెకన్లలో రేసును పూర్తి చేసి చివరి స్థానాన్ని దక్కించుకుంది. ముందుగా విత్యా రేసును ఆరంభించి 53.46 సెకన్ల తర్వాత బ్యాటన్‌ను జ్యోతిక శ్రీకి అందించింది. జ్యోతిక శ్రీ వాయువేగంగా పరుగెత్తి 51.30 సెకన్ల తర్వాత బ్యాటన్‌ను పూవమ్మ రాజుకు అందించింది. పూవమ్మ 54.80 సెకన్ల తర్వాత శుభకు బ్యాటన్ ఇచ్చింది. శుభ 52.95 సెకన్లలో 400 మీటర్లను పూర్తి చేసింది. ఈ నలుగురిలో జ్యోతిక శ్రీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. అనస్, అజ్మల్, అమోజ్, రాజేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు 3 నిమిషాల 00.58 సెకన్లలో గమ్యానికి చేరి నాలుగో స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా భారత బృందం పదో స్థానాన్ని దక్కించుకుంది.

సాక్షి బిజినెస్
శనివారం
10-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	820	79,706
నిఫ్టీ ▲	251	24,368

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,754	▲	95
డోజోన్స్	39,539	▲	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,168	▲	23
డాక్స్	17,723	▲	42
షాంఘై	2,862	▲	8
నికాయ్	35,025	▲	194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,663 ▲	458
బంగారం (99.5 స్వచ్ఛత)	68,384 ▲	456
వెండి (కిలో)	80,263 ▲	1,383

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.58	84.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.96	108.52
€	యూరో	ఎస్‌బీఐ	90.63	93.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.43	57.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	56.45
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.12	65.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.67

ఓపెన్ ఆఫర్‌కు అల్ట్రాటెక్ రెడీ

- ఐసీఎల్‌లో 26% వాటాపై కన్ను
- షేరుకి రూ. 390 ధరలో కొనుగోలు



న్యూఢిల్లీ: ఇండియా సిమెంట్స్(ఐసీఎల్)లో 26 శాతం వాటా కొనుగోలుకి ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఇందుకు తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు ముసాయిదాను దాఖలు చేసింది. షేరుకి రూ. 390 ధరలో 8.05 కోట్ల షేర్లను పబ్లిక్ నుంచి కొనుగోలు చేయనుంది. దీనికి రూ.3,142 కోట్లు వెచ్చించనుంది. ముసాయిదా ప్రకారం ఐసీఎల్ వాటాదారులకు సెప్టెంబర్ 19న ప్రారంభంకానున్న ఓపెన్ ఆఫర్ అక్టోబర్ 3న ముగియనుంది. ఆఫర్ ధర శుక్రవారం ధర రూ. 367తో పోలిస్తే 6.3% అధికం. ఐసీఎల్‌లో ప్రమోటర్ల నుంచి 32.72% వాటాను అల్ట్రాటెక్ సొంతం చేసుకోనున్న సంగతి తెలిసిందే. ఇందుకు రూ. 3,954 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. సెబీ నిబంధనల ప్రకారం ఓపెన్ ఆఫర్ ఇస్తోంది. ఇప్పటికే ఐసీఎల్‌లో ఇన్వెస్టర్‌గా అల్ట్రాటెక్ 23% వాటాను రూ.1,900 కోట్లకు దక్కించుకుంది. వెరసి ఐసీఎల్‌లో అల్ట్రాటెక్ వాటా 55.49 శాతానికి చేరనుంది.

కెనరా బ్యాంక్ రుణ రేట్లూ పెరిగాయ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ కూడా రుణ రేట్ల పెంపులో పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా బాటన నడిచింది. అన్ని కాలపరిమితుల రుణ రేటును 5 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్ఆర్) రుణ రేటు 0.05 శాతం పెరగడంతో దీనికి అనుసంధానమైన అన్ని కాల పరిమితుల రుణరేట్లు పెరగనున్నాయి. కొత్త రేట్లు ఆగస్టు 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. ఆటో, వ్యక్తిగత రుణాలు సహా కన్జూమర్ రుణాలపై ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్ రేటు 8.95% నుంచి 9 శాతానికి ఎగసింది.

బ్లూచిప్స్ బూస్ట్!

- సూచీలకు రిలయన్స్, ఇన్ఫీ షేర్ల దన్ను
- సెన్సెక్స్‌కు 820 పాయింట్ల లాభం



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీతో స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతం మేర లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 820 పాయింట్లు పెరిగి 79,706 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 251 పాయింట్లు బలపడి 24,368 వద్ద నిలిచింది. అమెరికాలో ఉపాధి పెరిగినట్లు గణాంకాలు వెల్లడి కావడంతో ఆర్థిక మాంద్య భయాలు తగ్గుముఖం పట్టాయి. చైనాలో ద్రవ్యోల్బణ డేటా వినియోగం పెరుగుతున్నట్లు సూచించాయి. దీంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాటపట్టాయి. అక్కడి నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ స్టాక్ సూచీలు ఉదయం భారీ లాభంతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో పాటు రిలయన్స్ (2%), ఇన్ఫీ(2%), టీసీఎస్(1.50%)లు రాణించడంతో సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోగలిగాయి. ఆసియాలో చైనా మినహా అన్ని దేశాల సూచీలు 2.50% వరకు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం రాణించాయి.

- మార్కెట్ ర్యాలీతో ఒక్కరోజులో రూ.4.46 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.446 లక్షల కోట్లకు చేరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఒక అకౌంట్‌కు నలుగురు నామినీలు!	ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ. 37,113 కోట్లు

ఓలా.. లాభాల రైడ్

ఫ్లాట్‌గా లిస్టయినా.. 20% జంప్



ముంబై: ఓలా ఎలక్ట్రిక్ షేర్లు లిస్టింగ్ రోజే లాభాల రైడ్ చేశాయి. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర (రూ.76) వద్ద ఫ్లాట్‌గా లిస్టయ్యింది. ఇంట్రాడేలో షేరును కొనేందుకు ఇన్వెస్టర్లు ఎగబడటంతో దూసుకుపోయింది. చివరికి 20% అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ.91.20 వద్ద లాకైంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,218 కోట్లుగా నమోదైంది.

కొత్త కార్ల పండగ!



సార్వత్రిక ఎన్నికలు.. మండుటెండలు.. కుండపోత వర్షాలు.. కార్ల కంపెనీల అమ్మకాలను గత మూడు నాలుగు నెలలూ గట్టిగానే దెబ్బకొట్టాయి. గ్రామీణ డిమాండ్‌తో జూలైలో మాత్రం కాస్త పుంజుకుని ఊరటనిచ్చాయి. నిండు కుండలా కార్ల నిల్వలు పేరుకుపోవడంతో డీలర్లు పండగ సీజన్ కోసం అవురావురుమని ఎదురుచూస్తున్నారు. మరోపక్క, అమ్మకాలు మందగించడంతో.. కార్ల కంపెనీలు గేరు మారుస్తున్నాయి. కొంగొత్త వాహన మోడళ్లను కారు ప్రియుల కోసం రెడీ చేస్తున్నాయి. ఆటోమొబైల్ సంస్థలు సేల్స్ పెంపుతో పండుగ చేసుకోవాలని చూస్తుండగా.. కస్టమర్లకు కూడా కొత్త కార్ల జాతర కనువిందు చేయనుంది. – సాక్షి, బిజినెస్ డెస్క్

రాబోయే పండుగ సీజన్ కోసం కార్ల కంపెనీలన్నీ 'కొత్త' వ్యూహంతో సిద్ధమవుతున్నాయి. దాదాపు 20 కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు అంచనా. ఇందులో 12 కార్లు పూర్తిగా కొత్తవి కావడం విశేషం. ప్రస్తుతం దేశంలో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్న స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ)పైనే కంపెనీలన్నీ ఎక్కువగా గురిపెట్టాయి. కొత్తగా విడుదలయ్యే వాటిలో 13 ఎస్‌యూవీ మోడల్స్ ఉండటం దీనికి నిదర్శనం. టాటా మోటార్స్, నిస్సాన్, సిట్రాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎంజీ మోటార్స్, కియా, హ్యుందాయ్, ఫోక్స్‌వ్యాగన్‌తో పాటు లగ్జరీ కార్ దిగ్గజాలు మెర్సిడెస్–బెంజ్, బీఎండబ్ల్యూ తదితర కంపెనీలు వచ్చే మూడు నెలల్లో కొత్త ఎస్‌యూవీలతో మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. ఇక మారుతీ సుజుకీ, మెర్సిడెస్ నయా సెడాన్లతో అలరించనుండగా.. కియా, ఎంజీ మల్టీ పర్పస్ వాహనాలను (ఎంపీవీ) రంగంలోకి దించుతున్నాయి.

పండుగ సీజన్‌కు 20 కొత్త కార్ల క్యూ...

- ఇందులో 12 పూర్తిగా నయా మోడల్స్
- ఎంట్రీకి పలు ఎస్‌యూవీలు రెడీ
- రేసులో టాటా కర్వ్, మహీంద్రా ఐదు డోర్ల థార్



సేల్స్ తగ్గినా.. నిల్వల పెంపు..

ఈ ఆర్థిక సంవత్సరం మొదలు (ఏప్రిల్ నుంచి) వాహన అమ్మకాలు మందకొడిగానే సాగుతున్నాయి. ఎన్నికలతో పాటు మండుటెండలు కూడా వాహన విక్రయాలపై ప్రభావం చూపాయి. కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు కుమ్మేయడం కంపెనీల ఆశలపై నీళ్లు చల్లింది. అయితే, గ్రామీణ డిమాండ్ మళ్లీ పుంజుకోవడంతో జూలైలో ప్యాసింజర్ వాహన విక్రయాలు 10% పెరగడం విశేషం. కస్టమర్లు కొనుగోళ్లను వాయిదా వేయడం.. పండుగల్లో భారీ డిమాండ్ ఆశలతో వాహన కంపెనీలు భారీగా నిల్వలు పెంచుకున్నాయి. డీలర్ల వద్ద సగటున 25–30 రోజుల నిల్వలు ఉంటాయని, ప్రస్తుతం 60–65 రోజుల నిల్వలు ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వీటి విలువ రూ.73,000 కోట్లుగా అంచనా.

సెప్టెంబర్‌తో షురూ...

దక్షిణాదిన కేరళ 'ఓనమ్'తో పండుగ సేల్స్ మొదలవుతాయి. ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరుపుకునే వినాయకచవితి, దుర్గాపూజ, దసరా, దీపావళి ఇలా వరుసగా అటు జనాలకు ఇటు కంపెనీలకూ పండుగే. మూడు నెలలుగా పేరుకున్న నిల్వలను పండుగల్లో విక్రయించడంతో పాటు కొత్త మోడళ్లతో కస్టమర్లను షోరూమ్‌లకు క్యూ కట్టించాలనేది వాహన సంస్థల వ్యూహం. మహీంద్రా సక్సెస్‌ఫుల్ ఎస్‌యూవీ 'థార్'లో (ప్రస్తుతం మూడు డోర్ల మోడల్ ఉంది) కొత్తగా ఐదు డోర్ల థార్ 'రాక్స్'ను తీసుకొస్తోంది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున దీన్ని ఆవిష్కరించి.. పండుగ సీజన్లో మార్కెట్లోకి తీసుకొచ్చేలా కంపెనీ సన్నాహాలు చేస్తోంది. 'ఐదు డోర్ల థార్ కోసం మేము ముందుగా ప్లాన్ చేసిన ఉత్పత్తికి మరో 3,000–4,000 అదనంగా తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నాం' అని ఎంఅండ్ఎం సీఈఓ (ఆటో, ట్రాక్టర్ల విభాగం) రాజేష్ జెజూరికర్ క్యూ1 ఆర్థిక ఫలితాల సందర్భంగా వెల్లడించారు.

ఈవీలు, హైబ్రిడ్‌లు కూడా...



కొత్తగా లైన్ కడుతున్న వాహన మోడల్స్ కస్టమర్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా రకరకాల ఇంజిన్ ఆప్షన్లతో లభించనున్నాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎలక్ట్రిక్ (ఈవీ) హైబ్రిడ్ (సీఎన్‌జీ+పెట్రోల్ వంటివి) ఇంజిన్లు సైతం వీటిలో ఉన్నాయి. ఈవీ విభాగాన్ని శాసిస్తున్న టాటా మోటార్స్ సరికొత్త ఎస్‌యూవీ కూప్ 'కర్వ్'తో పండగ చేసుకోవాలనుకుంటోంది. ఈ మోడల్‌లో పెట్రోల్, డీజిల్ వెర్షన్లతో పాటు ఈవీ వేరియంట్‌ను కూడా తీసుకొస్తోంది. ముందుగా ఈవీ 'కర్వ్'ను ప్రవేశపెట్టడం విశేషం. గత నెలలో నిస్సాన్ ఆవిష్కరించిన ప్రీమియం ఎస్‌యూవీ ఎక్స్–ట్రెయిల్ కూడా పండుగల్లో రోడ్డెక్కనుంది.



పండుగ రేసు గుర్రాలు (అంచనా ధర రూ.లలో)..

- టాటా మోటార్స్-కర్వ్ ఈవీ (18-25 లక్షలు), కర్వ్ (రూ.10.5-20 లక్షలు),
- మారుతీ-స్విఫ్ట్ హైబ్రిడ్ (10 లక్షలు), డిజైర్-2024 (7-10 లక్షలు)
- మహీంద్రా-థార్ రాక్స్ (13-23 లక్షలు)
- నిస్సాన్ - ఎక్స్‌ట్రెయిల్ (49 లక్షల నుంచి)
- టయోటా బెల్టా - (9.5-12 లక్షలు)
- మెర్సిడెజ్-బెంజ్ - ఈక్యూఎస్ ఎస్‌యూవీ (2 కోట్లు)
- బీఎండబ్ల్యూ-ఎం3 (1.47 కోట్లు)
- రెనో-కార్డియన్ (10-12 లక్షలు)
- ఎంజీ-క్లౌడ్ ఈవీ (29-30 లక్షలు), గ్లోస్టర్-2024 (40 లక్షలు)
- స్కోడా-కొడియాక్-2024 (40-50 లక్షలు)
- బీవైడీ-సీగల్ ఈవీ (10 లక్షలు)
- కియా-ఈవీ9 (75-82 లక్షలు)
- ఆడి-క్యూ8 ఫేస్‌లిఫ్ట్ (రూ.1.17 కోట్లు)
- సిట్రాన్ - సీ3ఎక్స్ (రూ.11.5 -15 లక్షలు), బసాల్ట్ (రూ.8 లక్షలు)









సాక్షి స్పోర్ట్స్



జూనియర్ హాకీ జట్టు కోచ్‌గా శ్రీజేశ్!

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అద్వితీయ ప్రదర్శనతో వరుసగా రెండో కాంస్య పతకం సాధించిన అనంతరం కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత హాకీ జట్టు గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ త్వరలోనే కొత్త అవతారంలో దర్శనమివ్వనున్నాడు. గోల్ పోస్ట్ ముందు తన అసమాన ప్రతిభతో దేశానికి ఎన్నో మధుర విజయాలు అందించిన శ్రీజేశ్.. ఇకపై జాతీయ జూనియర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 'త్వరలోనే శ్రీజేశ్‌ను జూనియర్ (అండర్-21) జట్టు కోచ్‌గా నియమిస్తాం. దీని గురించి అతడితో మాట్లాడాం. యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయడంలో అతడికి మించిన వారు మరొకరు లేరు. దీంతో పాటు శ్రీజేశ్ స్థానాన్ని భర్తీ చేయనున్న గోల్ కీపర్లు సూరజ్ కార్కెరా, క్రిషన్ బహదూర్ పాఠక్‌కు కూడా దిశా నిర్దేశం చేయాల్సి ఉంటుంది' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేర్కొన్నాడు.

చిన్న దేశాలు... పెద్ద విజయాలు

జనాభాతో సంబంధం లేకుండా పతకాల వేటలో ముందంజ
పారిస్ ఒలింపిక్స్‌లో మెరిసిన చిన్న దేశాల క్రీడాకారులు

మహిళల 100 మీటర్ల పరుగులో సెయింట్ లూసియాకు చెందిన అల్‌ఫ్రెడ్ జూలియన్ 10.72 సెకన్లలో లక్ష్యానికి చేరి స్వర్ణం గెలిచింది. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో డొమెనికాకు చెందిన లెఫాండ్ థియా 15.02 మీటర్ల దూరం దూకి పసిడి పతకం కైవసం చేసుకుంది. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా.. సెయింట్ లూసియా జనాభా 1,80,000 కాగా.. డొమెనికా జనాభా 73 వేలు మాత్రమే. కరీబియన్ దీవుల్లోని అతి చిన్న దేశాలు విశ్వక్రీడల్లో సత్తా చాటుతున్నాయనడానికి ఇది నిదర్శనం. ఒలింపిక్స్ చరిత్రలో పసిడి గెలిచిన అతి తక్కువ జనాభా గల దేశంగా డొమినికా రికార్డుల్లోకెక్కింది. ఇవే కాకుండా.. పట్టుమని 10 లక్షల జనాభా కూడా లేని పదికి పైగా దేశాలు ఒలింపిక్స్‌లో చక్కటి ప్రదర్శన కనబరిచాయి. –సాక్షి క్రీడా విభాగం

ఒలింపిక్స్ అథ్లెటిక్స్ చరిత్రలో ఇప్పటి వరకు వందకు పైగా దేశాలు పతకాలు సాధించాయి. వాటిలో జనాభా పరంగా స్వర్ణం గెలిచిన అతిచిన్న దేశంగా డొమెనికా నిలిచింది. విశ్వక్రీడల్లో ఆ దేశానికి ఇదే తొలి పతకం కావడం మరో విశేషం. ఇప్పటి వరకు తమ దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా గుర్తింపు లేకున్నా... ఈ మెడల్ అనంతరం డొమినికాను ప్రపంచ చాంపియన్‌గా అందరూ గుర్తిస్తారని... ఆ దేశానికి తొలి పతకం అందించిన ట్రిపుల్ జంపర్ లెఫాండ్ థియా ఆశాభావం వ్యక్తం చేసింది. భిన్న భౌగోళిక పరిస్థితులు ఉండే డొమెనికాలో... క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యం అంతంత మాత్రమే. అలాంటి చోటు నుంచి 'పారిస్' క్రీడలకు నలుగురు అథ్లెట్లు అర్హత సాధించగా అందులో లెఫాండ్ థియా సాధించిన బంగారు పతకం... ఆ దేశానికి కీర్తి ప్రతిష్టలు కట్టబెట్టింది. 1996 అట్లాంటా ఒలింపిక్స్ నుంచి డొమెనికా విశ్వక్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తుండగా.. 28 ఏళ్ల తర్వాత ఆ దేశానికి మొదటి పతకం దక్కింది. ఈ ఏడాది ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గి ఆశలు రేపిన లెఫాండ్... 'పారిస్' క్రీడల్లోనూ అదే జోరు కొనసాగించింది. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో 15.02 మీటర్ల దూరం లంఘించి పసిడి పతకం కైవసం చేసుకుంది. 'ఇప్పుడు మేం కూడా ప్రపంచ చాంపియన్‌లమే. డొమెనికాకు ఒలింపిక్స్‌లో తొలి పతకం. అది కూడా పసిడి. చాలా గొప్పగా అనిపిస్తోంది. ఈ ఫలితంతో మా దేశంలో క్రీడలకు మరింత ప్రాధాన్యత దక్కుతుందనే నమ్మకం పెరిగింది. మా దేశ జనాభా సుమారు 73 వేలు. దేశానికి తొలి స్వర్ణం అందించడం మాటల్లో చెప్పలేని అనుభూతి. దేశం తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి మహిళా అథ్లెట్‌గా నిలవడం... అందులోనూ పతకం గెలవడం చాలా గర్వంగా ఉంది. చిన్న దేశం అంటే... పరిమిత వనరులు ఉంటాయనుకుంటారు. అయితే సంఖ్య కన్నా నాణ్యత ముఖ్యం అని నా ఉద్దేశం. ఈ విజయాన్ని దేశమంతా ఆస్వాదిస్తుంది. డొమెనికా స్టేడియంలో అథ్లెటిక్స్ కోసం మెరుగైన ట్రాక్ కూడా లేదు. ఇప్పుడు ఈ పతకం వల్ల దేశంలో క్రీడా మౌలిక వసతులు మెరుగు పడతాయని ఆశిస్తున్నా. భవిష్యత్తు తరాలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందుకు నా వంతు కృషి చేస్తా' అని పతకం గెలిచిన అనంతరం లెఫాండ్ వివరించింది.





లెఫాండ్ థియా



జూలియన్

జూలియన్ కథే వేరు...

పారిస్ ఒలింపిక్స్ మహిళల 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీటర్లలో రజతం నెగ్గిన సెయింట్ లూసియా అథ్లెట్ జూలియన్ అల్ఫ్రెడ్ కథే వేరు! అమెరికా అథ్లెట్లు షకారీ రిచర్డ్‌సన్, జెఫెర్‌సన్ మెలీస్సాలతో పోటీపడి అగ్రస్థానం దక్కించుకున్న జూలియన్... ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ఈ స్థాయికి చేరింది. ప్రాక్టీస్ చేసేందుకు షూస్ కాదు కదా... కనీసం చెప్పులు కూడా లేని నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన జూలియన్... చిన్నతనంలో ఎక్కువగా స్కూల్ యూనిఫామ్‌లోనే పరుగు పెట్టేది. రన్నింగ్ కోసం ప్రత్యేక దుస్తులు కొనే స్తోమత లేని జూలియన్... చిన్నప్పటి నుంచే పరుగును ప్రేమించింది. ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలని ఊహ తెలిసినప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్న జూలియన్... పారిస్‌లో తన కల సాకారం చేసుకుంది. 'ఇది నాకు, నా దేశానికి ఎంతో విలువైంది. యావత్ దేశం సంబరాలు జరుపుకోవడం ఖాయం. చిన్నప్పుడు కాళ్లకు చెప్పులు లేకుండా పరుగులు తీసే దాన్ని. కనీస వసతులు లేకుండానే ఈ స్థాయికి వచ్చా. ఈ ప్రదర్శన అనంతరం మా దేశంలో స్టేడియం నిర్మాణం జరుగుతుందనుకుంటున్నా. యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడం పెరుగుతుందని భావిస్తున్నా. దేశానికి అంబాసిడర్ అనే భావన కలుగుతోంది. ప్రపంచంలో చాలా మందికి సెయింట్ లూసియా గురించి తెలిసి ఉండకపోవచ్చు. అదెక్కడ ఉంది అని నన్ను ఎంతో మంది అడిగారు. కాని ఇప్పుడు ఒలింపిక్ చాంపియన్ కాబట్టి... ప్రజలు సెయింట్ లూసియా గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతారు. దేశం కోసం పరుగెత్తడాన్ని గౌరవంగా భావిస్తా. ఇంటికి వెళ్లాక ప్రజలతో కలిసి సంబరాలు చేసుకుంటా' అని జూలియన్ చెప్పింది. వీరిద్దరే కాదు... 1,25,000 జనాభా ఉన్న గ్రెనెడా అథ్లెట్లు 'పారిస్' క్రీడల్లో రెండు కాంస్యాలు సాధించగా... 2,82,000 జనాభా ఉన్న బార్బడోస్ ఒక పతకం నెగ్గింది. ఇక సుమారు 4 లక్షల జనాభా గల బహామస్ ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో ఇప్పటి వరకు 8 స్వర్ణాలు, 2 రజతాలు, 6 కాంస్యాలతో మొత్తం 16 పతకాలు గెలిచింది.

వివేక్ సాగర్‌కు రూ. కోటి నజరానా

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన



భోపాల్: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత హాకీ జట్టులో కీలక సభ్యుడైన వివేక్ సాగర్ ప్రసాద్‌కు మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. ఈ విషయాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రకటించారు. 'విశ్వక్రీడల్లో భారత హాకీ జట్టు సభ్యులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. యావత్ దేశాన్ని సంతోషంలో ముంచెత్తారు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులోనూ సభ్యుడిగా ఉన్న వివేక్‌కు ఆనాడు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. ఇప్పుడు కోటి రూపాయల నగదు పురస్కారం అందజేస్తున్నాం' అని మోహన్ యాదవ్ తెలిపారు.

అదితి వెనుకంజ



టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకం కోల్పోయిన భారత మహిళా గోల్ఫర్ అదితి అశోక్ 'పారిస్'లో మాత్రం ప్రభావం చూపించలేకపోయింది. శుక్రవారం మూడో రౌండ్ ముగిశాక అదితి 40వ స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన మరో గోల్ఫర్ దీక్ష డాగర్ 42వ స్థానంలో ఉంది. లిడియా కో (న్యూజిలాండ్), మోర్గానె మాట్రాక్స్ (స్విట్జర్లాండ్) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. నేడు చివరిదైన నాలుగో రౌండ్ తర్వాత టాప్-3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.

వినేశ్‌కు రజతం ఇవ్వాలి: సచిన్ టెండూల్కర్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రజత పతకానికి అర్హురాలేనని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేర్కొన్నాడు. మహిళల 50 కేజీల విభాగంలో వరస విజయాలతో ఫైనల్‌కు చేరిన ఫొగాట్.. వంద గ్రాములు అదనపు బరువు కారణంగా పతకానికి దూరమై రెజ్లింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఈ నేపథ్యంలో సచిన్ సోషల్ మీడియాలో స్పందించాడు. 'ప్రతి ఆటలో నిబంధనలు ఉంటాయి. వాటిని సందర్భానుసారంగా చూడాలి. అవసరమైతే మార్పులు చేయాలి. వినేశ్ చక్కటి ఆటతీరుతో ఫైనల్‌కు చేరింది. తుదిపోరుకు ముందు అదనపు బరువు కారణంగా అనర్హత వేటు పడి రజత పతకానికీ దూరమైంది. దీనికి సరైన కారణం కనిపించడం లేదు. ఇందులో క్రీడా స్ఫూర్తి లోపించినట్లే' అని సచిన్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. డ్రగ్స్ వంటి అనైతిక చర్యలతో అనర్హతకు గురై ఉంటే చివరి స్థానం ఇవ్వడం సబబే అని.. కానీ వినేశ్ న్యాయంగా పోరాడి ఫైనల్‌కు చేరిందని సచిన్ గుర్తు చేసుకున్నాడు. ఫొగాట్ రజత పతకానికి అర్హురాలే అని.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (సీఏఎస్) తీర్పు తర్వాత అయినా వినేశ్‌కు పతకం వస్తుందని ఆశిస్తున్నట్లు సచిన్ 'ఎక్స్'లో పేర్కొన్నాడు.

భారత మహిళల 'ఎ' జట్టుకు రెండో ఓటమి

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న భారత మహిళల 'ఎ' జట్టు వరుసగా రెండో టి20లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 8 వికెట్ల తేడాతో భారత 'ఎ' జట్టుపై గెలిచింది. మొదట భారత్ 'ఎ' జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ప్రియా పూనియా (29) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ మిన్ను మణి (17 నాటౌట్) ఫర్వాలేదనిపించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో గ్రేస్ పర్సన్స్ 4, నికోలా మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 18.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. తహిలా విల్సన్ (53 నాటౌట్), కెప్టెన్ తహిలా మెక్‌గ్రాత్ (47 నాటౌట్) రాణించారు. ఈ పర్యటనలో భాగంగా భారత మహిళల 'ఎ' జట్టు మూడు టి20, మూడు వన్డేలు, ఏకైక అనధికారిక టెస్టు ఆడనుంది.

త్వరలో బీజేపీ 'వారధి'

కార్యకర్తలు, ప్రజల నుంచి వినతుల స్వీకరణ

సాక్షి, అమరావతి: 'వారధి' పేరుతో రాష్ట్ర బీజేపీ ఓ కొత్త కార్యక్రమాన్ని చేపట్టనున్నది. కేంద్ర, రాష్ట్ర మంత్రులతో సహా బీజేపీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతి నెల రెండు రోజులు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అందుబాటులో ఉండి పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించాల్సి ఉంటుంది. దీన్లో భాగంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ప్రతి నెలలో మొదటి, మూడో సోమవారం, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ప్రతి నెల మొదటి, రెండో శనివారం, రాష్ట్రమంత్రి సత్య కుమార్ ప్రతి నెలలో మొదటి, మూడో మంగళవారం అందుబాటులో ఉంటారు. మిగిలిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి షెడ్యూల్స్‌కు అనుగుణంగా అందుబాటులో ఉండనున్నారు. ఈ మేరకు వివరాలను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ శుక్రవారం మీడియాకు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాలో చంద్రబాబు.. కాకినాడ జిల్లాలో పవన్

సాక్షి, అమరావతి: ఆగస్టు 15న రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో స్వాతంత్య్ర వేడుకల నిర్వహణపై సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్వాతంత్య్ర వేడుకల్లో సీఎం చంద్రబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అలాగే, గుంటూరులో నారా లోకేశ్, శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు జెండా ఆవిష్కరించనున్నారు. ఏపీలో 26 జిల్లాలు ఉండగా సీఎం చంద్రబాబు రాష్ట్ర స్థాయి వేడుకల్లో, 24 మంది మంత్రులు జిల్లా స్థాయి వేడుకల్లో జెండా ఆవిష్కరణలో పాల్గొంటారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో కలెక్టర్ దినేశ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'గంజాయి' వివరాలు చెబితే పారితోషికం

మంత్రి వాసంశెట్టి సుభాష్



అంబాజీపేట: రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి క్రయ, విక్రయాలు జరిపే వారి వివరాలు చెబితే వారికి రూ.5వేలు పారితోషికం ఇస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంత్రి సుభాష్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, ఈ పారితోషికాన్ని తానే స్వయంగా ఇస్తానని తెలిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా బ్రీడింగ్ కేంద్రాల స్థాపనకు చేయూత

నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్

సాక్షి, అమరావతి: రొయ్యల సంతానోత్పత్తి కోసం న్యూక్లియస్ బ్రీడింగ్ కేంద్రాల స్థాపనకు అవసరమైన ఆర్థిక సహాయం చేసేందుకు నాబార్డు సిద్ధంగా ఉందని నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్ చెప్పారు. రొయ్యల ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతిపై స్టేక్‌హోల్డర్ల సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చేయూత అందించేందుకు నాబార్డు ముందుంటుందని చెప్పారు. మత్స్యశాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రొయ్యల పరిశ్రమలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రొయ్యల ఉత్పత్తిలో ఏపీ దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఉందని చెప్పారు. రొయ్యల ఎగుమతులను పెంచేందుకు అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా రొయ్య ఉత్పత్తుల నాణ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

టీచర్ల సర్దుబాటు జీవో 53 ప్రకారం చేయాలి: ఆప్టా

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయుల పని సర్దుబాటులో తమ సూచనలను పరిగణలోకి తీసుకోవాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరింది. ఈ ప్రక్రియను జీవో 117 ఆధారంగా కాకుండా జీవో 53 అమలు చేయాలని సూచించింది. ప్రాథమిక పాఠశాలలో హాజరు 20 దాటినచోట మరో ఎస్‌జీటీ పోస్టు కేటాయించాలని, 20 లోపు ఉంటే ఎంటీఎస్‌ను ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండకూడదని, అదనంగా ఉన్న ఉపాధ్యాయులను మండల పరిధిలోని పాఠశాలలకు మాత్రమే సర్దుబాటు చేయాలని కోరింది. మిగులును లెక్కించేటప్పుడు సర్వీసు సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలి తప్ప స్కూల్ సీనియారిటీ కాదని సూచించింది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3 నుంచి 8వ తరగతి వరకు ఎన్‌రోల్‌మెంట్ 98 ఉంటే ఆ పాఠశాలకు అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని పేర్కొంది.

సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులకు సన్నాహక పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి సీబీఎస్ఈ సిలబస్ చదువుతూ వచ్చే ఏడాది బోర్డు పరీక్షలు రాయనున్న 82,764 మంది విద్యార్థులకు సన్నద్ధ పరీక్ష (రెడీనెస్ టెస్ట్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై శుక్రవారం సమగ్రశిక్ష ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలు జారీచేశారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సైన్స్ సబ్జెక్టుల్లో డిజిటల్ విధానంలో ఆబ్జెక్టివ్ పరీక్షలను ఈనెల 12 ,13, 14, 17 తేదీల్లో నిర్వహించనున్నారు.





పట్టా భూముల్లో ఇసుకను తోడేస్తున్న ఎమ్మెల్యే నాని అనుచరులు... పాడిపేట గ్రామస్తులతో గొడవపడుతున్న నాని అనుచరులు

స్వర్ణముఖిలో దోపిడీకి 'సూపర్ సిక్స్'

ఎన్నికల ముందు టీడీపీ చెప్పిన సూపర్ సిక్స్ హామీల అమలును అధికారంలోకి వచ్చాక గాలికొదిలేసింది. కానీ, రూ.కోట్లు కూడబెట్టుకునేందుకు చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని ఒక 'సూపర్ సిక్స్'ను తయారు చేసుకున్నారు. అదేమిటనుకుంటున్నారా... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పులివర్తి నాని కనుసన్నల్లో ఆయన అనుచరులు స్వర్ణముఖి నదిలో చంద్రగిరి మండలంలోని నాగయ్యగారిపల్లి, కొటాల, మిట్టపాళెం, శానంబట్ల, తిరుపతి రూరల్ మండలంలోని పైడిపల్లి, తనపల్లి ప్రాంతాల్లో ఆరు రీచ్‌లు అనధికారికంగా ఏర్పాటుచేశారు. రాత్రింబవళ్లు యంత్రాలతో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. రాత్రిపూట టిప్పర్లు, పగలు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలోని తిరుచానూరు వద్ద పంట పొలాల్లోనూ దౌర్జన్యంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. నదిలో పెద్ద ఎత్తున తవ్వకాలు చేయడం వల్ల వర్షాకాలంలో తమ గ్రామాలను వరద ముంచెత్తుతుందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో తిరుచానూరు–పాడిపేట గ్రామాల మధ్య స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలను శుక్రవారం పాడిపేట గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసులు రావడంతో నాని అనుచరులు ఇసుక ట్రాక్టర్లను తీసుకుని వెళ్లిపోయారు. – సాక్షి టాస్క్‌ఫోర్స్

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇల్లు కూల్చివేతకు కుట్ర

- 100 మంది పోలీసులతో ఇంటిని చుట్టుముట్టిన టీడీపీ నేతలు
- ఇంటిని చుట్టుముట్టడంతో గుండెపోటుకు గురైన తల్లి



వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటి వద్ద జేసీబీతో పోలీసులు, గుండెపోటుకు గురైన రవి తల్లి వరలక్ష్మి

గోపాలపురం: తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల సేవాదళ్ అధ్యక్షుడు ముచ్చికర్ల రవి ఇంటిని కూల్చేందుకు టీడీపీ నాయకులు కుట్ర పన్నారు. ఇంటిని కూల్చివేసేందుకు శుక్రవారం సుమారు 100 మంది పోలీసులు, జేసీబీతో టీడీపీ నాయకులు అతడి ఇంటిని చుట్టుముట్టారు. రవి కుటుంబ సభ్యులు 40 ఏళ్లపాటు పంచాయతీ పోరంబోకు భూమిలో పూరిగుడిసెలో ఉన్నారు. పదేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు పట్టా మంజూరు చేశారు. గత ఏడాది రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రవి చిట్యాలలో బలమైన నాయకుడిగా పనిచేశాడని టీడీపీ నాయకులు అతనిపై కక్ష పెట్టుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రవి ఇంటిని తొలగించాలంటూ గ్రామ కార్యదర్శితో నోటీసులు జారీ చేయించారు. రవి హైకోర్టునుంచి స్టే తెచ్చుకున్నాడు. టీడీపీ నాయకులు స్టే ఆర్డర్‌ను ఎత్తివేయించి మళ్లీ పంచాయతీ ద్వారా నోటీసులు పంపారు. టీడీపీ నాయకులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు కలసి రవి ఉంటున్న రేకుల షెడ్డును తొలగించడానికి పూనుకున్నారు. అప్పటికే రవి హైకోర్టు నుంచి మరో స్టే ఆర్డర్ తీసుకున్నాడు. అయినా ఇబ్బందిపెట్టడంతో హైకోర్టు ప్రభుత్వ లాయర్‌తో ఫోన్‌లో మాట్లాడించాడు. దీంతో చేసేదేమీలేక వెనుదిరిగారు. ఒక్కసారిగా పోలీసులు ఇంటిని చుట్టుముట్టడంతో రవి తల్లి వరలక్ష్మి గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆమెను వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

వాటర్ ప్లాంట్‌ను కూల్చిన టీడీపీ శ్రేణులు

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా గుడివాడ బైపాస్ రోడ్డు వలివర్తిపాడు క్రాస్‌లోని వాటర్ ప్లాంట్‌ను టీడీపీ కార్యకర్తలు, వారి అనుచరులు గురువారం రాత్రి దౌర్జన్యంగా కూల్చివేశారు. గుంపుగా వచ్చి షట్టర్లు పగులగొట్టి ప్లాంట్ నడుపుతున్న వ్యక్తిపై దాడి చేయడంతో అతడి చెయ్యి విరిగింది. అతని భార్యను బయటకు నెట్టేసి భయానక వాతావరణం సృష్టించారు. వాటర్ ప్లాంట్‌లోని పరికరాలు, మోటార్, పైపులను ధ్వంసం చేశారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇప్పటికైనా స్పందించి గొడవలు ఆపాలని స్థానికులు కోరుతున్నారు.



ధ్వంసం చేసిన వాటర్ ప్లాంట్ భాగాలు

అంతరించిపోని క్యాట్ ఫిష్ మూలాలు

35 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి..

దీన్ని తింటే అనారోగ్య సమస్యలెన్నో!

దుష్ప్రభావాల నేపథ్యంలో 20 ఏళ్ల క్రితం సాగు నిషేధం

అయినా.. భూగర్భ జలాల్లో ఉండి పోయిన మూలాలు

అక్రమసాగుదారులకు కాసుల వర్షం

తీవ్రంగా నష్టపోతున్న ఆక్వా రైతు



మలికిపురం: ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ .. ఈ పేరు చెబితేనే ఆక్వా రైతులతో సహా.. మాంసాహార ప్రియులు ఉలిక్కిపడతారు. దానికి కారణం.. దీన్ని తినడం వల్ల దుష్ప్రభావాలు తీవ్రంగా ఉండడంతో.. పలు ప్రభుత్వాలు 20 ఏళ్ల క్రితమే నిషేధిత జాబితాలో చేర్చడమే. 'మార్పు' (వాడుక భాషలో మార్కు) అని కూడా పిలువబడే ఈ చేపలో రెండు రకాలున్నాయి. ఒకటి ఆఫ్రికన్ క్యాట్ ఫిష్, రెండోది అమెరికన్ వైట్ క్యాట్ ఫిష్ (పంగస్). అయితే.. ఆఫ్రికన్ క్యాట్ ఫిష్‌పై నిషేధం ఉన్నప్పటికీ అమెరికన్ వైట్ క్యాట్ ఫిష్ ఇప్పటికీ ఏపీ నుంచి అధిక మొత్తంలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నది. ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ ప్రధానంగా ఆగ్నేయ ఆసియాలో నివశిస్తుంది. సుమారు 35 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి దిగుమతి చేసుకుని కొంతమంది ఏపీ రైతులు సాగు చేశారు. అనంతర కాలంలో దీనిపై నిషేధం విధించడంతో రైతులు సాగు నిలిపివేశారు. అయినప్పటికీ వీటి మూలాలు కోస్తా భూగర్భ జలాల్లో ఉండిపోయాయి. ప్రధానంగా ఇవి భూగర్భ జలాల్లో ఉండిపోవడం వల్ల సాధారణ చేపలు, రొయ్యలను, వాటికి వేసిన మేతలను కూడా తినేస్తున్నట్లు మత్స్యశాఖ చెబుతున్నది. ఫలితంగా మత్స్యకారులు ఉపాధి పొందే నదులు, ఉప్పుటేర్లు, ఇతర ప్రధాన చెరువుల్లో సైతం అధిక శాతం మత్స్య సంపద తరిగిపోవడానికి కారణమవుతున్నది. ఇది పొడవైన దేహం కలిగి సుమారు 45 సెంటీమీటర్ల వెడల్పుతో పదినుంచి 20 కేజీల వరకు పెరుగుతుంది. బూడిద రంగు దేహం కలిగి చిన్న చేపలను, రొయ్యలను, లార్వాలను, క్రిములతోపాటు శైవలాలను ఆహారంగా తీసుకుంటుంది. ప్రత్యుత్పత్తి విపరీతంగా ఉంటుంది.



అప్రమత్తంగా ఉండండి..

ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండండి. ఈ చేప వల్ల పర్యావరణానికి ప్రమాదం. ప్రభుత్వం నిషేధించింది. అయినా భూగర్భ జల మూలాల్లో ఇది ఉంది. చేపలు, రొయ్యల సాగు రైతులు చెరువుల్లో దీని ఉనికి లేకుండా చూసుకోండి. దీనిని ఎవరయినా అక్రమంగా పెంచితే వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

– సిద్ధార్థవర్ధన్, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

దొంగ చాటుగా సాగు?

ఇది తక్కువ ధర ఉండడం వల్ల, సాగుకు పెద్దగా ఖర్చు లేకపోవడం వల్ల దీనిని కొర్రమేను, అమెరికన్ క్యాట్‌ఫిష్‌గా నమ్మించి కొంతమంది అక్రమ సాగుదారులు అమ్మకాలు సాగిస్తున్నారు. సాధారణంగా మంచి రకం చేపలు (బొచ్చా, కోర్రమీను తదితరాలు) కిలోకు రూ.200–600 వరకు దొరుకుతాయి. అదే క్యాట్‌ఫిష్ అయితే కేవలం రూ.60–90కే దొరుకుతున్నది. అక్రమార్కులు వీటిని కొనుగోలు చేసి మంచిరకం చేపల కింద హోటళ్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కోల్‌కతా, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాల్లో బాగా డిమాండ్ ఉంది. అందుకే స్మగ్లింగ్ ముఠాలు లాభాలే పరమావధిగా వీటి పెంపకంపై మొగ్గు చూపుతున్నాయని మత్స్యశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణానికీ హాని..

సాధారణంగా చేపలు నీటిలోని నాచు, గడ్డిని తిని బతుకుతాయి. కానీ, క్యాట్‌ఫిష్ పూర్తిగా మాంసాహారి. మిగతా చేపలను బతకనివ్వదు. ఒక ప్రాంతంలో పది క్యాట్‌ఫిష్‌లను వేస్తే ఏడాది తిరిగే సరికల్లా లక్ష క్యాట్‌ఫిష్‌లుగా పునరుత్పత్తి జరుగుతుంది. వీటి పెంపకం కోసం చేపట్టే చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను వేస్తున్న కారణంగా భూగర్భజలాలు కలుషితమై పర్యావరణానికి ముప్పు కలుగుతోంది. ఈ చేపల పెంపకంతో పర్యావరణం దెబ్బతినడమే కాకుండా భూగర్భ జలాలు, వాతావరణం కలుషితమవుతుంది. ఈ చేపలను తింటే తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే సుప్రీంకోర్టు దీనిని నిషేధించింది.



వలంటీర్లకు సీపీఐ మద్దతు

ప్రత్యక్ష పోరాటం కోసం ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: వలంటీర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్‌ను సీపీఐ ఏర్పాటు చేసింది. దాదాపు 18 మంది వలంటీర్లతో కలిపి మొత్తం 21 మందితో ఈ అసోసియేషన్ ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడిగా గుజ్జుల ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరుచూరి రాజేంద్ర(ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు) ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా జగదీశ్, ప్రధాన కార్యదర్శిగా రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లంకా గోవిందరాజులు, ఉపాధ్యక్షులుగా సరోజిని, వాసు, రాజేశ్, కార్యదర్శులుగా జంగాల చైతన్య, రసూల్, శ్యామల, యామిని తదితరులతో నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. వీరి సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర మాట్లాడుతూ.. 'ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతన బకాయిలు వెంటనే అందజేయాలి. ఎన్నికల సమయంలో రాజీనామా చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలి. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం నుంచి 14వ తేదీ వరకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులకు లేఖలు పంపిస్తాం. అయినా న్యాయం చేయకపోతే 16వ తేదీ తర్వాత సీఎం, డిప్యూటీ సీఎంలకు వలంటీర్ల గోడును తెలియజేసేందుకు నివేదన కార్యక్రమం నిర్వహిస్తాం' అని చెప్పారు.

తెలంగాణ

ఇన్‌స్టాగామ్ పరిచయం... యువతి ప్రాణం తీసింది

ప్రేమ వేధింపులు తాళలేక బలవన్మరణం

పటాన్‌చెరు టౌన్: ప్రేమ వేధింపులు తాళలేక బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు కూతురు తేజస్విని(20) నర్సాపూర్ సమీపంలోని న్యూ ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన గువ్వ శ్రీహరి ఐదు నెలల క్రితం ఇన్‌స్టాగామ్ ద్వారా తేజస్వినికి పరిచయమయ్యాడు. అప్పటినుంచి ప్రేమిస్తున్నానని, తనను పెళ్లి చేసుకోకపోతే మీ కుటుంబ సభ్యులను చంపేస్తానని యువతిని బెదిరించడం మొదలుపెట్టాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువతి గురువారం రాత్రి ఇంటి నాలుగో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి తేజస్విని మృతి చెందింది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అరుదైన మూలకాలు!

- 562 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఉన్నట్లు గుర్తింపు
- ఖనిజాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిన రాష్ట్ర గనుల శాఖ

సిరిసిల్ల: మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌ల వంటి అధునాతన సాంకేతిక పరికరాల్లో ఉపయోగించే అరుదైన మూలకాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్–ఆర్ఈఈ) నిల్వలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నట్లు బయటపడింది. జిల్లా పరిధిలో కొనసాగుతున్న మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన మట్టి నమూనాల పరీక్షల్లో ఈ విషయం వెల్లడైంది. తాము చేపట్టిన సర్వేల్లో 17 లోహ మూలకాల (15 రకాల లాంథనైడ్స్‌తోపాటు స్కాండియం, ఏట్రియం)ను గుర్తించినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) రాష్ట్ర గనులశాఖకు అందించిన నివేదికలో పేర్కొంది. దీంతో రాష్ట్ర గనులశాఖ సైతం క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) ద్వారా సర్వే నిర్వహించగా 562.47 చదరపు కిలోమీటర్ల పరిధిలో మూలకాలు విస్తరించి ఉన్నాయని గుర్తించింది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఖనిజాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరుతూ రాష్ట్ర గనుల శాఖ నివేదిక పంపింది. ఈ మూలకాలను పూర్తిస్థాయిలో అన్వేషిస్తే బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని గనుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సుప్రీంకోర్టులో కవిత బెయిల్ పిటిషన్

సోమవారం విచారించనున్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కుంభకోణంలో ఆరోపణలపై అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు గురువారం క్రిమినల్ ఎస్ఎల్‌పీ దాఖలు చేయగా శుక్రవారం రిజిస్ట్రీ వెరిఫై చేసింది. అనంతరం సోమవారం కేసుల విచారణ జాబితాలో చేర్చింది. ఈడీ, సీబీఐ కేసుల్లోనూ బెయిల్ కోరుతూ ఈ పిటిషన్ దాఖలైంది. తాజాగా ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేసిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ముందు కవిత పిటిషన్ రానుంది.

పర్యావరణహితంగా పర్వదినాలు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: వినాయకచవితి, స్వాతంత్య్ర దినోత్సవాల సందర్భంగా పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ప్లాన్ ఏ ప్లాంట్ సంస్థ ప్రతినిధులు ఆయన్ని కలిశారు. విత్తనాలతో రూపొందించిన మట్టి గణపతి, జాతీయ జెండాలను (సీడ్ ఫ్లాగ్స్) ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ దైవభక్తి, దేశభక్తిని మిళితం చేస్తూ పర్యావరణ హితంగా ప్లాన్ ఏ ప్లాంట్ సంస్థ చేసిన ఆలోచన చాలా బాగుందని చెప్పారు. ఈ ఆలోచన సమాజ హితంగా ఉందన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 10 : ఆగస్టు : 2024


శుక్రవారం నాగపంచమి సందర్భంగా బెళగావి, బెంగళూరులో నాగుల కట్టకు మహిళల పూజలు

న్యూస్‌రీల్

వసూళ్ల ముఠా అరెస్టు


నిందితురాలు కల్పన

దొడ్డబళ్లాపురం: ఈడీ, ఆర్‌బీఐ అధికారులు తెలుసని, లక్షలు పెట్టుబడి పెడితే కోట్ల లాభం ఇస్తామని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న 7మంది ముఠాని హెబ్బాళ పోలీసులు అరెస్టు చేసారు. చెన్నరాయపట్టణకు చెందిన కల్పన (47)తో పాటు 7మందిని పట్టుకున్నారు. ఈ ముఠాకు కల్పన నాయకురాలని పోలీసులు తెలిపారు. కుడుములి వద్ద వంద కోట్ల ఆస్తి ఉందని, దాన్ని సొంతం చేసుకోవాలంటే అర్జెంట్‌గా రూ.15లక్షలు కావాలని పలువురిని నమ్మించి డబ్బులు వసూలు చేసారు. మోసపోయిన రమేశ్,మాలా అనే ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి ముఠా ఆట కట్టించారు. నిందితుల్లో రిటైర్డు బ్యాంకు మేనేజరు దంపతులు కూడా ఉన్నారు. ఇప్పటివరకు కోట్లాది రూపాయలను వసూలు చేసినట్లు తెలిసింది.

పట్టాలు తప్పిన గూడ్స్


పట్టాలు తప్పిన దృశ్యం

యశవంతపుర: బొగ్గును తరలిస్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ప్రమాదం గోవా–బెళగావి–కారవార సరిహద్దులో జరిగింది. లోంధ వాస్కో రైలు మార్గంలోని దూద్ సాగర్ నుంచి సోనాలిం మధ్య సొరంగ మార్గం– 15 సమీపంలో గూడ్స్ పట్టాలు తప్పింది. వాస్కో నుంచి హొసపేట వద్ద జిందాల్ ఫ్యాక్టరీకి బొగ్గును తీసుకెళ్తుండగా గూడ్స్ పట్టాలు తప్పింది. శుక్రవారం ఉదయం 9:30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఫలితంగా ఈ మార్గంలో తిరిగే యశవంతపుర– వాస్కో (నంబరు 17309), వాస్కో– యశవంతపుర (17310) రెండు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. శుక్రవారం సాయంత్రం బయలుదేరే గోవా ఎక్స్‌ప్రెస్ రైలును దారి మళ్లించినట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. సహాయక చర్యలను చేపట్టారు.

ప్రేమజంట ఆత్మహత్య


సచిన్, ప్రియా (ఫైల్)

యశవంతపుర: పెద్దల పంతాలకు యువతీ యువకుడు బలయ్యారు. ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన బాగలకోట జిల్లా రబకవి బనహట్టి తాలూకా నందగాంవ్ గ్రామంలో జరిగింది. సచిన్ దళవాయి (22), ప్రియా మడివాళర (19) ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని తీర్మానం చేసుకున్నారు. అయితే వారి పెళ్లికి సచిన్ కుటుంబసభ్యులు ఒప్పుకోక పోవటంతో కలిసి జీవించలేమని తీవ్ర వ్యథకు గురయ్యారు. ఇద్దరూ కలిసి చనిపోవడమే మేలనుకున్నారు. గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. మహాలింగపుర పోలీసులు ఘటన స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిల్లే కదా అనుకుంటే..

- రేబిస్‌తో మహిళ మృతి




గంగీబాయి (ఫైల్)

శివమొగ్గ: ఇంట్లో పెంచుకుంటున్న పిల్లి కరవడంతో రేబిస్ వ్యాధి బారిన పడి మహిళ మరణించిన ఘటన జిల్లాలోని శికారిపుర తాలూకా తరలఘట్ట గ్రామంలో జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన గృహిణి గంగీబాయి (44) అనే మహిళ రెండు నెలల క్రితం ఇంట్లో చూసుకోకుండా పిల్లి తోకపై కాలు వేసింది. అప్పుడు పిల్లి ఆమె కాలుపై కరిస్తే, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందింది. రేబిస్ సోకకుండా ముందు జాగ్రత్తగా ఐదు ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉండగా ఒక ఇంజెక్షన్‌ను మాత్రమే తీసుకుని ఏమీ కాదులే అని ఊరుకుంది. పది రోజుల క్రితం ఆమె ఉన్నఫళంగా అనారోగ్యం బారిన పడటంతో శికారిపుర తాలూకా ఆస్పత్రిలో, ఆపై శివమొగ్గలోని ప్రభుత్వ మెగ్గాన్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృత్యువాత పడినట్లు జిల్లా సీజనల్ వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ మల్లప్ప తెలిపారు. పెంపుడు జంతువులు కరిచిన వెంటనే గాయాన్ని యాంటిబయాటిక్ ద్రవం, లేదా సబ్బుతోనైనా శుభ్రంగా కడగాలన్నారు. తరువాత సమీప ఆస్పత్రికి వెళ్లి నెల రోజుల్లో నాలుగు రేబిస్ ఇంజెక్షన్లను వేయించుకోవాలని, అప్పుడే రేబిస్ నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. పిల్లి, కుక్క వంటి జంతువుల కాట్లపై నిర్లక్ష్యం వద్దని ప్రజలకు సూచించారు.

గమ్యం చేరే దారేదీ?



- బెంగళూరు ట్రాఫిక్ మరింత సంక్లిష్టం
- భవిష్యత్తులో వాహన రద్దీకి మరింత ఆజ్యం
- ఒక్కో సిగ్నల్ వద్ద 10 నిమిషాలు వృథా
- నగర భూ రవాణా డైరెక్టరేట్ సర్వేలో నిజాలు


మారతహళ్లిలో ఎప్పుడూ ఇదే దృశ్యం

సాక్షి, బెంగళూరు: సిలికాన్ సిటీ బెంగళూరు అంటే గుర్తొచ్చే ప్రధాన సమస్యల్లో ట్రాఫిక్ ఒకటి. ఉద్యాన నగరి ట్రాఫిక్ నగరంగా కూడా అపఖ్యాతిని మూటగట్టుకుంది. విపరీతమైన ట్రాఫిక్ సంకటం నగరవాసులను పట్టి పీడిస్తోంది. ఈ బెడద రానున్న రోజుల్లో మరింతగా పెరగనున్నట్లు తెలుస్తోంది. ఏ స్థాయిలో ట్రాఫిక్ ఇక్కట్లు పెరగనున్నాయి అంటే ప్రతి ప్రతి సిగ్నల్ కూడలిలో 10 నుంచి 12 నిమిషాలు వేచి చూసే పరిస్థితులు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల బెంగళూరు సంచార నిర్వహణ (ట్రాఫిక్ మేనేజ్‌మెంట్) భవిష్యత్తులో మరింత కఠినం కానుందని బీబీఎంపీ రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసు, నగర భూ రవాణా డైరెక్టరేట్ కార్యాలయం నిర్వహించిన సమీక్షలో తేలింది.

2025లో డేంజర్ బెల్స్

2025 నుంచి బెంగళూరులో ట్రాఫిక్ సమస్య మరింత పెరగనుంది. బెంగళూరులో 162 జంక్షన్లలో కనిష్టంగా 10–11 నిమిషాలు వేచి ఉండే దుస్థితి ఏర్పడనుంది. కేఆర్ సర్కిల్, సిల్క్‌బోర్డు, ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డు, చాళుక్య సర్కిల్, ఎలెక్ట్రానిక్ సిటీ, టౌన్‌హాల్ తదితర 162 కూడళ్లలో ఈ పరిస్థితి ఏర్పడనుంది. ఒక్కో కూడలిని దాటేందుకు కనిష్టంగా 10 నిమిషాలు సమయం పట్టవచ్చు. ఇప్పటికే సిల్క్‌బోర్డు సిగ్నల్‌లో వాహనాలు కనీసంగా ఐదారు నిమిషాలు వేచి ఉండాల్సి వస్తోంది.


బెంగళూరు జేసీ రోడ్డులో..
పరిష్కారాలకై అన్వేషణ

రోడ్డు విస్తరణ ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు చెక్ పెట్టాలంటే అందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఉంది. బీబీఎంపీ ద్వారా రోడ్డు విస్తరణ గురించి ప్రస్తుతం సర్వే నిర్వహిస్తోంది. అయితే ఈ సర్వే పూర్తి కావాలంటే చాలా సమయం పడుతుంది. న్యాయపరంగానూ ఆలస్యమవుతుంది. రోడ్ల విస్తరణ కంటే సొరంగ మార్గాలు, పై వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం మంచి పరిష్కారం అవుతాయి. అలాగే పార్కింగ్ సమస్య కూడా బెంగళూరును వేధిస్తోంది. పబ్లిక్ పార్కింగ్‌కు చోటు దొరకడం లేదు.

రోడ్లపై రెట్టింపు వాహనాలు

- ప్రస్తుతం బెంగళూరు రోడ్లు కేవలం 50 లక్షల వాహనాలు నడిచేందుకు అనువుగా ఉన్నాయి. అయితే వాహనాల సంఖ్య అంతకు రెండు రెట్లు ఎక్కువగా ఉంది.
- బెంగళూరు రోడ్లపైకి ప్రతి రోజూ రెండు వేల కొత్త వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. నేడు రాజధానిలో సుమారు 1.18 కోట్ల వాహనాలు ఉన్నాయి.
- రానున్న నాలుగు నెలల్లో కొత్తగా మరో 2 లక్షల వాహనాలు చేరవచ్చు. 2024 చివరి నాటికి 1.21 కోట్ల వాహనాలు బెంగళూరులో ఉండే అవకాశం ఉంది.
- నిత్యం పొరుగు రాష్ట్రాల నుంచి, ఇతర జిల్లాల నుంచి బెంగళూరుకు వచ్చే వాహనాల సంఖ్య సుమారు లక్ష దాకా ఉంటోంది.

మంత్రి జార్కిహొళికి సమన్లు

దొడ్డబళ్లాపురం: హిందూ మతం పట్ల అవమానకరంగా వ్యాఖ్యలు చేశారనే కేసులో మంత్రి సతీష్ జార్కిహొళికి కోర్టు సమన్లు జారీ చేసింది. 2022 సెప్టెంబర్‌లో బెళగావి జిల్లా నిప్పాణిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ మతం గురించి అవమానకరంగా మాట్లాడారు. హిందూ అనే పదమే అశ్లీలమని, భారత్‌కు హిందూ పదానికి సంబంధం లేదని అన్నారు. దీంతో దిలీప్ కుమార్ అనే వకీలు స్థానిక కోర్టులో ప్రైవేటు కేసు వేశారు. ఒక ప్రజాప్రతినిధి ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడి మతాల మధ్య చిచ్చు రేపేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

బావిలో దూకి తల్లీ పిల్లల ఆత్మహత్య

- శివమొగ్గ జిల్లాలో ఘోరం


ఘటన జరిగిన బావి

శివమొగ్గ: ఎంత కష్టం వచ్చిందో గానీ ఓ తల్లి ఘోర నిర్ణయం తీసుకుంది. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు పిల్లలు, తల్లి ఉదయానికల్లా ఓ ఇంటి సమీపంలోని బావిలో శవమై తేలిన ఘటన జిల్లాలోని హొసనగర తాలూకా చంపాపుర గ్రామంలో వెలుగు చూసింది. వివరాలు.. రాజేష్ అనే వ్యక్తి భార్య వాణి (32), వారి ఇద్దరు పిల్లలు సమర్థ్(12), సంపద (6). వాణి పిల్లలను తీసుకుని గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త ఎన్నిచోట్ల వెదికినా ఆచూకీ లేదు. శుక్రవారం ఉదయం పొరుగున ఉన్న ఇంటి పక్కన బావిలో తల్లీపిల్లల మృతదేహాలు తేలుతుండటంతో కలకలం రేగింది. భర్త, స్థానికుల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మొదట పిల్లలను పడేసి, ఆపై వాణి దూకి ఉంటుందని అనుమానిస్తున్నారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యలకు కారణం కావచ్చని సమాచారం. ఇన్‌స్పెక్టర్ రమేష్, పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

సర్కారును పెకలించడమే లక్ష్యం: యడ్డి

మైసూరు: ఎవరు రాజకీయ సన్యాసం తీసుకోవాలో త్వరలోనే తేలుతుందని బీజేపీ మాజీ సీఎం యడియూరప్ప అన్నారు. ఆయన శుక్రవారం మైసూరులోని చాముండిబెట్ట వద్ద విలేకరులతో మాట్లాడుతూ తనపై సీఎం సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలకు దీటుగా స్పందించారు. ఎవరు ఏమవుతారో త్వరలో తేలుతుందన్నారు. సీఎంగా సిద్దరామయ్య భార్య పేరిట విలువైన స్థలాలను కేటాయించారన్నారు. ఇంతకు ముందు ఎప్పుడైనా ఇలాంటిది జరిగిందా? అని అన్నారు. అది క్షమించరాని నేరం, అందుకే పోరాటం చేస్తున్నాం, ఈ అవినీతి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సారథ్యంలో పాదయాత్ర చేస్తున్నారన్నారు. శనివారం మైసూరులో జరిగే తమ చారిత్రక సమావేశంలో సుమారు 3 లక్షల మందికి పైగా పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడాలని చాముండేశ్వరి దేవిని ప్రార్థించినట్లు చెప్పారు. తర్వాత ఆయన మైలారి హోటల్‌కు వెళ్లి దోసె ను ఆరగించారు.

స్కాములతో సంబంధం లేదు


సమావేశాన్ని ప్రారంభిస్తున్న సీఎం తదితరులు


సభకు హాజరైన జన సందోహం

- సీఎం సిద్దరామయ్య
- మైసూరులో జనాందోళన సభ
- గవర్నరుపై ఆగ్రహం

మైసూరు: ముడా, వాల్మీకి మండలిలో జరిగిన కుంభకోణాలతో నాకు సంబంధం లేదు. నన్ను ఈ కేసులో ఇరికించేందుకు కుట్ర జరుగుతోంది. నా రాజీనామాను డిమాండ్ చేస్తూ జేడీఎస్ బీజేపీ పాదయాత్ర చేస్తున్నాయి. దీనికి నేను భయపడేది, తలొంచేది లేదు అని సీఎం సిద్దరామయ్య అన్నారు. శుక్రవారం మైసూరులోని మహారాజా కళాశాల మైదానంలో జరిగిన కాంగ్రెస్ జనాందోళన మహాసభను బాకా ఊది ప్రారంభించిన ఆయన.. వాల్మీకి అభివృద్ధి మెంట్ కార్పొరేషన్‌లో రూ.84 కోట్ల అవినీతి జరిగిన మాట వాస్తవమేనన్నారు. సిట్ విచారణ జరిపి మొత్తం రూ.46 కోట్లు రికవరీ చేశారన్నారు. ఈ కేసులో ఆర్థిక శాఖ పాత్ర లేదు. నా ప్రమేయం లేదు. అయినప్పటికీ ఈడీ సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోందని అన్నారు. ఇప్పుడు ముడా స్థలాల పేరుతో నాపై, నా భార్యపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థలాల్లో ఎలాంటి గోల్‌మాల్ జరగలేదని ఆయన ఏకరువు పెట్టారు. అయినప్పటికీ గవర్నర్ గెహ్లాట్ హడావుడిగా నాకు నోటీసులు జారీ చేశారు, నాపై ఫిర్యాదు చేసిన అబ్రహాంకు బ్లాక్‌మెయిల్ కేసులో కోర్టు రూ. 25 లక్షల జరిమానా విధించిందన్నారు. బీజేపీకి చెందిన శశికళ జొల్లె, మురుగేష్ నిరాణిపై ఫిర్యాదు చేసి రెండేళ్లు దాటింది. అయినా వారికి గవర్నర్ నోటీసు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా యడియూరప్ప, విజయేంద్ర తదితరులపై ఆరోపణలతో దాడి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పెద్దసంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వేలాది మంది సభకు వచ్చారు.

సిద్దుకు నేను కాపలా ఉంటా

- సభలో డీసీఎం డీకేశి

మైసూరు: నన్ను మొండోడు అంటారు. ఈ మొండోడు సిద్దరామయ్య వెన్నంటి ఉన్నాడు. మా వెంట 136 మంది ఎమ్మెల్యేలున్నారు. సిద్దరామయ్యను బీజేపీ, జేడీఎస్ వారు గద్దె దింపలేరని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. మైసూరులో జరిగిన కాంగ్రెస్ జనాందోళన సభలో డీకే ప్రసంగించారు. ఎవరు రాజీనామా ఇస్తారో కాలమే నిర్ణయిస్తుందన్నారు. సీఎం సిద్దరామయ్య రాజీనామా కావాలా? అంటూ విపక్ష నేతలను ఏకవచనంతో ప్రశ్నించారు. ఈ మొండోడు సీఎంకు ఎల్లప్పుడూ కాపలా ఉంటాడు. ఈ జన్మలో మీరు ఏమీ చేయలేరు. వచ్చే పదేళ్లలో కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది అని అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర జరుగుతోందన్నారు. ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య అధికార దుర్వినియోగానికి పాల్పడలేదన్నారు. గతంలో మీ తండ్రి యడియూరప్ప రెండు సార్లు జైలుకు ఎందుకు వెళ్లారు, విదేశాల్లోని లక్ష్మీ విలాస్ బ్యాంకుకు ఎందుకు నగదు బదిలీ అయిందో చెప్పాలని బీజేపీ నేత విజయేంద్రకు ప్రశ్నించారు. సుద్దపూస అని చెప్పుకుంటున్న హెచ్‌డీ కుమారస్వామి గతంలో డీనోటిఫై చేసిన 50 కేసులను బయటకు తీస్తామని చెప్పారు.

చకచకా కూటమి పాదయాత్ర


మైసూరు వైపు సాగుతున్న పాదయాత్ర

మండ్య: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ, జేడీఎస్ కూటమి చేస్తున్న చలో మైసూరు పాదయాత్ర శుక్రవారం 7వ రోజు మండ్య జిల్లాలోని శ్రీరంగపట్టణం నుంచి మైసూరు వైపు కదిలింది. వేలాది మంది కార్యకర్తలు, ఎక్కువగా జేడీఎస్‌వారు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, సీనియర్లు జగదీశ్ శెట్టర్, అశ్వథ్‌నారాయణ, ఎంపీ యదువీర్ ఒడెయార్, బి.శ్రీరాములు, ఆర్. అశోక్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నడిచారు. గురువారం మండ్య తూబినకెరె నుంచి మొదలైన యాత్ర రాత్రి 10 గంటలకు శ్రీరంగ పట్టణం చేరుకుంది. శుక్రవారం ఉదయం మళ్లీ నడక సాగించారు. జేడీఎస్ యువ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి కొబ్బరికాయ కొట్టి భూమాతకు నమస్కారం చేసి పాదయాత్రలో సాగారు. శ్రీరంగపట్టణం పశ్చిమ వాహిని వద్ద నేతలకు కొబ్బరి, బెల్లం, మోసంబిల భారీ హారం వేశారు. పాదయాత్ర నేడు మైసూరుకు చేరుకోవడంతో ముగుస్తుంది. బృహత్ బహిరంగ సభకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

ఉన్మాది ఘాతుకం

- మహిళపై పిచ్చివాని దాడి
- బెంగళూరులో దురాగతం


రక్తపు మడుగులో మహిళ


దుండగున్ని పట్టుకున్న స్థానికులు

యశవంతపుర: బెంగళూరులో మహిళలపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇంటా బయటా భద్రత లేకుండా పోతోందనే విమర్శలున్నాయి. హాస్టల్‌లోకి ప్రియుడు చొరబడి యువతిని పొడిచి చంపడం తెలిసిందే. ఇంతలోనే రోడ్డుపై వెళుతున్న మహిళపై పిచ్చివాడు దాడి చేసిన ఘటన బెంగళూరులో జరిగింది.

ఏం జరిగిందంటే..

వివరాలు.. ఏపీలోని వైఎస్సార్ జిల్లా కడప నగరానికి చెందిన సునీత (40) ఇద్దరు పిల్లలతో కలిసి కొడిగేహళ్లి పోలీసు స్టేషన్ పరిధిలోని సహకార నగరలో నివాసం ఉంటోంది. భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సునీత గురువారం సాయంత్రం రోడ్డుపై పిల్లలను సమీప స్టేడియంలో వదిలి, వాకింగ్ చేస్తుండగా మతిస్థిమితం లేని ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె తలపై బండరాయితో పదేపదే బాదాడు. తల నుంచి తీవ్ర రక్తస్రావమై ఆమె కుప్పకూలింది. ఇంతలో స్థానికులు దుండగున్ని పట్టుకొని చితకబాదారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దుండగున్ని అదుపులోకి తీసుకెళ్లారు. సంఘటన దృశ్యాలు వైరల్ అయ్యాయి. నిందితున్ని గోపాల్‌గా గుర్తించాం, అతడు విచారణకు సహకరించడం లేదు అని పోలీస్ కమిషనర్ దయానంద తెలిపారు.

తేలుతో ఆటాడుకుంటాం


చేతిపై తేలుతో బాలిక


మెడపై వేసుకున్న బాలుడు


ఓ మహిళ ధైర్యం

- యాదగిరి జిల్లా కొండమ్మవ్వ ఆలయంలో వింత ఆచారం
- నాగపంచమి రోజున తేళ్లతో భక్తుల సయ్యాట


పసికందు చేతిపై పెద్ద తేలు

రాయచూరు రూరల్: రాష్ట్రమంతటా శుక్రవారం నాగపంచమిని జరుపుకొంటే, జిల్లా సరిహద్దులోని ఓ గ్రామ ప్రజలు విభిన్నంగా తేళ్ల పంచమిని ఆచరించారు. యాదగిరి జిల్లా గుర్మిట్కల్ తాలూకా కందుకూరు సమీపంలోని కొండమవ్వ అమ్మవారి సన్నిధిలో తేళ్ల పంచమి పండుగ జరిగింది. గుట్టపై అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు, తరువాత ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తీసినా వాటి కింద తేళ్లు కనిపించాయి. చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా ఉత్సాహంగా తేళ్లను పట్టుకొన్నారు. అవి కాటేస్తాయన్న భయం ఏ కోశాన కనిపించలేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది.

కుట్టకపోవడం వింత

కొందరు తల, చెవులు, మెడ, నాలుకపై తేళ్లను ఆడించి ఆనందపడ్డారు. ఈరోజున తేళ్లను పట్టుకున్నా శరీరంపై పాకించినా అవి కుట్టనే కుట్టవు. అమ్మవారి మహిమ ఇందుకు కారణమని భక్తుల విశ్వాసం. శ్రావణంలో తేలు పూజల వల్ల అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్న నమ్మకంతో వందలాది భక్తులు తరలిస్తారు. పాలు, నువ్వులు, బెల్లం తదితర పదార్థాల వంటకాలను గుట్టపై ఉంచి పూజలు చేస్తారు. కర్ణాటకతో పాటు పొరుగున ఉన్న తెలుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తారు.


నేను పట్టుకున్నా.. ఏమీ చేయలేదు

క్లుప్తంగా

కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు



అందోళన చేస్తున్న సంయుక్త పోరాట సమితి నాయకులు

రాయచూరు రూరల్: కార్పొరేట్ రంగాలను దేశం నుంచి తరిమివేయాలని సంయుక్త పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ సంఘం సంచాలకుడు చామరస మాలి పాటిల్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయన్నారు. దేశస్వాతంత్ర్యం కోసం నాడు తెల్లదొరలను దేశం నుంచి తరిమివేయాలని ఉద్యమించామని, ఇప్పుడు కార్పొరేట్ యాజమాన్యాలపై ఉద్యమించాల్సి వస్తోందన్నారు. కార్మికుల సంక్షేమాన్ని కాలరాస్తూ కొత్త చట్టాలు తెచ్చారని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

నారదగడ్డ క్షేత్రం ఆస్తులను పరిరక్షించాలి

రాయచూరురూరల్: తాలూకాలోని పవిత్ర పుణ్యస్థలం నారదగడ్డ క్షేత్రం ఆస్తుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని రైతు సంఘం అధ్యక్షుడు కాశీం నాయక్ ఆరోపించారు. శుక్రవారం ఆయన పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. నారదగడ్డ పుణ్యక్షేత్రానికి సంబంధించి చెన్న బసవస్వామి మఠం పరిధిలో 1200 ఏకరాల మాన్యం భూములున్నాయన్నారు. మఠం ఆస్తులు తన వంటూ కొందరు కోర్టు మెట్లెక్కారన్నారు.

వేతనం అందక ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న అప్సర్

రాయచూరు రూరల్: వేతనం అందలేదని కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్సర్ అనే వ్యక్తి రాయచూరు నగరసభలో కాంట్రాక్ట్ పద్ధతిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఏడు నెలలుగా వేతనం రాకపోవడంతో గురువారం సాయంత్రం నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యను కలిసి తన గోడు విన్నవించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం గడవడం కష్టంగా ఉందని వాపోయాడు. జీతం విడుదల చేయాలని కోరగా అధికారులు స్పందించలేదు. దీంతో వేదనకు గురైన అప్సర్ విషం సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సదర్‌బజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారని సీఐ ఉమేష్ కాంబ్లే తెలిపారు.

భారీ వర్షాలతో ముంపు ముప్పు



జేవర్గి వద్ద నీటిలో మునిగిన రోడ్డు వంతెన

రాయచూరు రూరల్: మహారాష్ట్ర పైభాగంలో అధికంగా వానలు కురుస్తుండడంతో ఉత్తర కర్ణాటక, కళ్యాణ కర్ణాటకలోని కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాలు ఇంకా వరద ముంపు నుంచి పూర్తిగా బయట పడలేదు. కలబుర్గి జిల్లా దుత్తరిగి భాగ్యమ్మ, గాణగాపుర దత్తాత్రేయ, మణ్ణూరు యల్లమ్మ దేవస్థానాలు నీటిలో మునిగాయి. భీమా నది నుంచి 1.60 లక్షల క్యూసెక్కుల నీ రు వదిలారు. కలబుర్గి-అఫ్జల్‌పుర, జేవర్గి తాలూకాల మధ్య నదిపై ఉన్న వంతెనలు వరద నీటితో నిండాయి. నదీ తీర ప్రాంతాల ప్రజలు ముంపు భయాందోళన చెందుతున్నారు.

సవరించిన వేతనాల కోసం ధర్నా



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

హొసపేటె: ప్రభుత్వం నుంచి సవరించిన వేతనాల కోసం కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం గుల్బర్గా విశ్వవిద్యాలయం ముందు ధర్నా ప్రారంభించారు. గత 10–15 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన యూనివర్సిటీలో మొత్తం 315 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు. గత 2 ఏళ్లుగా ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం వేతనాలు సవరించినా ఈ విషయంలో ఛాన్సలర్, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సవరించిన వేతనాల గురించి లేఖల ద్వారా ఛాన్సలర్‌ను అభ్యర్థిస్తున్నామన్నారు.అన్యాయానికి వ్యతిరేకంగా హక్కుల కోసం, తమకు న్యాయం జరిగే వరకు ఉద్యమించాలని నిర్ణయించామని కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపారు.



నాట్లకు వరినారును సిద్ధం చేస్తున్న కూలీలు



ఆయకట్టులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఆయకట్టులో జోరుగా వరినాట్లు

- తుంగభద్ర డ్యాం నుంచి కాలువలకు నీటి విడుదలతో రైతుల హర్షం
- గతేడాది నష్టాలు పూడతాయని కోటి ఆశలతో పంటల సాగుకు సన్నద్ధం

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు వల్ల తుంగభద్ర ఆయకట్టు రైతులు కన్నీరు పెట్టుకున్నారు. సాధారణంగా తుంగభద్ర ఆయకట్టు కింద ఖరీఫ్‌తో పాటు రబీ పంటలు రెండూ పండించేందుకు తగినంత నీరు చేరేది. అయితే గత ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, మిర్చి పంటలను పండించేందుకు కూడా తగినంత నీరు చేరకపోవడంతో అష్టకష్టాలతో ఖరీఫ్‌ను గట్టెక్కించుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ఖరీఫ్‌లో నష్టాలు చవిచూసిన రైతులకు రబీలో నీరు లేకపోవడంతో క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో తుంగభద్ర ఆయకట్టు కింద ఉన్న లక్షలాది ఎకరాల సాగు భూములు బీడుభూములుగా మారాయి. వేలాది మంది రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోవడమే కాకుండా కనీసం ఉపాధి లేక వలస పట్టారు. ఇది గత ఏడాది తుంగభద్ర ఆయకట్టు రైతుల దయనీయ పరిస్థితి. ఈ ఏడాది తుంగభద్ర ఆయకట్టు రైతుల పరిస్థితి కాస్త ఆశాజనకంగా కనిపిస్తోంది. తుంగభద్ర డ్యాంలో 33 గేట్లు ఎత్తే పండగ వాతావరణం సాధారణంగా ఆగస్టు 15 నాటికి వస్తే ఎంతో హర్షించేవారు. అయితే ఈ ఏడాది ముందుగానే తుంగభద్ర డ్యాం భర్తీ కావడంతో జూలై రెండో వారం నుంచే దిగువకు తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతోంది.

వరదలతో టీబీ డ్యాంకు జలకళ

డ్యాంలో గరిష్ట నీటి నిల్వ 100 టీఎంసీలకు వరకు ఉంచుకుని మిగిలిన నీటిని నదికి వదిలేస్తున్నారు. డ్యాం పరిధిలోని హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, ఎల్‌బీఎంసీ, రాయబసవ కాలువతో పాటు అన్ని కాలువలకు సాగునీరు విడుదల చేశారు. దీంతో సకాలంలో కాలువలకు నీరు విడుదల చేయడంతో పాటు తుంగభద్ర డ్యాం నిండుకుండలా తొణికిసలాడుతుండటంతో ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు నీటి సమస్య ఉండబోదన్న నమ్మకంతో రైతన్నలు ఉత్సాహంగా వరినాట్లు వేస్తున్నారు. ముందుగా వరినారు పోసుకున్న రైతుల నుంచి వరిపైరు కొనుగోలు చేసుకుని ఆయకట్టు పరిధిలో ఎటు చూసినా నాట్లు వేసే పనిలో రైతన్నలు బిజీబిజీగా గడుపుతున్నారు. ముందుగా దుక్కులు కూడా దున్ని పొలాలను సిద్ధంగా ఉంచుకోవడంతో కాలువల నుంచి నేరుగా బీడుభూముల్లోకి నీరు తీసుకుని ట్రాక్టర్లలో బురదమడులను దున్ని నేరుగా వరినాట్లు వేస్తున్నారు. రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు చేతినిండా పనులు ఉండటంతో పొలాల్లో రైతులు, వ్యవసాయ కూలీలతో ఎటు చూసినా జనసందోహంతో పొలాలు పండుగ వాతావరణంలో కళకళలాడుతున్నాయి.

రైతులు, కూలీలకు చేతినిండా పనులు

వరినాట్లు వేసే వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనుల కంటే ఎక్కువగా గిట్టుబాటు అవుతుందని కూలీలు సంతోషం వ్యకం చేస్తున్నారు. వరినాట్లు నెల రోజులకు పైగా కొనసాగే అవకాశం ఉండటంతో మహిళా కూలీలకు వరినాట్లు వేసే పనులు దొరుకుతుండటంతో ఉపాధితో పాటు ఆయకట్టును కళకళలాడే విధంగా కష్టపడి పని చేస్తున్నారు. జిల్లాలోనే కాకుండా రాయచూరు, కొప్పళ, విజయనగరతో కలిపి నాలుగు జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో వరినాట్లు వేసే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. తుంగభద్ర ఆయకట్టులో ప్రధానంగా వరి పంటపైనే రైతులు ఆధారపడుతున్నారు. వరితో పాటు కొందరు మిర్చి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు కూడా సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుని, వాటిల్లో కూడా సకాలంలో విత్తనం విత్తే కార్య'కమానికి సిద్ధం అవుతున్నారు. గత ఏడాది తుంగభద్ర ఆయకట్టు రైతులు నష్టాలు చవిచూసిన తరుణంలో ఈ ఏడాది కోటి ఆశలతో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి కష్టాల నుంచి బయటపడతామనే ఆశతో రైతులు వ్యవసాయ పనులకు ముందుకు కదులుతున్నారు.



ట్రాక్టరుతో దుక్కి దున్నుతున్న దృశ్యం

16 మంది గంజాయి విక్రేతలు అరెస్ట్

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ జంట నగరాల్లో శుక్రవారం గంజాయి విక్రయానికి పాల్పడుతున్న మరో 16 మందిని పోలీసులు కార్యాచరణ చేపట్టి అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.4 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జంట నగరాల పోలీస్ కమిషనర్ శశికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. నగరంలోని బెండిగేరి పోలీస్ స్టేషన్ పరిధిలో కేఈబీ గ్రిడ్ దగ్గర గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన సీసీబీ పోలీసులు కేశవ చంద్ర, నీలాంబర రావు, ఉత్తరాఖండ్ మహమ్మద్ అలీ, హావేరి తాసిఫ్ అహ్మద్, పాత హుబ్లీ పవన్, సిద్దార్థ్, మంజునాథ్, నదీం, విఠల్, షానవాజ, కమరిపేట గణపతసా, చెన్నపేట కార్తీక్ అనే నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 2.5 కేజీల గంజాయి, ఓ స్విఫ్ట్ డిజైర్ కారు, రెండు కత్తులు, ఒక డ్రాగర్‌తో పాటు 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీసీబీ ఏసీపీ ఎస్పీ యడివార్ మార్గదర్శకత్వంలో సీసీబీ సీఐ మారుతీ గుల్లారి, ప్రభు, బెండిగేరి ఎస్ఐ అలీషేక్ ఈ దాడిలో పాల్గొన్నారు. కాగా దాడి వేళ నిందితుల్లో ఒడిసాకు చెందిన కేశవచంద్ర, నీలాంబర, హావేరి తాసిఫ్ అహ్మద్ పంచనామాకు వెళుతున్న సందర్భంగా పోలీసులపై దాడి చేసి పరారవడానికి ప్రయత్నించగా వారిని గాలించి తిరిగి అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీస్ సిబ్బంది పాటిల్, ఎద్దేరికి గాయాలు కాగా కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై బెండిగేరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా మరో ఘటనలో ధార్వాడ కొలికేరి సత్యంబ్లి బావి దగ్గర బహిరంగ స్థలంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ధార్వాడ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ స్టేషన్ సీఐ ఎన్‌సీ కాడదేవర ఆధ్వర్యంలో సోలాపుర సైఫలీ సుతార్, సంకేత్ కోత్, ధార్వాడ సందీప సలకే, హజరత్ అలీ అలియాస్ పాడ మకాన్‌దార్ అనే వారిని అరెస్ట్ చేసి వారి నుంచి 19.42 గ్రాముల గంజాయి, రెండు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, ఓ కాలేజీ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో టౌన్ ఎస్ఐ ఆర్ఎస్ దానప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపం



చిత్ర పటాలకు పుష్పాంజలి సమర్పించిన నేతలు

రాయచూరు రూరల్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, రైతు నేత బీజాపూర్ గాంధీ భీమసి కలాదగి, రాయచూరు జిల్లా మాన్వి తాలూకా నీరమాన్వి కవి రాజశేఖర్‌ల మృతికి సీపీఐ(ఎం) సంతాపం వ్యక్తం చేసింది. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య ప్రజల సమస్యలపై, రైతు నేత బీజాపూర్ గాంధీ భీమసి కలాదగి రైతుల సమస్యలపై, కవి రాజశేఖర్ కన్నడ భాషాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ముగ్గురి చిత్రపటాలకు పుష్పాంజలి సమర్పించారు. సంతాప సభలో పద్మ, శరణ గౌడ, పాషా, శ్యాం, రసూల్, నాగేంద్ర, రాఘవేంద్ర పాల్గొన్నారు.

1225 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ సిటీ కార్పొరేషన్ పరిధిలోని బంకాపుర చౌక్ దగ్గర నిషేధిత, ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ నిల్వలను కార్పొరేషన్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. ఈ నేపథ్యంలో పాలికె హెల్త్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ శాఖ సంయుక్తంగా కుమార్ లాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీపై దాడి చేసి ఆ మొత్తం ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఇందులో నిషేధిత ప్లాస్టిక్, ఇతర క్యారీ బ్యాగ్‌లు, కిరాణి ప్లాస్టిక్ స్వాధీనం చేసుకొని బాధ్యులకు రూ.40 వేలు జరిమానా విధించారు. ఈ దాడిలో పాలికె హెల్త్ ఇన్‌స్పెక్టర్ నూరందప్ప భజంత్రి, శివరాజ్, దీపక్ ఆర్.బుడ్డప్ప, మంజునాథ్ కెంపన్నవర్, ఇతర పారిశుద్ధ్య సిబ్బంది కూడా పాల్గొన్నారు.

దోసెలు తిని విద్యార్థులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థులు

కోలారు : దోసెలు తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈఘటన తాలూకాలోని వేమగల్ అంబేడ్కర్ హాస్టల్లో శుక్రవారం చోటు చేసుకుంది. చౌడేశ్వరి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అమ్మనల్లూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు అంబేడ్కర్ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్నారు. శుక్రవారం ఉదయం దోసెలు తిన్నవారిలో 5 మందికి వాంతులు కాగా మరికొంతమంది కడుపు నొప్పితో బాధపడ్డారు. ఐదు మందిని చింతామణి ఆస్పత్రికి, మిగిలిన విద్యార్థులను అమ్మనల్లూరు పీహెచ్‌సీలకు తరలించారు. విద్యార్థులు కోలుకుంటున్నారని వైద్యాధికారి అక్షయకుమార్ తెలిపారు. చింతామణి ఆస్పత్రికి సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసన్, వేమగల్ పోలీసులు, కోలారు తహసీల్దార్ డాక్టర్ నయన వెళ్లి విద్యార్థులను పరామర్శించారు.

కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లాలి



గాంధీవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ కంపెనీల తీరును నిరసిస్తూ సంయుక్త పోరాట సమితి, వివిధ సంఘటనల కార్యకర్తలు శుక్రవారం నగరంలోని గాంధీవనం వద్ద క్విట్ ఇండియా తరహా ప్రతిఘటన నిర్వహించారు. కేపీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెల్లదొరల తరహాలో కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్నాయన్నారు. వీరిని దేశం నుంచి వెళ్లగొట్టడానికి క్విట్ ఇండియా వంటి ఉద్యమం చేయాలన్నారు. ప్రధాని మోదీ కార్మికుల హితవును కాపాడడానికి బదులుగా కార్పొరేట్ కంపెనీలకు ఎర్ర తివాచి పరుస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు అబ్బణి శివప్ప మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజెల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, సామాన్య ప్రజల జీవితం దుర్భరంగా మారుతోందన్నారు. ప్రతిఘటనలో కేపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్, జిల్లా కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్, గాంధీనగర నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగ పంచమి



పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



పిల్లలకు పాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: శ్రావణ మాసం మహిళలకు వ్రతాలు, నోముల పండుగలకు నిలయం .శుక్రవారం నాగ పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. నగరంలోని నాగేంద్రుని కట్ట వద్ద నాగ ప్రతిమలు, పుట్టలకు మహిళలు పాలు పోసి తమ కోర్కెలు తీర్చాలని కోరుకుంటటూ తమ మొక్కులు తీర్చుకున్నారు. కాగా శ్రావణ మాసంలో నాగ పంచమి వేడుకల్లో భాగంగా నాగ ప్రతిమలకు, పుట్టలకు పాలు పోసే బదులు పిల్లలకు పాలు పంపిణీ చేశారు. నగరంలోని జనతా కాలనీ, బసవ కేంద్రంలో అధ్యక్షుడు రాచనగౌడ పిల్లలకు పాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అపౌష్టికతతో నలిగి పోతున్న 40 లక్షల మంది చిన్నారుల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పాములు పాలు తాగవని అన్నారు.

బురదమయంగా రోడ్లు.. ప్రజలకు తప్పని పాట్లు

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా గుడేకోట గ్రామంలోని మూడో వార్డు ప్రజలు రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలోని రామలింగేశ్వరాలయం పక్కన ఉన్న ఈ సందులో రెండేళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఇళ్ల నుంచి మురుగునీరు, వర్షపు నీరు రోడ్డు పైకి చేరుతోంది. దీంతో 3వ వార్డులో అపరిశుభ్రంగా ఉన్న జేజేఎం పనుల కోసం తవ్విన గోతిని మూసివేశారు. దీంతో వీధి ప్రజలు తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్గమధ్యలో నీరు చేరడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా జీపీ అధికారులు తక్షణమే వార్డులో రోడ్డు, డ్రైనేజీ శుభ్రం చేయాలని, కొత్త సీసీ రోడ్డు, మురుగు కాల్వలు కూడా నిర్మించాలని వీధి నివాసి సందీప్ గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామంలో ఆలయం చుట్టు ఉన్న సందుల్లో సరిపడా రోడ్లు, మురుగు కాల్వలు లేక పోవడంతో ఇళ్లలోని మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం కురిస్తే రోడ్డు బురదమయంగా మారుతోంది. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు నడవలేక నానాపాట్లకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని ఈ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

మాలూరు : తాలూకాలోని తోర్నహళ్లి చెరువు ప్రాంగణంలో కోడి పందేలు ఆడుతుండగా శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్ట్ చేసి రూ. 8,300 స్వాధీనం చేసుకున్నారు.

బొలెరో ఢీకొని బైకిస్టు మృతి

హుబ్లీ: బొలెరో ఢీకొని బైకిస్టు మృతి చెందాడు. ఈఘటన ధార్వాడ పాత ఎస్పీ కార్యాలయం వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. మదిహాళ సిద్ధరూఢ కాలనీ నివాసి రోహిత్ జగదీశ్ కుంబార(20) స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎస్పీ కార్యాలయ సర్కిల్‌లో వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో రోహిత్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కగా సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరు డ్రైవింగ్ చేస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేపట్టారు.

అవయవ దానం

కాగా రోహిత్ తాను మృతి చెందుతూ మరికొందరి జీవితాల్లో వెలుగు నింపాడు. ఉన్న ఒక్క కుమారుడిని కోల్పోయిన రోహిత్ తల్లిదండ్రులు మానవీయతను చాటుకొని కుమారుడి అవయవాలను దానం చేయడానికి అంగీకరించడం అందరికి ఆదర్శప్రాయమైంది.

లారీ, బైక్ ఢీ.. ఇద్దరు దుర్మరణం

రాయచూరు రూరల్: గూడ్స్ లారీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన జిల్లాలోని మాన్వి తాలూకా కప్పగల్ వద్ద చోటు చేసుకుంది. గురువారం రాత్రి కప్పగల్ నుంచి నీరమాన్వికి మాంసం తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక భాగం నుంచి గూడ్స్ లారీ బైక్‌ను ఢీకొనడంతో శాకీర్(25), సాబణ్ణ(23) అనే ఇద్దరు అక్కడికక్కడే మరణించినట్లు సీఐ హిరేమట్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఏటీఎం కార్డు లాక్కెళ్లిన నిందితుడి అరెస్ట్

హుబ్లీ: ఏటీఎం కార్డు లాక్కొని ఉడాయించిన నిందితుడిని కలఘటికి పోలీసులు అరెస్ట్ చేశారు. రాజు దొడ్డమని అనే వ్యక్తి జిల్లాలోని కలఘటిగిలో ఏటీఎం వద్దకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎం కార్డు లాక్కొని ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదుతో సీఐ శ్రీశైలకొజలిగి నేతృత్వంలోని పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడు పాత హుబ్లీ నివాసి అస్పత్ దళవాయిగా గుర్తించి అరెస్ట్ చేశారు. కార్డు, రూ.15 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ గోపాలబ్యాకోడ్ తెలిపారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

హుబ్లీ: అదృశ్యమైన ఓ మహిళ జిల్లాలోని కుందగోళ తాలూకా దేవనూరు గ్రామం వద్ద ప్రవహిస్తున్న బెణ్ణిహళ్ల వాగులో శవమై లభించిన ఘటన జరిగింది. ఇది హత్య అని సదరు మృతురాలి భర్త కుందగోళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తాలూకాలోని వితలాపుర గ్రామానికి చెందిన మంజుల(28) అనే మహిళ గత నెల 29 నుంచి కనిపించకుండా పోయింది. గురువారం శవం లభ్యమైనట్లు సమాచారం అందుకున్న ఈ స్టేషన్ పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని వెలికితీసి హుబ్లీలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృత మహిళతో సంబంధం పెట్టుకున్న ఆ తాలూకాలోని హొసకట్టి గ్రామ యువకుడు సిద్ధ మహాలింగవాడ, అతని తండ్రి విఠ్లేష్ కుమ్మక్కుతో ఈ హత్య జరిగిందని మృతురాలి భర్త చంద్రుగౌడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలఘటిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పంటలను పరిశీలించిన అధికారులు

హొసపేటె: వ్యవసాయ శాఖ ఆహార, పోషకాహార భద్రతా పథకం కింద తాలూకాలో సాగు చేసిన పంటలను వ్యవసాయ జాతీయ సలహాదారు డాక్టర్.పీకే.సాహో పరిశీలించారు. శివపుర గ్రామంలో పర్యటించి మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులతో మాట్లాడారు. పంటల దిగుబడి, ప్రాసెసింగ్ గురించి వివరించారు. పంటలకు పోషకాలు, పురుగుమందుల పిచికారీ చేసే విధానాన్ని తెలుసుకున్నారు. విజయనగరం వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శరణప్ప ముద్గల్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గ్రామీణ రోడ్లు



కంకర తేలిన శంకరబండ, రూపనగుడికి వెళ్లే రోడ్డు



రోడ్డు పక్కనే వేసి ఉన్న ఎరువు దిబ్బ



రోడ్డు పక్కన దెబ్బ తిన్న సిమెంట్ కల్వర్టు

- రోడ్ల పక్కనే ఎరువుల దిబ్బలు
- ఇబ్బందుల్లో వాహనదారులు

సాక్షి, బళ్లారి: రోడ్లు అభివృద్ధికి చిహ్నాలు అంటారు. ఏ గ్రామమైనా, పట్టణమైనా, నగరమైనా రోడ్ల అభివృద్ధిని చూసి, రోడ్లు బాగా ఉంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందినట్లు భావించడం సర్వసాధారణం. గ్రామీణ ప్రాంతాల రోడ్లు నేటికీ అస్తవ్యస్తంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో జనం పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. నిధులు లేకపోతే అభివృద్ధి చేయడం కష్టమే. అయితే నిధులుండి అభివృద్ధి చేయకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. బళ్లారి నగరం నుంచి రూపనగుడికి వెళ్లే 18 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా కనిపిస్తోంది. శంకరబండ వరకు తారు రోడ్డు ఉన్నప్పటికీ పూర్తిగా బీటలు వారింది. రోడ్డుకు అటూ ఇటూ తారు రోడ్డు పూర్తిగా నాశనం కావడంతో పాటు రోడ్డు పక్కన ఎరువు దిబ్బలను వేయడంతో వాహన దారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

దుమ్మూ, ధూళితో అనారోగ్య సమస్యలు

దుమ్మూ, ధూళి, గుంతలు పడిన రోడ్లతో వాహనదారులతో పాటు శంకరబండలో నివసిస్తున్న గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. శంకరబండ నుంచి ధనలక్ష్మి క్యాంప్, కమ్మరచేడు తదితర గ్రామాల మీదుగా వెళ్లే రోడ్లు దయనీయంగా మారాయి. రోడ్డు పొడవునా గుంతలుగా మారడంతో ప్రయాణీకులు, వాహనాలు నడిపే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్లు డ్యామేజ్ కావడానికి అధిక టన్నేజీతో అక్రమంగా ఇసుక రవాణా చేయడం కూడా కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. 20–30 టన్నులకు పైగా ఇసుకను తరలిస్తూ రోడ్లను అధ్వానంగా మారుస్తున్నారని శంకరబండ, ధనలక్ష్మి క్యాంప్ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా పట్టించుకోని పాలకులు

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారినా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పాటు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క బళ్లారి తాలూకాలోనే కాదు జిల్లాలో అన్ని గ్రామాల రోడ్లు అధ్వానంగా కనిపిస్తున్నాయి. జిల్లా అభివృద్ధికి డీఎంఎఫ్, కేఎంఆర్‌సీ నిధులు వేలకోట్లు మూలుగుతున్నా రోడ్లను బాగు చేయడంపై అధికారులు దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సంబంధిత ప్రజాపనుల శాఖాధికారులకు, జిల్లాధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా స్పందించడం లేదని సామాజిక కార్యకర్త వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.